# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

www.janashaktionline.com

సంపుటి : 45 సంచిక : 8 విజయవాడ 20-8-2012 పేజీలు : 12 వెల : రు 5.00



లోపలి పేజీల్లో...

- ప్రపంచ పరివ్యాపిత ప్రజా నిరసనాందోళనలు
- దేశవ్యాపిత ప్రజా ఆందోళనలు
- మానేసర్ ప్లాంటులో 'ఘటన' సాకుగా కార్మికవర్గంపై ప్రమాదకర దాడి
- జన్యుమార్పిడి విత్తనసాగు-ఎందుకూ కొరగాని స్థాయీసంఘం సిఫార్సులు
- విదేశీ ఆధిపత్యంలో పరిశోధనారంగం
- సహజవాయువుపై సామ్రాజ్యవాద, బడాకంపెనీల ఆధిపత్యం
- 'వాన్‌పిక్' భూముల స్వాధీనానికై ముందుకు సాగుతున్న రైతులు


## దుర్భిక్ష ప్రాంతాల్లో సహాయక చర్యలు

## ప్రభుత్వ ఉద్దేశపూరిత నిర్లక్ష్యం

**దేశంలోనూ,** రాష్ట్రంలోనూ ఖరీఫ్ సేద్యం ఆశా, నిరాశల మధ్య కొనసాగుతోంది. తీవ్రవర్షాభావ పరిస్థితుల వలన దేశంలోని 627 జిల్లాలకుగానూ, 306 జిల్లాల్లో ఆగస్టు మొదటి వారానికి సాధారణ వర్షపాతం కంటే 20శాతం తక్కువగా నమోదైంది. వీటిల్లోనూ 94జిల్లాల్లో వర్షపాతం చాలా తక్కువగా నమోదైంది. లక్షలాది ఎకరాల్లో సేద్యం సాగుకాలేదు.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 400 మండలాల వరకు వర్షాభావ పరిస్థితులు నెలకొనగా అందులో 362 మండలాల్లో సాధారణ వర్షపాతం కంటే 20% తక్కువగా నమోదైంది. ఇందులోనూ 27 మండలాల్లో అత్యల్ప (60 నుండి 99%) వర్షపాతం నమోదైంది. 35 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యే పరిస్థితి ఇప్పటికే లేదనే వాస్తవం బయట పడుతున్నది.

జూన్-జూలై నెలల్లో తీవ్రవర్షాభావ పరిస్థితుల వలన సాధారణం కన్నా చాలా తక్కువ వర్షపాతం నమోదయ్యింది. రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల్లో వర్షపాతం చాలా తక్కువగా ఉంది.

జూలై 15కల్లా రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల్లో అత్యధిక భాగం సేద్యం పూర్తి కావాల్సి ఉండగా, నామ మాత్రంగానే సేద్యం జరిగింది. జూలై 5 వరకు సాగుకావాల్సిందీ, సాగైందీ పంటల వారీగా వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

**జులై 5 నాటికి ప్రధానపంటల సాగు (లక్షల హెక్టార్లలో)**

| పంట | సాధారణసాగువిస్తీర్ణం | సాగు కావాల్సింది | సాగైంది |
|---|---|---|---|
| వరి | 26.48 | 1.43 | 0.74 |
| తృణధాన్యాలు | 7.48 | 3.27 | 2.25 |
| పప్పుధాన్యాలు | 8.10 | 2.96 | 1.96 |
| వేరుశనగ | 12.88 | 2.91 | 1.16 |
| పత్తి | 15.67 | 7.13 | 9.04 |

**ఆధారం: ప్రజాశక్తి 4-7-12**

ఈ పట్టికను పరిశీలిస్తే జూలై మొదటి వారం వరకు సాగుకావాల్సిన విస్తీర్ణంలో వరి, పప్పుధాన్యాలు, తృణధాన్యాలు, వేరుశనగ పంటలు సాగు సగం కూడా పూర్తికాలేదు. పత్తి మాత్రం అదనంగా సాగైంది. వర్షాభావ పరిస్థితులవలన వేసిన పంటలు కూడా నీరులేక ఎండిపోవటం, కొన్నిచోట్ల అసలు విత్తనాలే మొలకెత్తక రైతాంగం తీవ్రంగా నష్టపోయారు. అనంతపురం, కర్నూలు జిల్లాల్లో వేరుశనగపంట అత్యధికభాగం ఎండిపోయింది. వర్షాలులేక అనేక లక్షల ఎకరాల్లో పంట సాగుకాలేదు. వరంగల్, అదిలాబాద్, ఖమ్మం, కరీంనగర్ మొదలగు జిల్లాల్లో వేసిన పత్తి నీరులేక ఎండిపోయింది. తృణధాన్యాల, పప్పుధాన్యాల పంటలకు ఇదే పరిస్థితి ఏర్పడింది. జలాశయాల్లో నీరులేక, వరి సేద్యపు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ పరిస్థితిని గమనిస్తే జూలై నెలలోనే రైతాంగానికి జరగాల్సిన నష్టం జరిగిపోయింది. కృష్ణా-గుంటూరు జిల్లాల్లో నారుమళ్ళకు కూడా నీరు లభించని పరిస్థితి ఏర్పడింది. రైతాంగం ఆందోళన చేస్తే, తప్పని పరిస్థితుల్లో నామమాత్రంగా నారుమళ్ళకోసం నీటిని వదిలారు. కోర్టు ఉత్తర్వుల దృష్ట్యా ఆ నీటిని కూడా ఆపివేశారు. అనేక జిల్లాల్లో మంచినీటికి, పశుగ్రాసానికి తీవ్ర కొరత ఏర్పడింది. పశుపోషణ చేయలేక వాటిని కబేళాలకు తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

జులై 10 నుండి రాష్ట్రంలో వర్షాలు పడుతున్నప్పటకీ వరి సేద్యానికి ఉపయోగపడిన పరిస్థితి లేదు. కాల్వలకు నీరు వదలకపోవటంవలన గుంటూరు, క్రిష్ణా, ఉభయగోదావరులు, విశాఖ, విజయనగరం జిల్లాల్లో వరి సేద్యం నామమాత్రంగానే జరిగింది. ఇప్పటికే అత్యధిక విస్తీర్ణంలో సేద్యం జరగాల్సివుంది. క్రిష్ణా డెల్టాలోని అనేక ప్రాంతాల్లో ఇప్పటికే నాట్లు ప్రారంభం కాలేదంటే సాగునీటి సమస్య తీవ్రత అర్థమౌతుంది. ఇటీవల కురిసిన వర్షాలవలన మెట్టపైర్లకు, నారుమళ్ళకు ఉపయోగంతోపాటు నష్టం కూడా జరిగింది. వర్షాల వలన ఏర్పడిన ముంపువలన పత్తి, వరి, వేరుశనగ పైర్లతోపాటు, నారుమళ్ళు ముంపుకి గురై నష్టం జరిగింది. ఈ మధ్య కురిసిన వర్షాలవలన వరదనీరు క్రిష్ణా బ్యారేజీకి చేరటంతో ఆ నీటిని కాల్వలకు వదలటం జరిగింది. కాల్వలకు నీరు ఎంతకాలం వదులుతారనే దానిపై క్రిష్ణా డెల్టాసాగు ఆధారపడి వుంది. ఈ నెలాఖరుకు నాట్లు పూర్తికాకపోతే సేద్యం ప్రశ్నార్థకంగా మారటమే కాకుండా, ఆ తర్వాత వేసినా కూడా దిగుబడులు తగ్గటంతోపాటు, రెండవ పంట వేయటం సాధ్యంకాని పరిస్థితి ఏర్పడుతుంది.

ఈ సంవత్సరం సాధారణ వర్షపాతంకన్నా, తక్కువ నమోదు అవుతుందని, దేశంలోని గణనీయమైన భూభాగంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడతాయని భారత వాతావరణశాఖ ముందుగానే హెచ్చరికలు జారీచేసింది. అయినా పాలకులు పరిస్థితిని ఎదుర్కోవటానికి ముందస్తు చర్యలు తీసుకోలేదు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడి, అపార నష్టం జరిగే పరిస్థితి ఉత్పన్నంకావటం, కరువు పరిస్థితిని ఎదుర్కోవటంలో ప్రభుత్వ వైఖరిపై వచ్చిన విమర్శల నేపథ్యంలో, దేశంలోని 300 జిల్లాలను కరువు ప్రాంతాలుగా పేర్కొని, సహాయక చర్యలకోసం 190 కోట్లను ప్రభుత్వం ప్రకటించింది. మన రాష్ట్రంలోని దుర్భిక్ష ప్రాంతాల నివేదికను రాష్ట్రప్రభుత్వం కేంద్రానికి పంపకపోవటం వలన కేంద్ర ప్యాకేజీలో రాష్ట్రంలోని ఏ ప్రాంతమూ నమోదుకాలేదు.

కరువు నివేదికను తయారుచేయటంలో జాప్యం ఎడల, సహాయక చర్యలు అమలు జరపటంలో వైఫల్యం ఎడల రాష్ట్రప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావటంతో కరువు పీడిత ప్రజలను మభ్యపెట్టేందుకు హడావుడి చర్యలు ప్రారంభించింది. కేంద్రానికి నివేదికలు పంపుతున్నామని, కరువు పరిస్థితులను ఎదుర్కొంటామని మీడియాలో ప్రచారం తీవ్రంచేసింది. కరువు మండలాలను ప్రకటించింది. కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సులు జరిపి క్షేత్రస్థాయిలో పర్యటించి నిర్దిష్ట చర్యలు తీసుకోకపోతే కఠిన చర్యలు తీసుకొంటామని ప్రభుత్వం హెచ్చరించటం చూస్తే, సహాయక చర్యలు అమలు జరగకపోవటానికి కలెక్టర్లనే బాధ్యులుగా చేయపూనుకొంటూ తమవైఫల్యాన్ని కప్పిపెట్టే ప్రయత్నం చేస్తోన్నారని విదితమౌతుంది.

నెలరోజుల క్రితం రాష్ట్రంలోని వర్షాభావ పరిస్థితుల ఎడల వ్యవసాయశాఖ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ ఈ విధంగా చెప్పారు: ఈ సంవత్సరం నైరుతీ రుతుపవనాలు నెలరోజులు వెనకకు తగ్గాయనే విషయాన్ని రైతాంగానికి చేరవేయటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, జులై 15లోపు వర్షాలు కురవకపోతే సేద్యం పరిస్థితి తారుమారౌతుందని, వర్షాభావ పరిస్థితులు కొనసాగితే దాన్ని ఎదుర్కొనేందుకు 15 రకాల పంటలకుగానూ 97వేల విత్తన సంచులను అందుబాటులో ఉంచామని, వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు రైతులకు సూచనలు అందచేస్తారని, పంచాయితీ కార్యాలయాల్లో పంటల వివరాల జాబితా పెడతామని ఆయన చెప్పారు.

(తరువాయి 2వ పేజీలో)

సంపాదకీయం

## తక్షణ కరవు సహాయక చర్యలు

**దేశంలో** కరవు పరిస్థితి నెలకొంది. ఈసారి నైరుతీ రుతుపవనాలు కొద్దిరోజులు ఆలశ్యంగా వచ్చాయి. తర్వాత ఉత్తర దిశగా పయనించినా బలపడలేదు. జూన్ నెలాఖరు నాటికి దేశంలోని విశాల ప్రాంతంలో వానలు కురవలేదు. దేశంలో వర్షపాతం లోటు సరాసరిన 29 శాతంగా వుంది. అయినా ఇంకా వర్షాలు పడతాయన్న ఆశవుంది. జూలై నెలలో వర్షపాతం లోటు సాధారణ స్థాయిలో (90-96 శాతం) వుండవచ్చుని వాతావరణశాఖ అంచనా వేసింది. అయినా జూలై నెల గడిచిపోయినా పరిస్థితి మెరుగుపడలేదు. సగానికిపైగా దేశంలో వర్షం పడలేదు. ఆగస్టునెలపై దింపుడుకళ్లెం ఆశవున్నా పరిస్థితి కరవుగా మారే అవకాశాలే పెరిగాయి.

దీనితో వరి, గోధుమ, తృణధాన్యాలు, పప్పులు, నూనె గింజలకు నాట్లు వేయటం అసాధ్యమైంది. కేంద్రం అంచనాల ప్రకారం 400 జిల్లాల్లో కరవు పరిస్థితులేర్పడ్డాయి. రాష్ట్రంలో నీటిపారుదల వున్న డెల్టాలోనే 25 శాతం భూమిలో నాట్లు పడలేదు. సగం మండలాలు తీవ్ర కరవు బారిన పడబోతున్నాయి గత 11 సంవత్సరాలలో ఇది నాల్గవ కరవు. ఇదే చివరిదీ కాబోదు.

దేశంలో పరిస్థితి ఇలా వుండగా, అంతర్జాతీయంగా కూడా కరవు నెలకొంది. ఈ శతాబ్ధంలోనే తీవ్రమైన ఎండవేడిమితో అమెరికాలోని గోధుమపంట ఎండిపోయింది. దిగుబడులు 77 శాతం ఉంటాయని మే నెలలో అంచనావేయగా, జూలై నెలాఖరుకు 24 శాతం గోధుమ, మొక్కజొన్న పంట మాత్రమే చేతికందుతుందన్న అంచనాకు అమెరికా వ్యవసాయశాఖ వచ్చింది. కెనడా దేశంలోనూ, రష్యాలోని నల్ల సముద్ర ప్రాంతం లోనూ కరవు వల్ల దిగుబడులు బాగా తగ్గుతాయని అంచనా వేశారు. ఉక్రెయిన్‌లో వరుసగా వచ్చిన తీవ్ర ఎండవేడిమి, వరదలు కరవుతో ఎగుమతి చేయటానికి మిగులు గోధుమ ఉండదని అంటున్నారు.

పశ్చిమ ఆస్ట్రేలియాలో తీవ్ర ఎండవేడిమి, వర్షాలు పడక పోవటంతో గోధుమ పంట దెబ్బతింది. దిగుబడులు 40 శాతం తగ్గుతాయని అంచనా. మెక్సికోలో కూడా గోధుమ, మొక్కజొన్న పంట దెబ్బతింది. 'నేచర్ జియోసైన్స్' పత్రిక గత వందేళ్లలో అతిపెద్దదైన కరవు పరిస్థితి దక్షిణకెనడానుండి, అమెరికా సంయుక్తరాష్ట్రాలు, ఉత్తర మెక్సికో వరకు ఉత్తర అమెరికా ఖండంలో ఏర్పడుతుందనీ, దీని దుష్ఫలితాలు మరో ఐదేళ్లపాటు వెన్నాడుతాయనీ హెచ్చరించింది.

ఈ వార్తలు రావటంతో చికాగో మార్కెట్టులో గోధుమ ధరలు జూలైలో గత నెల కంటే 28 శాతం పెరిగాయి. మొక్కజొన్న, సోయా ధరలు కూడా పెరిగే దిశగానే వున్నాయి. ఈ ధరల పెరుగుదల ఫలితంగా, ఈ దేశాలు ఎగుమతి చేసే ఆహార ధాన్యాలలో, 40 శాతం దిగుమతి చేసుకునే ఆసియా దేశాలలోని పేద ప్రజలు ఆకలిబారిన పడతారు. ఆఫ్రికాలో 40 శాతం ప్రజలకు రోజుకు ఒక డాలరు కంటే తక్కువ ఆదాయం వున్నందున ధాన్యం ధరల పెరుగుదల వారిని ఆకలి బారిన పడవేస్తుంది. "భారత్‌లో కరవు పరిస్థితివల్ల బియ్యం అందుబాటు తగ్గుతుంద"ని ఐరాస ఆహార వ్యవసాయ సంస్థ హెచ్చరించింది. కాగా "ఇప్పటికే 100 కోట్ల ప్రపంచ ప్రజలు ఆకలికి గురౌతుండగా, ధాన్యం ధరలు పెరిగితే, కుటుంబాలు తమ పిల్లల చేత చదువులు మాన్పిస్తాయనీ, ఇది జీవితకాలం పాటు సామాజిక, శారీరక, మానసిక దుష్ప్రభావాన్ని కోట్లాది బాలలపై వేస్తుందని ప్రపంచ బ్యాంకు హెచ్చరించింది.

అయినా మార్కెట్టు శక్తుల అరాచకత్వం పెరిగిపోతున్నది. కరవుతో ధరలు పెరుగుతాయని చట్టా వ్యాపారులు ధాన్యంతో జూద వ్యాపారానికి దిగారు. "దిగుబడులు మెరుగుపడతాయన్న ఆశ అడుగంటింది... తర్వాతి చర్య ఏమంటే పంటతగ్గిన మేరకు రేషను పెట్టడమే. ఈ రేషన్ను డిమాండుపై పెట్టేపని ధరలే చూసుకుంటాయి. (అంటే పెరిగే ధరలు, కొనుగోలును తగ్గించటం ద్వారా రేషను పెట్టడం -సం) అయితే ఆ ధరలకు ఎంత మంది ధాన్యం కొనగలరన్నదే చర్చించాలి"-అని రాబో బ్యాంకు విశ్లేషించాడు. ఆయన చర్చ ప్రజలకు ఆహారం అందదేమోననికాదు. ధరను ఏ మేరకు పెంచితే తనదగ్గరి ధాన్యం అంతా ప్రజలు కొని తమకు లాభం ఎంత తెచ్చి పెట్టగలరన్నదే! లాభాల వేట ఎంత నిర్దయగా సాగుతుంది!?

ఇంత తీవ్ర పరిస్థితి ఏర్పడుతున్నా భారత ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగానే వ్యవహరిస్తున్నది. ఆహార భద్రతా చట్టం గురించి చర్చోపచర్చలు సాగిస్తున్న భారత ప్రభుత్వం కరవు పరిస్థితులేర్పడబోతున్నాయన్న సూచనలుండగానే జూన్‌నెలలో 20 లక్షల టన్నుల గోధుమలను ఎగుమతి చేయాలని నిర్ణయించింది. దీనికి చెప్పిన కారణం ధాన్యం నిల్వచేసేందుకు గోదాములు ఖాళీగా లేవట. భారత ప్రభుత్వం ప్రజా వ్యతిరేకమైనదనటానికి ఇంతకన్నా తార్కాణమేమి కావాలి?!

ప్రభుత్వ గోదాముల్లో ప్రస్తుతం కోటి టన్నుల గోధుమ, బియ్యం వున్నాయి. (గతంలో రెండు కోట్ల టన్నుల ధాన్యం నిల్వచేసిన సందర్భమూ వుంది.) ఈ నిల్వలను ప్రజలకు ఆహారాన్ని అందుబాటులోకి తెచ్చేవిధంగా ఉపయోగించాలి. ఎగుమతులు మానివేయాలి. చౌక ధరల దుకాణాల ద్వారా గోధుమ, బియ్యం అమ్మకాలు (తరువాయి 2వ పేజీలో)

# ప్రపంచ పరివ్యాపిత ప్రజా నిరసనాందోళనలు

### పాలస్తీనా : అంతర్జాతీయ సంఘీభావ సదస్సు

ఇజ్రాయిల్ దురాక్రమణకు వ్యతిరేకంగా పోరాడుతున్న పాలస్తీనా ప్రజలకు సంఘీభావాన్ని తెలిపేందుకు ఒక అంతర్జాతీయ సదస్సు జరిగింది. పాలస్తీనాలోని రమల్లాలో 2012 మార్చి 22-24 తేదీల్లో ఈ సదస్సును నిర్వహించారు. 23వ తేదీన-పాలస్తీనాపై ఇజ్రాయిల్ దురాక్రమణను, అది తరచూ చేస్తున్న దాడులనూ నిరసిస్తూ ఒక ధర్నా జరిగింది. 120 దేశాలలో సభ్యులను కలిగివున్న 'ప్రపంచ కార్మిక యూనియన్ల సమాఖ్య' (డబ్ల్యు.ఎఫ్.టి.యు) ఈ సదస్సులో పాల్గొని, ఈ నిరసన ధర్నాను నిర్వహించింది.

### ఆఫ్ఘనిస్తాన్ : హింసను నిరసించిన మహిళలు

2012 ఏప్రిల్ 14న 'యంగ్ ఉమెన్ ఫర్ ఛేంజ్' సంస్థ ఆధ్వర్యంలో మహిళలపై హింసను ఖండిస్తూ, 'న్యాయం ఎక్కడుంది' అనే ప్లకార్డులను ప్రదరిస్తూ ఒక నిరసన ధర్నాను నిర్వహించారు.

### ఇజ్రాయిల్ : పాలస్తీనాకు మద్దతుగా ఆందోళన

2012 ఏప్రిల్ 15న, ఇజ్రాయిల్ ఆక్రమిత పాలస్తీనా ప్రాంతాలలోకి ప్రవేశించటం రూపంలో నిరసనలు తెలిపారు. తమ ఆక్రమిత ప్రాంతంలోకి నిరసనకారులను జొరబడనీయకుండా ఇజ్రాయిల్ ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతా చర్యలను చేపట్టింది.

'బెన్‌గురియన్' అంతర్జాతీయ నావికా కేంద్రానికి చేరుకున్న 27మంది కార్యకర్తలను ఇజ్రాయిల్ ప్రభుత్వం అరెస్టు చేసింది. 'పాలస్తీనాకు స్వాగతం' అనే బ్యానర్‌ను ప్రదర్శించిన ఇజ్రాయిల్‌లోని పాలస్తీనా మద్దతుదారులను ప్రభుత్వం నిర్బంధించింది. ఈ ఆందోళనతో ఇజ్రాయిలీ ప్రభుత్వం విమాన ప్రయాణాలను తాత్కాలికంగా రద్దుచేసింది. 'వెస్ట్‌బ్యాంకు ప్రాంతంలో చెట్లు నాటటం'వంటి అహింసాయుత కార్యక్రమాలను చేపట్టడానికే నిరసనకారులు పథక రచన చేసుకున్నారు. టెల్-అవీవ్‌నుండి బయటకు పోనీయకుండా ప్రయాణ మార్గాలను రద్దుచేయటంతో కార్యకర్తలు ప్యారిస్, బ్రస్సెల్స్‌లో ఆకస్మిక ధర్నాలను చేపట్టారు.

### బెహరైన్ : గ్రాండ్ ప్రిక్స్ కార్‌రేసులకు నిరసన

2012 ఏప్రిల్ 22న, బెహరైన్‌లోని మనేమాలో, ఏప్రిల్ 25-27 తేదీల మధ్య నిర్వహించబోతున్న 'ఫారులా వన్ గ్రాండ్ ప్రిక్స్' కార్ రేస్‌ను వ్యతిరేకిస్తూ వేలాదిమంది ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసన తెలియజేశారు. హమీద్ రాజరిక పాలనకు బదులుగా వారు ప్రజాస్వామ్యాన్ని కోరుతున్నారు. ప్రజాస్వామ్యం పట్ల ప్రజల వాంఛలకు విరుద్ధంగా బ్రిటన్, అమెరికావంటి సామ్రాజ్యవాద దేశాలకు చెందిన కొన్ని సంస్థలు రాజుకు నిధులందిస్తూ, గ్రాండ్‌ప్రిక్స్ రేసులవంటి వాటిని నిర్వహిపజేస్తూ, అతని పరపతిని పెంపొందించేందుకు ప్రయత్నిస్తున్నాయని నిరసనకారులు ఆరోపించారు.

### డెట్రాయిట్ : 'జనరల్ మోటార్స్' ఎగేసిన పన్నుల చెల్లింపుకై డిమాండ్

2012 ఏప్రిల్ 25న, డెట్రాయిట్‌లో జనరల్ మోటార్స్ వాటాదారుల వార్షిక సమావేశాన్ని వేలాదిమంది నిరసనకారులు చుట్టుముట్టి, ఆదాయానికనుగుణంగా జనరల్ మోటార్స్ యాజమాన్యం, ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా ఎగవేయటాన్ని నిరసించి, వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. నీగ్రోలు, శ్వేతజాతీయులు, వృద్ధులు, యువకులు ఈ నిరసనలో పాల్గొన్నారు.

### మలేసియా : మచ్చలేని ఎన్నికల నిర్వహణకై ప్రదర్శన

2012 ఏప్రిల్ 28న, 25వేలమందికిపైగా నిరసనకారులు సెంట్రల్ కౌలాలంపూర్‌లోని ఇండిపెండెన్స్ స్క్వేర్‌వద్దకు సమీకృతులై జూన్‌లో నిర్వహించబోయే ఎన్నికలకు ముందుగానే ఎన్నికల విధానాలనన్నింటినీ సమగ్రంగా మరామత్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో ప్రజాసమీకరణలను రద్దుచేస్తూ, నిషేదాజ్ఞలు విధించటాన్ని ఆందోళనకారులు వ్యతిరేకించారు. పౌరస్వేచ్ఛలను విస్తరిస్తానని ప్రధానమంత్రి చేసిన వాగ్దానంపై సందేహాలు వెలిబుచ్చారు. వందలాదిమంది నిరసనకారులను ఇండిపెండెన్స్‌స్క్వేర్ చేరుకోనీయకుండా నిరోధించటంపట్ల వారు ఆగ్రహం వ్యక్తంచేశారు.

### వియత్నాం : భూముల గుంజివేతకు నిరసన

వియత్నాంలోని నాం-థింస్ ప్రావిన్స్‌కు చెందిన రైతాంగం, 2012 మే మొదటివారంలో-'బావోమింష్ ఇండస్ట్రీ పార్కు' నిర్మాణానికి కావలసిన భూములకోసం, తమపంట పొలాల గుంజివేతను నిరసిస్తూ పోలీసులతో ఘర్షణకు దిగారు.

### లండన్ : కుడంకులమ్ అణువిద్యుత్తు కేంద్రానికి నిరసన

2012 మే 18న, లండన్‌లో అణువిద్యుత్ వ్యతిరేక, మానవహక్కుల-సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో, మనదేశంలో తమిళనాడు రాష్ట్రంలోని కూడంకులమ్ అణువిద్యుత్ కేంద్రాన్ని నిలిపివేయాలని, ఆందోళనకారులపై బనాయించిన కేసులను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ ఒక ప్రదర్శన నిర్వహించారు. 'మరిన్ని చెర్నోబిల్లులు వద్దు' 'మరిన్ని ఫుకిషిమాలు వద్దు' అనే ప్లకార్డులను వారు ప్రదర్శించారు.

### జర్మనీ : 'ఫ్రాంక్‌ఫర్ట్ ఆక్రమించండి' నిరసన ప్రదర్శన

2012 మే 19న, జర్మనీలోని వ్యాపారకేంద్రం మరియు జిల్లాకేంద్రమైన ఫ్రాంక్‌ఫర్ట్ డౌన్ నగరంలో 20వేలమందికి పైగా ప్రజలు సమీకృతులై, బ్యాంకుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా నిరసనలు తెలిపారు. ఈ నిరసన గ్రూపు తనకు తానుగా 'బ్లాకుపి' అని ప్రకటించుకొంది.

### తైవాన్ : ధరల పెంపుకు వ్యతిరేకత

2012 మే 19న, 50వేల మంది ప్రజలు-విద్యుత్తు, ఇంధన ఛార్జీల పెంపుదలను నిరసిస్తూ, అధ్యక్షుని వివాదాస్పద విధానాలను నిరసిస్తూ ప్రదర్శన చేశారు. ఈ నిరసన, ప్రతిపక్షమైన డెమోక్రటిక్ ప్రోగ్రెస్వ్ పార్టి ఆధ్వర్యంలో జరిగింది.

### లండన్ : టోనీబ్లెయిర్‌ను 'యుద్ధనేరస్థుని'గా ప్రకటించాలని ఆందోళన

2012 మే 28న, డేవిడ్ లాలే వాకెలిన్ అనే యుద్ధ వ్యతిరేక ఆందోళనకారుడొకరు, లేబర్‌పార్టీ మాజీ ప్రధానమంత్రి టోనీబ్లెయిర్ న్యాయవిచారణలో భాగంగా సాక్ష్యమిస్తుండగా, న్యాయస్థానంలోకి దూసుకువచ్చాడు. ఇరాక్‌ను దురాక్రమించటంలో 'యుద్ధ నేరాలకుగానూ బ్లెయిర్‌ను అరెస్టు చేయాల'ని గట్టిగా నినదించాడు. అతను బ్లెయిర్‌ను 'యుద్ధ నేరస్తుడని' పేర్కొంటూ, 'ఇరాక్ యుద్ధానికిగానూ జె.పి.మోర్గాన్, బ్లెయిర్‌కు చెల్లించివేశాడ'ని ఆరోపించాడు.

### కెనడా : న్యాయవాదుల నిరసన

2012 మే 30వ తేదీన, మాంట్రియల్‌లో-విద్యార్థుల సమ్మెలను, ఆందోళనను నిషేదిస్తూ ప్రభుత్వం రూపొందించిన బిల్.నెం.78 చట్టాన్ని నిరసిస్తూ, క్రూరమైన చట్టంగా దానిని పేర్కొంటూ న్యాయశాస్త్రంలో నిష్ణాతులైన న్యాయవాదులు, నోటరీలు 700 మంది ప్రదర్శన నిర్వహించారు.

### జపాన్ : అణు కర్మాగారాల వ్యతిరేక ప్రదర్శనలు

జపాన్‌లో ఫుకిషిమా అణువిద్యుత్ కేంద్రవినాశనం తర్వాతక్రమంలో చెలరేగిన నిరసనాందోళనల నేపథ్యంలో, ప్రభుత్వం అణువిద్యుత్ కేంద్రాలన్నింటినీ వరుసగా మూసివేసింది. వీటిలో 2012 మే 5న, చివరి అణువిద్యుత్ కేంద్రం మూసివేతకు గురౌతున్న సందర్భంగా ప్రజలు సంబరాలు జరుపుకున్నారు. 'అణువిద్యుత్ కేంద్రానికి వీడ్కోలు' అనే బ్యానర్లను ప్రదర్శించారు.

కానీ, అత్యంత తక్కువ సమయంలోనే జపాన్ ప్రభుత్వం జపాన్ పశ్చిమ తీరంలోని రెండు అణువిద్యుత్ కేంద్రాలను తిరిగి ప్రారంభించాలనుకోవటంతో ప్రజల ఆందోళనలు తిరిగి వూపందుకున్నాయి.

2012 జూన్ 10న టోక్యోలో ప్రధాని నివాసం ఎదురుగా ఒక భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. తిరిగి జూన్ 23న ప్రభుత్వం మూసివేసిన అణువిద్యుత్ కేంద్రాలను తిరిగి తెరవాలనే నిర్ణయాన్ని నిరసిస్తూ-వేలాదిమంది ప్రజానీకం ఓహి నగరంలో ప్రదర్శన నిర్వహించారు. తిరిగి జూన్ 29న, పదులవేల సంఖ్యలో ప్రజలు సమీకృతులై టోక్యోలోని ప్రధాని నివాసం ఎదురుగా నిరసన తెలియచేస్తూ బైఠాయింపు జరిపారు. జూన్ 30న -తిరిగి ప్రారంభించనున్న ఓహి అణువిద్యుత్ కేంద్ర ద్వారంవద్ద జమకూడిన పదుల సంఖ్యలో నిరసనకారులు, ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని నినదించారు.

2012 జులై 16న టోక్యోలో ఇదే సమస్యపై రెండు లక్షలమందితో భారీప్రదర్శన-నిరసన ధర్నా నిర్వహించారు. అణువిద్యుత్‌ను జపాన్ పూర్తిగా నిషేదించాలని వారు డిమాండ్ చేశారు. నోబెల్ బహుమతి గ్రహీత, నవలాకారుడు కెన్‌జాబురో ఓయే, ఇతర ప్రముఖ కళాకారులు ఈ నిరసన ప్రదర్శనకు నాయకత్వం వహించారు.

### అమెరికా : నాటో వ్యతిరేక నిరసన ప్రదర్శనలు

2012 మే 17న, చికాగోలోని 'నాటో' సభ్యదేశాల రాయబార కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఆ ప్రాంతంలో నాటో సదస్సు జరగనుండటంతో ప్రదర్శనకారులు ఈ కార్యక్రమం చేపట్టి 'నాటో-వద్దు' 'పిల్లలతో సహా ప్రజలందరినీ హతమార్చే పైలెట్‌రహిత విమాన దాడులను ఆపాలి-యుద్ధాన్ని ఆపాలి' అని నినదించారు.

2012 మే 20న, చికాగోలో వేలాదిమంది యుద్ధవ్యతిరేక ప్రదర్శనకారులు, యుద్ధ వ్యతిరేక భారీధర్నాను నాటో సదస్సు జరుగుచున్న ప్రదేశం ఎదురుగా నిర్వహించారు. 'నాటో' సైనికులు సాగిస్తున్న పైలెట్ రహిత విమాన దాడులకు, యుద్ధానికి అనేకమందిని బలిగావించటాన్ని వ్యతిరేకిస్తూ, కొందరు వృద్ధులైన అమెరికా యుద్ధవీరులు తమకు ఆనాడు బహూకరించిన పతకాలను ఈ సందర్భంగా విసిరిపారేశారు. 70మంది నిరసనకారుల అరెస్టులను, వారిని గాయపరచటాన్ని ఆందోళన సందర్భంగా తీవ్రంగా నిరసించారు.

### పాకిస్తాన్ : యుద్ధ సరఫరా కేంద్రాలు తెరిచినందుకు దీర్ఘప్రదర్శన

2012 జులై 8న, ఆఫ్ఘనిస్తాన్‌లోని 'నాటో' సేనలకు సరఫరాలను చేరవేసేందుకుగానూ పాకిస్తాన్ ఆమోదంతెల్పి, తదనుగుణంగా పాకిస్తాన్‌లో కొన్ని కేంద్రాలను తెరవటాన్ని నిరసిస్తూ కొన్ని రాజకీయపార్టీల ఆధ్వర్యంలో లాహోర్‌నుండి ఇస్లామాబాద్ వరకూ సుదీర్ఘ ప్రదర్శన ప్రారంభించారు. జులై 9వ తేదీ అర్థరాత్రి పార్లమెంట్ సమీపంలోని ఓ స్థలం వద్దకు 20వేలమంది నిరసనకారులు చేరుకుని, నలుపు-తెలుపు జెండాలను వూపుతూ, అమెరికాకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినదించారు.

### హోండూరస్ : శాంతి ప్రదర్శన

2012 జూన్ 10న, హోండూరస్‌లోని 214 మునిసిపల్ పట్టణాల మేయర్ల నాయకత్వంలో వేలాదిమంది ప్రజలు తెగుసిగుల్ప వరకు శాంతి ప్రదర్శనను నిర్వహించారు. దేశంలో అభద్రతా వాతావరణాన్ని వారు నిరసించి, శాంతిస్థాపనకోసం నినదించారు. మధ్య అమెరికాలో హింసకు పేరుగాంచిన హోండూరస్‌లో వీరంతా హింసను తీవ్రంగా ఎలుగెత్తి నిరసించారు.

### రష్యా : సిరియాలో విదేశీ జోక్యానికి నిరసన

సిరియా సంక్షోభాన్ని సాకుగా తీసుకొని అమెరికా, దాని నాటో కూటమి దేశాలు, ఆ దేశంలో జోక్యం చేసుకోవటాన్ని నిరసిస్తూ, జులై 30వ తేదీన మాస్కోలోని అమెరికా రాయబార కార్యాలయం ఎదుట ఒక నిరసన ప్రదర్శన నిర్వహించారు. 'లిబియాలో చేసిన తరహా ప్రయత్నాలు సిరియాలో అనుమతించబడవు' అనీ, 'అమెరికా నియంతృత్వం నశించాలి' అనీ నినదించారు.

### ఇజ్రాయిల్ : సామాజిక న్యాయాన్ని కోరుతూ భారీ ధర్నా

2012 జూలై 1న, టెల్-అవీవ్‌లోని మ్యూజియం కూడలిలో వేలాదిమంది ప్రజలు జమకూడి, సామాజిక న్యాయాన్ని డిమాండ్‌చేస్తూ ఒక తీర్మానాన్ని ఆమోదించారు. ధనిక-పేదల మధ్య సామాజిక-ఆర్థిక అంతరాలు, సామాజిక అసమానతలను అంతమొందించాలనేది ఆ తీర్మాన సారాంశంగా వుంది. అనంతరం వారొక నిరసన ప్రదర్శన-ధర్నా నిర్వహించారు.

### జోర్డాన్ : ప్రతిరోజూ ధరల పెరుగుదలకు తీవ్ర నిరసన

అంతులేని నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు, పేదరికం పెరుగుదలకు వ్యతిరేకంగా జూన్ ఒకటో తేదీన, జోర్డాన్ దేశవ్యాపితంగా నిరసన ధర్నాలను నిర్వహించారు. ధరలను అదుపు చేయలేని ప్రభుత్వాన్ని అధికారంనుండి తప్పుకోవలసిందిగా వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం అమలుచేస్తున్న పొదుపు చర్యలను నిరసిస్తూ, పొదుపు చర్యల విధానాన్ని రద్దుచేయాలని వారు డిమాండ్ చేశారు.

### జర్మనీ : నయా నాజీలను వ్యతిరేకిస్తూ నిరసన ధర్నా

జూన్ 4న, బెర్లిన్‌లో నయా నాజీల పాలనను నిరసిస్తూ, జాతి వివక్ష విధానాల్ని ఖండిస్తూ భారీ ధర్నాను నిర్వహించారు. రాజకీయ నాయకులు, ట్రేడ్ యూనియన్ నాయకులు, సామాజిక కార్యకర్తలు-జాతివివక్షతను, జాత్యహంకారాన్ని, నయానాజీల హింసను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఈ భారీ ధర్నాలో పాల్గొన్నారు.

### గ్రీస్ : నయా నాజీ దాడులకు వ్యతిరేకత

గ్రీస్‌లో-ఒక ట్రేడ్ యూనియన్ చర్చల సందర్భంగా అత్యంత మితవాద పార్టీకి చెందిన సభ్యుడొకరు, వామపక్ష నాయకునిపై భౌతిక దాడికి పాల్పడ్డాడు. ఈ నయా-నాజీ చర్యను ఖండిస్తూ జూన్ 9వ తేదీన గ్రీస్ దేశమంతటా నిరసనాందోళనలు పెల్లుబికాయి. ఏథెన్స్‌లోనూ, ఇతర నగరాలలోనూ భారీ ధర్నాలు-ప్రదర్శనలు నిర్వహించి, 'నయా నాజీలకు స్థానంలేద'ని నినదించారు.

### లండన్ : ఎలిజబెత్ మహారాణి పుట్టిన రోజు వేడుకలపట్ల వ్యతిరేకత

ఆర్భాటంగా సాగుతున్న బ్రిటిష్ మహారాణియొక్క 75వ పుట్టినరోజు వేడుకలను నిరసిస్తూ లండన్‌లో జూన్ 3, మరియు 5 తేదీలలో నిరసన ధర్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాస్వామిక విలువలపై దాడిసాగిస్తున్న నిరంకుశ రాచరికవ్యవస్థను వీరంతా నిరసించారు. బ్రిటిష్ సింహాసనముపై మరెవ్వరూ అధిరోహించ అవకాశంలేని నిరంకుశ విధానాన్ని, జాతివివక్షగా వారు విమర్శించారు. 'ప్రజలకే పాలన' 'మేము ప్రజాస్వామ్యం కోరుకుంటున్నాం-నిరంకుశత్వం కాదు' వంటి నినాదాలు చేశారు.

### సూడాన్ : ధరల పెరుగుదలకు వ్యతిరేకత

జూన్ 3వ వారం నుండి, దేశవ్యాపితంగా సూడాన్ ప్రజానీకమంతా ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా, తరుగుతున్న జీవన ప్రమాణాలను నిరసిస్తూ ఆందోళనలు నిర్వహించారు. సూడాన్ రాజధాని నగరం క్రూడూమ్‌తో సహా ఓడుమాన్, పోర్టు సూడాన్, మాదిని, అటాబారా మరియు కోస్టి ప్రాంతాలలో 10 రోజులపైగా వరుసగా ఆందోళనలు నిర్వహించారు. వేలాదిమంది విద్యార్థులు, యువకులు, కార్మికులు మరియు నిరుద్యోగులు వీధుల్లోకి వచ్చి ఈ ధర్నా ఆందోళనల్లో పాల్గొన్నారు

### అమెరికా : 'వాల్‌మార్ట్'కు భారీస్థాయి నిరసన

అమెరికాలోని-లాస్‌ఏంజెల్స్ రాష్ట్రం-చైనా నగరంలో రీటైల్ దిగ్గజం వాల్-మార్ట్ ప్రవేశాన్ని నిరసిస్తూ ప్రదర్శన-ధర్నా నిర్వహించారు. తమ నగరంలో వాల్-మార్ట్ ప్రవేశంతో చిన్నదుకాణదారులంతా ఉపాధి కోల్పోతారని, పైగా వాల్-మార్ట్‌వంటి బడా రిటైల్ దిగ్గజాలు తమ మాల్స్‌లో పనిచేసే కార్మికులకు కనీసపాటి వేతనాలుకూడా చెల్లించవనీ, బీమాసౌకర్యం కల్పించవనీ పేర్కొంటూ 2013 నాటికి చైనా నగరంలో ప్రారంభించతలపెట్టి నిర్మాణం మొదలుపెట్టిన వాల్‌మార్టు స్టోర్సు నిర్మాణ ప్రాంతంలోనే భారీ నిరసన ధర్నా నిర్వహించారు. **(తరువాయి 5వ పేజీలో)**

# దేశ వ్యాపిత ప్రజా ఆందోళనలు

### ఢిల్లీ : పాలసేకరణదారుల నిరసన

2012 ఏప్రిల్ 21న, ఢిల్లీ పరిసర ప్రాంతల పాల ఉత్పత్తి కేంద్రాల యజమానులతో కలసి పాల సేకరణదారులు, క్యాన్లకొద్దీ పాలను నేలపై పారబోసి, ప్రైవేటు కంపెనీల, ప్రైవేటు ఫెడరేషన్ల యొక్క 'దోపిడీ'ని అరికట్టటంలో ప్రభుత్వం యొక్క నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ-జంతర్‌మంతర్ వద్ద-ఆందోళన చేపట్టారు.

### ఇంఫాల్ : మహిళల బైఠాయింపు ఆందోళన

2012 ఏప్రిల్ 24, పెద్దసంఖ్యలో మహిళలు ఇంఫాల్‌లోని ఉరిపాక్ యాంబెమ్ లైకా వద్ద బైఠాయింపు ఆందోళన చేపట్టారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో విద్యనభ్యసిస్తున్న మణిపూరీ విద్యార్థుల భద్రతపట్ల ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఏప్రిల్ 18న, బెంగుళూరులో, తన సీనియర్ విద్యార్థుల చేతిలో మణిపూరీ అర్కిటెక్చర్ విద్యార్థి హత్యను వారు నిరసించారు.

### ఢిల్లీ : శిక్కుమతస్థుల నిరసన ధర్నా

2012 ఏప్రిల్ 27న, 1984-శిక్కు వ్యతిరేక అల్లర్లలో బాధితుల బంధువులు, ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ బాన్, గౌరవ డాక్టరేటు స్వీకరించే జామియా మిలియా విశ్వవిద్యాలయం బయట ధర్నా చేపట్టారు. శిక్కుల హత్యలకు కారకులైన కాంగ్రెసు పార్టీ నాయకులతో బాన్ చర్చలు జరపరాదని వారు డిమాండ్ చేశారు.

### ఆదిలాబాద్ : ఐటిడిఏ కార్యాలయాన్ని చుట్టుముట్టిన ఆదివాసీలు

2012 ఏప్రిల్ 28న, ఆంధ్రప్రదేశ్‌లోని ఆదిలాబాద్ జిల్లా- ఉట్నూరు పరిసర 40 గ్రామాలనుండి వందలాది మంది ఆదివాసులు జమకూడి ఐటిడిఏ కార్యాలయాన్ని చుట్టుముటారు. 'కవాల్ వైల్డ్ లైఫ్ శాంక్చురీ'ని పెద్దపులి సంరక్షితప్రాంతంగా ప్రకటించటాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, ఆదేవిధంగా టైగర్ రిజర్వ్‌నురద్దు చేయాలని కోరుతూ వారు ఆందోళన సాగించారు.

### జమ్ము&కాశ్మీర్ : వ్యక్తుల అదృశ్యాలకు నిరసన

2012 మే 10న, శ్రీనగర్‌లో-ఇటీవలికాలంలో ఇళ్ళనుండి ఆదృశ్యమైపోయిన వ్యక్తుల ఆచూకీ తెలపాలని డిమాండ్ చేస్తూ, ఆయా వ్యక్తుల బంధువులు పెద్ద సంఖ్యలో జమకూడి ధర్నా నిర్వహించారు.

### కమ్యూనిటీ రేడియోల లైసెన్సు ఫీజు పెంపుకు నిరసన

మే 8న అనేక పౌర సమాజాల ఆధ్వర్యంలో నిర్వహింపబడే సామాజిక రేడియోకేంద్రాలు వాటి లైసెన్స్ ఫీజు పెంపుదలను వ్యతిరేకిస్తూ, తమ ప్రసారాలను నిలిపివేసి మౌనంగావుండిపోవటం ద్వారా నిరసన తెలియజేశాయి. వాటి లైసెన్స్ ఫీజు పెంపుదలను వెనువెంటనే వెనక్కుతీసుకోవాలని డిమాండ్ చేశాయి. "లైసెన్స్ ఫీజుల పెంపుదలతో ధనిక ప్రభుత్వేతర సంస్థలు, ప్రైవేటు విశ్వవిద్యాలయాల చేతిల్లోకి వెళ్ళిపోయి, కమ్యూనిటీ రేడియోల ద్వారా కలిగే ప్రయోజనాలపట్ల స్పృహ పెరుగుతున్న సమయంలో వాటి ఏర్పాటు మౌలిక లక్ష్యాన్ని దెబ్బతీస్తుంద"ని వారు పేర్కొన్నారు.

### బీహార్ : మునిసిపల్ ఎన్నికల బహిష్కరణ రూపంలో నిరసన

ఇటీవల పాట్నాలో జరిగిన మునిసిపల్ ఎన్నికల సందర్భంగా పెద్దసంఖ్యలో ప్రజలు ఎన్నికలను బహిష్కరించి, మునిసిపల్ ఎన్నికల పోలింగ్ తేదీ నాడు నిరసన బైఠాయింపులు చేపట్టారు.

### హర్యానా : దళితులపై దౌర్జన్యాలకు నిరసన

హర్యానారాష్ట్రం-హిస్సార్‌కు సమీపంలోని భాగర గ్రామంలో, తమ గ్రామంలో భూములను తమకు దక్కనీయకుండా, గ్రామ ఉమ్మడి వనరులలో తమకు ఎలాంటి ప్రవేశం లేకుండా గ్రామ అగ్రకులాల కుట్రలు, కుయుక్తులను నిరసిస్తూ 70 దళిత కుటుంబాల ప్రజానీకం తమ గ్రామాన్ని వీడి బయటకు రావటం రూపంలో నిరసన తెలిపారు. హిస్సార్ పోలీసు డిప్యూటి కమీషనర్ కార్యాలయం ఎదుట వారు ఒక శిబిరం ఏర్పాటు చేసుకొని మే 20వ తేదీ నుండి నిరసన తెలియజేస్తున్నారు.

2008లో ప్రభుత్వం వాగ్దానం చేసిన విధంగా తమకు ఇళ్ళస్థలాలు కేటాయించాలని దళితులు (ఛమర్లు) డిమాండ్ చేస్తూండగా, గ్రామంలో అధిపత్యకులానికి చెందిన జాట్లు 'సాంఘిక బహిష్కరణ' రూపాలతో వారిని నిరోధిస్తున్నారు. దళితులు, మంచినీటికోసం ఇతర అవసరాలకోసం ఉపయోగించుకునే కుంటలు ఎండిపోయాయి. దళితుల పిల్లలు ఆడుకునేందుకు ప్రధానంగా ఉపయోగించుకునే ఆటస్థలాన్ని తవ్వివేశారు. అనేక మంది ఛమర్ల ఇళ్లకు వెళ్ళే దోవలను అడ్డగిస్తూ ఆరడుగుల ఎత్తైన గోడలను నిర్మించారు.

తమను అణిచివేస్తున్న, గ్రామంలోని భూములను కబ్జాచేస్తున్న, గ్రామంలోని అగ్రకుల భూస్వాములను శిక్షించాలని వారు డిమాండ్ చేసారు.

### మహారాష్ట్ర : నీటి ప్రాజెక్టులకు నిరసనలు

2012 ఏప్రిల్ చివరివారం నుండి ప్రారంభించి దాదాపు నెల రోజులపాటు, మహారాష్ట్రలో నిర్మించబోయే నీటి ప్రాజెక్టులవలన నష్టపోయే ప్రజానీకపు నిరసనలు, ఆందోళనలు కొనసాగాయి.

షాయిరివర్ ప్రాజెక్టు కారణంగా వివిధ రూపాలలో ఇబ్బందులనెదుర్కొనే పరిసర 70 గ్రామాలకు చెందిన ప్రజానీకం, షాపూర్ తాలూకా, బెలల్లి సాఖరపడ వద్దనున్న ఒక మామిడి తోటలో ఏప్రిల్ 20 నుండి ప్రతిరోజూ వచ్చి జమకూడేవారు. రాష్ట్రంలో థానే మరియు ఇతర ప్రాంతాలకు తాగునీటిని అందించే పేరిట ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టనున్నారు. 'మాకు ఈ ప్రాజెక్టు అవసరం లేదు' అని నిరసనకారులు నినదిస్తున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణఫలితంగా 494.14 హెక్టార్ల అటవీ భూములు మునిగిపోతాయని వారు పేర్కొంటున్నారు.

అదేవిధంగా-మరో ప్రాజెక్టు'కలు' కారణంగా కొన్ని గ్రామాలు నీట మునుగుతాయని ఆ ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతూ వ్యతిరేకిస్తున్నారు. థానే జిల్లాలోని 'సుశారి' ప్రాజెక్టును కూడా ప్రజలు వ్యతిరేకిస్తున్నారు.

నగరాల ప్రజల నీటి అవసరాలనన్నిటినీ ఈ నీటి ప్రాజెక్టులు తీర్చగలుగుతాయా అనే అంశంపై పరిశీలన జరిపించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మిగతా సామాజిక అంశాలను పణంగా పెట్టి నగరాలకు, పట్టణాలకు నీటి అవసరాల పేరున ప్రభుత్వం తలపెట్టే ఈ నీటిప్రాజెక్టుల అసమ విధానాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

### ముంబయి : మత్స్యకారుల కాలనీని నిర్మూలించినందుకు నిరసన

జులై మొదటి వారంలో, ముంబైలోని సియెన్ కోలివడ ప్రాంతవాసులు, మురికివాడల వాసులు-ప్రధానంగా మత్స్యకారులుగా వున్నవారు నివసిస్తున్న కాలనీని కూల్చివేసే ప్రభుత్వ ప్రయత్నాల్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ ఆందోళనలో మత్స్యకార మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

### ఆంధ్రప్రదేశ్ : 'పెట్రోలియం కోక్' ప్లాంటుపై ప్రజాభిప్రాయ సేకరణకు వ్యతిరేకత

విశాఖజిల్లా-రాంబెల్లి మండలం, సీతంపాలెం గ్రామంలో 334 కోట్ల రూ॥ వ్యయంతో ఒక ప్రైవేటు కంపెనీ, పెట్రోలియం కోక్ ఫ్యాక్టరీ నిర్మాణానికి పూనుకుంది.

జూన్ 6వ తేదీన, పోలీసుబలగాల మోహరింపుల నడుమ, పర్యావరణ నియంత్రణ అధికారులు, ఇతర ప్రభుత్వశాఖల అధికారుల ఆధ్వర్యంలో 'ప్రజాభిప్రాయసేకరణ' తంతును నిర్వహించబూనుకున్నారు.

దీనిని నిరసిస్తూ పరిసర గ్రామాల నుండి ప్రజలు జమకూడి అధికారులు ప్రజాభిప్రాయసేకరణ చేబట్టటాన్ని అడ్డుకున్నారు. 'మాకు కోక్ పరిశ్రమవద్దు' 'అధికారులారా!, వెనక్కువెళ్ళండి' అని నినదించారు. పోలీసులు నిరసనకారులపై క్రూరంగా లాఠీఛార్జీ జరిపి చెదర గొట్టే ప్రయత్నం చేశారు. లాఠీఛార్జీకి బెదరక పోలీసులపై ప్రజలు తిరగబడ్డారు. రెండు పోలీసుజీపులను తగులబెట్టారు. ప్రతిపాదిత పెట్రోలియం కోక్ ప్లాంటు నిర్మాణం జరిగితే, ఈ ప్రాంత ప్రజానీకం తీవ్రమైన కాలుష్యాల బారిన పడి చావులను కొని తెచ్చుకోవలిసివస్తుందని, చిన్నపిల్లలు మతిస్థిమితం కోల్పోవటంతోపాటు క్యాన్సర్, గుండెజబ్బులు, కిడ్నీజబ్బులు వంటి ప్రమాదకర వ్యాధుల బారిన పడతామని వారు వాపోయారు.

### అసోం : ఎఎఫ్ఎస్‌పిఏ రద్దు చేయాలని ఆందోళన

జూన్ 7వ తేదీన, ఈశాన్య ప్రాంత రాష్ట్రాల విద్యార్థి సంఘ ఆధ్వర్యంలో సంఘ కార్యకర్తలు గౌహతీపట్టణంలో నిరసన దీక్ష చేపట్టారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో తమ ఈశాన్య ప్రాంత విద్యార్థులు వివక్షకు గురవుతుండటాన్ని వీరు తీవ్రంగా వ్యతిరేకించారు. దీనితోపాటుగా సైనిక బలగాల ప్రత్యేకాధికారాల చట్టాన్ని రద్దు చేయాలనికూడా వీరు డిమాండ్ చేశారు. అదేవిధంగా వీరి డిమాండ్స్‌లో ఈ ప్రాంతంలో భారీ డ్యాముల నిర్మాణం చేపట్టరాదని పేర్కొన్నారు.

### దేశ స్థాయిలో 'ఇంటర్‌నెట్'ను నియంత్రించే చర్యలకు నిరసన

జూన్ 9వ తేదీన ప్రచార, ప్రసార సాధనాలకు సంబంధించిన చట్టాలలో కొన్ని సవరణలద్వారా 'ఇంటర్‌నెట్'ను దొడ్డిదారిన అదుపు చేసే ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా ఇంటర్‌నెట్-కేంద్రాల నిర్వహకుల సమష్ట సంస్థ 'అనానిమస్' అనే ప్రపంచవ్యాపిత సంస్థ ఆధ్వర్యంలో దేశస్థాయి నిరసనలు నిర్వహించారు.

### న్యూఢిల్లీ : యువకుడి అక్రమ నిర్బంధానికి నిరసన

'టెర్రరిజంపై పోరాటం' పేరుతో ఒక అమాయక యువకుని చట్టవిరుద్ధ నిర్బంధాన్ని, అతని అదృశ్యాన్ని వ్యతిరేకిస్తూ జూన్ 15న న్యూఢిల్లీలో వివిధ పౌరహక్కుల, బృందాల కార్యకర్తలు, కేంద్ర హోంమంత్రి నివాసం ఎదుట నిరసన ఆందోళన నిర్వహించారు.

### ఒడిషా: క్రోమైట్‌గనుల తవ్వకాలకు నిరసన

జూన్ 18న, ఒడిషారాష్ట్రంలోని క్రోమియం తవ్వకాలను ఆరు స్థానిక సంస్థలకు చెందిన నిరసనకారులు పూర్తిగా నిలిపి వేయించారు. ఒడిషారాష్ట్రం-సుకిందావద్ద, క్రోమియం గనుల తవ్వకాల కారణంగా, కాలుష్యానికి, అడవుల నాశనానికి వ్యతిరేకంగా ప్రమాదకర క్రోమియం తాగునీటిలో చేరి కలిగించే ప్రమాదాలకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. ఆ ప్రాంత అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వవిధానాలను వారు నిరసించారు.

టాటాస్టీల్, జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీలు, బలసాల్ అల్లాయిస్, ఫాకోర్, ఒరిస్సామైనింగ్ కార్పొరేషన్, ఇండియన్ మెటల్స్ అండ్ ఫెర్రాయ్ అల్లాయిస్, ఇండియన్ ఛార్జి క్రోమ్ మరియు ఇతరసంస్థలు, సుకిండాప్రాంతంలో ప్రముఖమైన గనుల యజమానులుగా వున్నారు.

2007లో బ్లాకీస్మిత్ నివేదిక ప్రకారం ఈ ప్రాంతంలోని సుమారు 70శాతం భూఉపరితల జలాలు, 60శాతం త్రాగునీరులో అసాధారణస్థాయిలో ప్రమాదకరమైన క్రోమియం కలగలసి వుండటం; దీనిపై ఆధారపడిన 26లక్షలమంది ప్రజానీకం తీవ్ర ఇబ్బందుల నెదుర్కొంటున్నారు.

### ఆంధ్రప్రదేశ్ : 'గ్రీన్ బయోప్లాంటు'కు నిరసన

జూన్ 28న, కరీంనగర్‌జిల్లా-పార్లపల్లి గ్రామానికి చెందిన 400మందిపైగా గ్రామస్థులు 'గ్రీన్ బయోప్లాంటు ఇండియా ప్రైవేటు లిమిటెడ్'ను చుట్టు ముట్టి దిగ్బంధించారు. తమ గ్రామ పరిసరప్రాంతలలో పర్యావరణం తీవ్ర కాలుష్య భరితం కావటాన్ని వారు తీవ్రంగా నిరసించారు. ఆఫ్యాక్టరీ విడులచేస్తున్న విషవాయువుల కారణంగానూ, భూగర్భ జలాల కాలుష్యం కారణంగానూ జీర్ణకోశసంబంధ వ్యాధులతోనూ, చర్మ సంబంధ వ్యాధులతోనూ బాధలనుభవిస్తున్నారనీ, పంటపొలాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని ప్రజలు ఆరోపించారు.
ఎన్నోమార్లు అధికారులకు విన్నవించుకున్నా ప్రయోజనం లేక పోయిందని వారు ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో తీవ్రంగా విసుగు చెందిన ప్రజానీకం, ఆగ్రహంతో ఫ్యాక్టరీ ఆవరణలోకి ప్రవేశించి కార్యాలయ సామానును, కొన్ని వాహనాలను ధ్వంసం చేశారు. 'గ్రీన్ బయోప్లాంట్'ను బేషరతుగా, వెనువెంటనే మూసివేయాలని వారంతా ఒక్క గొంతుతో డిమాండ్ చేశారు.

### విశాఖపట్నం : ఎన్.టి.పి.సి వద్ద నిరసనకారులపై సిఐఎస్ఎఫ్ కాల్పులు

విశాఖపట్నం సమీపంలోని తిక్కవానిపాలెంలో, మత్స్యకారులు ఎన్.టి.పి.సి. కాలుష్యానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. ఈ ప్రభుత్వరంగ కాలుష్యం ఫలితంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను, తమ ఉద్యోగ సమస్యలను ఆందోళనాకారులు డిమాండ్ చేశారు. జూన్ 28న, వారు తమ ఆందోళనను తిరిగి ప్రారంభించారు. ఆందోళనకారులు పరిశ్రమ పైపులైను నిర్మాణాన్ని అడ్డుకున్నారు. ఈ క్రమంలో కేంద్రపారిశ్రామిక భద్రతాసిబ్బంది (సిఐ ఎస్ ఎఫ్)జోక్యం చేసుకొని, ఆరు రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపారు. ఈ తొక్కిసలాటలో 8మంది నిరసన కారులు గాయపడ్డారు. ఎన్‌టిపిసి కాలుష్యాలు కలవటం ఫలితంగా సముద్రంలో తగినంత చేపల వేటను కూడా పొందలేకపోతున్నాము కనుక తమ గ్రామాన్ని మరోచోట పునర్నిర్మించాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు.

### విశాఖపట్నం : ఫార్మాసిటీ వద్ద గ్రామస్తుల నిరసన

జులై 11న, ఫార్మాసిటీ కాలుష్య ప్రభావానికి గురైన ప్రజలు, విశాఖపట్నం జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీ ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ఫార్మాకంపెనీలనుండి వెలువడే కాలుష్యం కారణంగా సముద్ర చేపల వేట గణనీయంగా తగ్గిపోతూ తమ ఉపాధిని దెబ్బతీస్తున్నదనీ, బాధితప్రజానీకానికి పునరావాసం, పునర్నిర్మాణం ప్యాకేజీ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. నిరసనకారులపై పోలీసులు లాఠీఛార్జీ చేశారు. ఫార్మాసిటీ ఉద్యోగులను లోపలికి ప్రవేశించనీయకుండా నిరసనకారులు అడ్డుకోవటంతో ఫార్మాపరిశ్రమలలో పని అంతా నిలచిపోయింది.

### దేశస్థాయిలో న్యాయవాదుల నిరసన

మానవవనరుల శాఖామంత్రి కపిల్ సిబల్ మొండి వైఖరిని నిరసిస్తూ, దేశవ్యాపితంగా న్యాయవాదులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. 'ఉన్నత విద్య మరియు పరిశోధన బిల్లు' పరిధినుండి న్యాయవిద్యను మినహాయించరాదని వారు డిమాండ్ చేశారు. జులై 11, 12 తేదీలలో వారు తమ విధులను బహిష్కరించారు. పైన పేర్కొన బిల్లు, దేశంలోకి విదేశీ విద్యాసంస్థల ప్రవేశాన్ని సులభతరం చేసేందుకు; 'బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా'తో సహా వివిధ నియంత్రణా సంస్థలను నిర్వీర్యంచేయటానికేనని న్యాయవాదులు పేర్కొన్నారు.

### మధ్యప్రదేశ్: విస్థాపనకు గ్రామస్థుల నిరసన

జులై 16న-మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని నర్మదానదిపై నిర్మించే ఓంకారేశ్వర్ డ్యాము కారణంగా మునక గ్రామాల ప్రజానీకం, ఘోగల్ గ్రామంలో 'నర్మదా జల్ సత్యాగ్రహ్'ను ప్రారంభించారు. విస్థాపనకు గురయ్యే వేలాదిమంది ప్రజానీకం, తాము అక్కడినుండి కదిలేదేలేదని, తమ హక్కుల రక్షణకోసం అవసరమైతే తమ ప్రాణాలర్పించటానికీ సిద్ధమనివారు ప్రకటించారు. మహేశ్వర్, ఇంద్ర సాగర్, మాన్, అప్పర్‌బేడా డ్యాముల ప్రాంత ప్రతినిధులు, వివిధ ప్రజాసంఘాలు, ప్రతిపాదిత ఓంకారేశ్వర్ డ్యాముకు దగ్గరలోని ఆందోళనకారుల కేంద్రమైన ఘోగల్‌గావ్‌కు కదలి వచ్చి విస్థాపనకు గురికానున్న ప్రజల ఆందోళనకు సంఘీభావం ప్రకటించారు.

### ఆంధ్రప్రదేశ్: తమబకాయిల చెల్లింపుకై షుగర్ ఫ్యాక్టరీకి తాళాలు వేసినరైతులు

నెల్లూరు జిల్లాలోని, మన్మధపురం షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం, చెరకు రైతులకు, వారు సరఫరా చేసిన చెరకు తాలూకా బకాయిలు 23కోట్ల రూ॥ వరకూ చెల్లించటంలో విఫలమైంది. షుగర్‌ఫ్యాక్టరీ యాజమాన్యానికి, అధికార్లకు తమ బకాయిలు వెంటనే చెల్లించాలని పలుమార్లు రైతులు విజ్ఞప్తులు చేసినా ప్రయోజనం లేకపోవటంతో ఆగ్రహించిన రైతులు జులై 16న, షుగర్ ఫ్యాక్టరీ ప్రధాన ద్వారాలకు తాళాలువేసి, తమ బకాయిలు చెల్లించేంతదాకా ఎవరినీ లోపలికి అనుమతించబోమనీ, షుగర్ ఫ్యాక్టరీని నడపనీయబోమనీ హెచ్చరించారు.

# జన్యుమార్పిడి విత్తనసాగు-ఎందుకూ కొరగాని పార్లమెంటరీ స్థాయీ సంఘ సిఫార్సులు

**మనదేశ** వ్యవసాయరంగం గురించి అధ్యయనం చేసన పార్లమెంటరీ స్థాయీ సంఘం తన సిఫార్సులు, సూచనలు, విజ్ఞప్తులతో కూడిన నివేదికను ఇటీవల పార్లమెంటుకు సమర్పించటంతో, అది మరోసారి జన్యుమార్పిడి పంటల సాగుపై చర్చకు దోవతీసింది. గత కొన్ని సంవత్సరాలుగా, జన్యుమార్పిడి విత్తనాల వలన సంభవించే దుష్పరిణామాలు; మోన్‌శాంటోలాంటి బహుళజాతి విత్తన సంస్థల దోపిడీ; దేశీయ విత్తన విధానాలను చేపట్టని పాలకుల విధానాలు; వ్యవసాయ రంగంపై సామ్రాజ్యవాదుల పట్టు; సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవసాయాన్ని మలిచిన పాలకుల విధానాలపై "జనశక్తి" వెల్లడిచేస్తూ వస్తున్నది.

బి.టి. విత్తనాల విక్రయం, సాగుకి వ్యతిరేకంగా మన దేశంలోనూ, విదేశాల్లోనూ వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రజాతంత్రవాదులు, రైతాంగం పెద్దఎత్తున ఆందోళనలు చేస్తూనే వున్నారు. బి.టి.వంగసాగుపై దేశంలోని అనేక ప్రాంతాల్లో నిర్వహించిన సదస్సులో పెద్దఎత్తున రైతాంగం, ప్రజాతంత్రవాదులు, రైతు, రైతుకూలీసంఘాలు పాల్గొని తమ వ్యతిరేకతను తీవ్రస్థాయిలో వ్యక్తంచేశారు. బి.టి. విత్తనాల విక్రయాన్ని నిషేధించాలని డిమాండ్ చేశారు. పోలీసుల దాడులను, అరెస్టులను ఈ సందర్భంగా ఎదుర్కొన్నారు. దీంతో తాత్కాలికంగా బి.టి. వంగ విత్తనాల విక్రయంపై ప్రభుత్వం మారిటోరియం ప్రకటించక తప్పలేదు. కొద్దిరోజుల్లోనే దాన్నుండి వెనక్కివెళ్లిన ప్రభుత్వం అనేక బి.టి. ఆహార పంటల విత్తనాలను అనుమతించేందుకు సిద్ధమైంది. ప్రభుత్వ ఈ ద్వంద్వవిధానంపై తీవ్ర నిరసన వ్యక్తమౌతున్న నేపథ్యంలో వ్యవసాయంపై ఏర్పడిన పార్లమెంటరీ స్థాయీసంఘం ఈ అంశాలపై అధ్యయనానికి పూనుకొంది. దీనికి సీనియర్ పార్లమెంటు సభ్యులు బాసుదేవ ఆచార్య అధ్యక్షులుగా వ్యవహరించారు. వివిధపార్టీల సభ్యులు స్థాయీసంఘంలో ఉన్నారు. స్థాయీసంఘం దేశంలోని అనేక ప్రాంతాల్లో పర్యటించి, 50 సంస్థలు యిచ్చిన సాక్ష్యాలను సమీక్షించి, 467 విజ్ఞాపనలను, 15వేల పత్రాలను పరిశీలించి, 27 సార్లు సమావేశమై స్థాయీసంఘ నివేదిక తయారు చేయటానికి రెండు సంవత్సరాల కాలంపట్టింది. 482 పేజీలతో తుది నివేదికను తయారుచేసి ప్రభుత్వానికి అందచేసింది. నివేదికపై సభ్యులందరూ ఏకాభిప్రాయం వ్యక్తంచేశారు. క్విట్ ఇండియా దినోత్సవంనాడు నివేదికను విడుదల చేశారు.

దేశ ప్రయోజనాలకు, రైతుల ప్రయోజనాలకు, వ్యవసాయ అభివృద్ధికి ఏమాత్రం ప్రయోజనంకావని బి.టి. విత్తనాల గురించి నివేదిక పేర్కొంది. పార్లమెంటు ఆమోదం లేకుండా బి.టి. పత్తిని ఎలా అనుమతించారని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది.

ఆరునెలల క్రితం ప్రధాని మన్‌మోహన్ బి.టి. విత్తనాల గురించి మాట్లాడుతూ వ్యవసాయ దిగుబడులు పెరగటానికి జన్యుమార్పిడి విత్తనాలే దిక్కని, అయితే మనదేశంలో కొన్ని సంస్థలు, రైతుసంఘాలు జన్యుమార్పిడి పంటలకు అడ్డుపడుతున్నాయని, ఇతర దేశస్తులు ఇందుకు సహకరిస్తున్నారని చెప్పారు. స్థాయీసంఘం నివేదిక, ప్రధాని అభిప్రాయానికి భిన్నంగావుంది. జన్యుమార్పిడి పంటలను వ్యతిరేకించింది.

మోన్‌శాంటో, మహికోలాంటి బహుళజాతి, బడా, వ్యవసాయ వాణిజ్య వ్యాపార సంస్థలు బి.టి. విత్తనాలవలన అధిక దిగుబడులు వస్తాయని, ఎరువులు, క్రిమిసంహారక వినియోగం తగ్గి పంట పెట్టుబడి తగ్గుతుందని, ఫలితంగా రైతులకు ఎక్కువ ఆదాయం లభిస్తుందని పెద్దఎత్తున సాగించిన ప్రచారం బూటకమైందని నివేదిక పేర్కొంది.

దేశంలోని అనేక ప్రాంతాల్లో పర్యటించిన స్థాయీసంఘం, జన్యుమార్పిడి పంటలను పరిశీలించింది. మహారాష్ట్రలోని గోరేగావ్‌లో పర్యటించినప్పుడు అక్కడి రైతుల్లో 95% మంది బి.టి. పత్తిని అధిక విస్తీర్ణంలో సాగుచేసినట్లు వెల్లడైంది. ప్రారంభంలో పెట్టుబడి ఖర్చులు తగ్గి ఉత్పత్తి పెరిగిందని రైతులు భావించారు. కాని క్రిమికీటకాలవలన జరిగిన నష్టం తక్కువగా ఉండటమనే వాస్తవాన్ని రైతులు గుర్తించకపోవటమే అందుకు కారణమని కమిటీ భావించింది. పోను పోను, ఉన్న తెగుళ్ళతోపాటు కొత్తరకం చీడపీడలు వ్యాపించటంవలన క్రమేణా పెట్టుబడులు పెరిగి, పత్తి దిగుబడులు తగ్గి, అప్పులపాలైన రైతులు ఆ ప్రాంతంలో 150 మంది మరణించినట్లు నివేదిక వెల్లడించింది.

కొత్తరకం విత్తనాల వలన ప్రారంభంలో ఆ పంటకు తెగుళ్ళు సోకే అవకాశం తక్కువగా వుంది. కానీ, క్రమంగా ఆ పంటకు పురుగులు అలవాటుపడటం, కొత్తవంగడాల నుండి సక్రమించే కొత్త తెగుళ్ళు వ్యాపించి పురుగుమందుల వాడకం ఎక్కువైంది. ఎరువుల వాడకం పెరిగింది. ఫలితంగా పెట్టుబడి ఖర్చు అధికమైంది. మన రాష్ట్రంలోనూ ఇదే పరిస్థితి ఎదురైంది. మోన్‌శాంటో చేస్తున్న ప్రచారానికి భిన్నంగా దిగుబడులు తగ్గి పెట్టుబడి పెరిగింది. బి.టి. పత్తికి వ్యాపించే రసం పీల్చే పురుగును చంపేందుకు అవలాంట్, ట్రైసర్ పురుగుమందులను మోన్‌శాంటోనే తయారుచేసి అమ్మకాలు సాగించుకోవటం, దాని మోసపూరిత ప్రచారానికి నిదర్శనం. బి.టి. పత్తివలన అధిక ఆదాయం రాకపోగా నష్టం వచ్చినట్లు వెల్లడైంది. 2002-07 మధ్యకాలంలో వరంగల్ జిల్లాలో బి.టి.-నాన్ బి.టి. పత్తిని పరిశీలిస్తే, ఏ పత్తిసాగు లాభసాటిగా ఉందో అర్థమౌతుంది. ఆ కాలంలో బి.టి.పత్తి వేసిన రైతులకు ఎకరాకు 1250 రూ. నష్టం రాగా, నాన్ బి.టి. పత్తిసాగు చేసిన రైతుకు ఎకరాకు 5,368 రూ. మిగులు వచ్చింది. బి.టి.పత్తి వైఫల్యానికి ఇది అద్దంపడుతున్నది.

## విత్తన వ్యాపారం

భారత వ్యవసాయరంగంపైన సామ్రాజ్యవాదుల పట్టు, విత్తనాలపై బహుళజాతి సంస్థల ఆధిపత్యం వలన, వాటి వ్యాపారం దేశంలో అడ్డూఅదుపూ లేకుండా విచ్చలవిడిగా కొనసాగుతున్నది. భారత దేశంలో 55 వేల కోట్ల రూపాలయల విత్తన వ్యాపారం సాగుతోందని ఆర్థిక నిపుణుల అంచనా. అంతర్జాతీయ విత్తన వ్యాపారంలో ప్రతిసంవత్సరం 5% పెరుగుదల వుంటే, భారతదేశంలో పెరుగుదల 12%గా వుంది. ప్రపంచంలో వినియోగిస్తున్న విత్తనాల్లో 68% బహుళజాతి సంస్థల విత్తనాలే. భారతదేశంలో వినియోగిస్తున్న 95% హైబ్రీడ్ విత్తనాలు, 100% పత్తివిత్తనాలు బహుళజాతి సంస్థలకు చెందినవే. దీన్ని గమనిస్తే భారతదేశం విత్తన వ్యాపారానికి ఎంత విస్తారమైన వనరుగా ఉందో, బహుళజాతి సంస్థల దోపిడీ ఏవిధంగా కొనసాగుతుందో స్పష్టమౌతోంది.

## బి.టి. వంగపై పరిశోధన

బి.టి.వంగపై పరిశోధన అవసరమని పార్లమెంటరీ స్థాయీసంఘం ప్రభుత్వానికి సూచించింది. బి.టి. వంగపై ఇప్పటికీ విస్తృతమైన చర్చ జరుగుతూనే వుంది. పార్లమెంటరీ స్థాయీసంఘం నివేదిక సమర్పించటానికి ముందే బి.టి. వంగపై అధ్యయనానికి డాక్టర్ పి. ఎం. భార్గవను సుప్రింకోర్టు పరిశీలకుడిగా నియమించింది. జన్యుమార్పిడి పంటలకు అనుమతి మంజూరుచేసే "జెనటిక్ ఇంజనీరింగ్ అప్రూవల్ కమిటి (జెఇఎసి)ని బి.టి. వంగపై కొన్ని పరీక్షలు జరపవలసిందిగా డా॥ పి. యం. భార్గవ సూచించారు. ఆ విషయమై జేఈఏసీని స్థాయీసంఘం ప్రశ్నించగా, ఆ పరీక్షలు నిర్వహించలేదని దాని ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ అర్జునరెడ్డి చెప్పటంతో స్థాయీసంఘం ఆశ్చర్యపోయింది. బి.టి.వంగ సాగుకి అనుమతించాలని వ్యాపారవేత్తలు, మోన్‌శాంటో, ఒక కేంద్రమంత్రి వత్తిడితేవటం గురించి కూడా ఆయన స్థాయీసంఘానికి తెలియచేశారు. బి.టి.వంగ విత్తనాలపై పర్యావరణ, అటవీశాఖ మారిటోరియం విధించేవరకు జరిగిన పరిణామాలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని" స్థాయీసంఘం ప్రభుత్వానికి సిఫార్సు చేసింది.

జెఈఏసీ పాలక వర్గాలకు, బహుళజాతి సంస్థలకు అనుగుణంగా వ్యవహరిస్తున్న వైనాన్నీ, పరిశోధనలు చేయకుండా విత్తనాలను అనుమతించటాన్ని డా॥ భార్గవ పేర్కొన్న అంశాలను "జనశక్తి" గతంలోనే అందించింది.

2008లో బి.టి.పత్తి విత్తనాల పొట్టును దాణాగా మేసిన పశువులపై భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి జీవభద్రతా పరీక్షలు నిర్వహించింది. ఆ దాణాను తిన్న మేకల రక్తంలో తెల్లకణాలు తరిగిపోయాయనీ, కాలేయం, మూత్రపిండం అవయవాల బరువు పెరిగిందనీ, దీనిపై భారతీయ వైద్యపరిశోధనా మండలి పశువైద్య నిపుణుల, పోషకాహార నిపుణుల పెథాలజిస్టులతో కూడిన నిపుణుల బృందంతో ఈ పరీక్షల ఫలితాలపై నిశితంగా అధ్యయనం చేయించాలనీ, నివేదికను సత్వరమే తయారుచేయించాలనీ స్థాయీ సంఘం ప్రభుత్వానికి సూచించింది. బి.టి. పత్తి జీవ భద్రత, ఆరోగ్య భద్రతా అంశాలకు సంబంధించి జేఈఏసీ అభిప్రాయాలు తెలపాల్సిందిగా కూడా కమిటీ కోరింది.

2008లోనే ఆదిలాబాద్, వరంగల్, నల్గొండ తదితర జిల్లాల్లో వరుసగా పశువులు చనిపోయాయి. ఉదయం మేతకు వెళ్లిన పశువులు సాయంత్రం అయ్యేసరికి వణుకుడు, కాళ్ళుకొట్టుకోవటం, ముక్కుల్లోనుంచి చీముకారటం, కడుపు ఉబ్బటం, రక్త విరేచనాలతో గిలగిలా కొట్టుకొంటూ ప్రజల కళ్ళముందే ప్రాణాలు కోల్పోయాయి. రైతుల్లో పెద్ద ఆందోళన బయలుదేరింది. ఈ వ్యాధులను పరీక్షించితే బి.టి. పత్తి సాగుచేసిన భూముల్లో గడ్డిమేయటమే దీని కారణం అనే అసలు వాస్తవం బయటపడింది. బి.టి.వంగపై పరిశోధన చేసిన ఫ్రెంచి శాస్త్రవేత్త గిలిస్ఎరిక్ సిరాలిన్, బి.టి. విషం అనేక రకాల ప్రమాదమైందనీ, ఎలుకలపై జరిపిన ప్రయోగాల్లో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తాయనీ, వాటిల్లో పెరుగుదల క్షీణించటమేకాకుండా, పుట్టిన పిల్లలు చనిపోవటం ఎక్కువైందనీ, లివర్, మూత్రపిండాలు చెడిపోయాయనీ, పర్యావరణ సమస్యలు తలెత్తాయనీ చెప్పారు.

బి.టి. పంటలను ఆహారంగా తీసుకోవటంవలన విషప్రభావం పెరిగి, యాంటిబయాటిక్స్ నిష్ప్రయోజనమై, పేద దేశాల్లో అంటువ్యాధులకు చికిత్స కష్టతరమౌతోంది. బి.టి.పత్తి చేలల్లో పనిచేసిన స్త్రీలకు గర్భస్రావాలయ్యాయి. చర్మవ్యాధులతోపాటు హార్మోన్లు దెబ్బతిన్నాయి.

శాస్త్రవేత్తలు, ప్రజాతంత్రవాదులు, స్వచ్ఛంద సంస్థలు బి.టి.సాగు ప్రమాదాన్ని ఏనాడో బహిర్గతం చేసేయగా, బి.టి. పత్తి, వంగ విత్తనాలపై మరలా పరిశోధనలు జరిపించాలని స్థాయీసంఘం చెప్పటం నిష్ప్రయోజనం.

## క్షేత్ర ప్రయోగాలు ఆపివేయాలి

ప్రపంచంలోని అభివృద్ధిచెందిన యూరప్ దేశాలతోసహా 180 దేశాలు బి.టి.పంటల ప్రమాదాన్ని గుర్తించి, అందుకు గేట్లు మూయగా, భారత పాలకులు మాత్రం గేట్లు బార్లా తెరిచారు. అంతేకాక మోన్‌శాంటో కొత్తగా ఉత్పత్తి చేస్తున్న జన్యుమార్పిడి పంటలకు భారతదేశం ప్రయోగశాలగా మారింది. అందులోనూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అగ్రగామిగా వుంది. గుంటూరుజిల్లా నారాకోడూరులో మోన్‌శాంటో అనుబంధ సంస్థ మహికోకు బెండసాగు ప్రయోగాలకు అనుమతించింది. ప్రయోగం గురించి అక్కడి రైతాంగానికీ, జేఈఏసీకి కూడా తెలియదు. హైదరాబాద్ శివారు ప్రాంతంలోనూ అనేక ప్రయోగాలు జరిగాయి. దేశంలో ఇలాంటి ప్రయోగాలు ఎన్నో జరుగుతున్నాయి. అంతేకాకుండా దేశంలో 56 జన్యుమార్పిడి పంటలకు దశలవారీగా ఆమోదం తెలపటానికి భారత పాలకులు సిద్ధంగా ఉన్నారు. అందులో వరి, వేరుశనగ, మొక్కజొన్న, సోయాబిన్ మొదలైన 40 ఆహార పంటలు వున్నాయి. దీన్ని గమనిస్తే ప్రజలు తినే ఆహారమంతా విషపూరితం కానుంది.

దీన్ని పరిశీలించిన పార్లమెంటరీ స్థాయీసంఘం రైతుల ప్రయోజనంకోసం, పర్యావరణ, ప్రజారోగ్యం, పశు పక్ష్యాదుల ఆరోగ్యంకోసం జన్యుమార్పిడి పంటల ప్రయోగాలకు స్వస్తిచెప్పాలని ప్రభుత్వాన్ని కోరింది.

ఇంకా బి.టి. గింజల నూనె వాడకం అనుమతించటంపై ప్రభుత్వాన్ని స్థాయీ సంఘం ప్రశ్నించింది. ఉత్పత్తులపై జన్యుమార్పిడి లేబుల్ ఉండాలని, సమర్ధవంతమైన జీవభద్రతా సాధికారసంస్థ వుండాలని, దేశంలోని వ్యవసాయపంటలపై విధాన రూపకల్పనలో వ్యవసాయ శాఖ తన బాధ్యతలను నెరవేర్చటంలో విఫలమైందని బాసుదేవ ఆచార్య నాయకత్వంలోని కమిటీ విమర్శించింది.

## హంతక సంస్థ మోన్‌శాంటో

హంతక స్వభావం సంతరించుకొన్న సంస్థ మోన్‌శాంటో, తన లాభాలకోసం ప్రజల ప్రాణాలు తీయటంతోపాటు ఎటువంటి దుర్మార్గాలకైనా వెనకాడదు. వియత్నాం యుద్ధం సందర్భంగా అక్కడి ప్రజలను హతమార్చేందుకు అమెరికా సామ్రాజ్యవాదులకు అవసరమైన రసాయనాలను తయారుచేసి యిచ్చి, లాభాలు గడించిన హంతక సంస్థ ఇది! దాని ఫలితంగా ఎందరో వియత్నాం ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఇప్పుడు తన లాభాలకోసం జన్యుమార్పిడి విత్తనాలు తయారుచేసి ప్రజల ప్రాణాలు హరించేందుకు పూనుకొంది. ఇలాంటి హంతకసంస్థ, ప్రజల ఆకలిని తీర్చేందుకే జన్యుమార్పిడి పంట విత్తనాలు తయారుచేసిందని పాలకులు చెప్పటమంటే, ఆ హంతక సంస్థతో చేతులు కలపటమే!

## నిర్దుష్ట అభిప్రాయం తేల్చిచెప్పని స్థాయీసంఘం

బాసుదేవ ఆచార్య ఆధ్వర్యములోని పార్లమెంటరీ స్థాయీసంఘం జన్యుమార్పిడి పంటలపై కొన్ని వాస్తవాలను చెప్పినప్పటికీ, జన్యుమార్పిడి పంటలపై స్పష్టమైన అభిప్రాయాన్ని వ్యక్తంచేయలేకపోయింది. ఆ మేరకు ప్రభుత్వం ముందు తన డిమాండ్లను ఉంచలేక పోయింది. తాను అభిప్రాయపడిన ప్రతి విషయంపై అధ్యయనం, పరిశోధనలు జరపాలని మాత్రమే సూచించింది. జన్యుమార్పిడి పంటలను నిషేధించాలని, దేశీయ విత్తన పంటలను అభివృద్ధిచేయాలని, స్వతంత్ర వ్యవసాయ విధానాన్ని అనుసరించాలని, బహుళజాతి సంస్థల, సామ్రాజ్యవాదుల ఆధిపత్యాన్ని తొలగించాలని కమిటీ సూచించలేకపోయింది. ఇంతకుముందు అనేకమంది చెప్పిన విషయాలను పునశ్చరణచేయటానికే పరిమితమైంది.

భారత పాలకుల సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థల అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ, దేశంలో జన్యుమార్పిడి పంటలను నిషేధించాలని, దేశీయ విత్తన పంటలను అభివృద్ధిచేసి, స్వతంత్ర వ్యవసాయ విధానాన్ని అనుసరించాలని, బహుళజాతి సంస్థల దోపిడీ అరికట్టాలని, పర్యావరణాన్ని పరిరక్షించాలని ఉద్యమించాల్సిన కర్తవ్యం రైతాంగంతోపాటు యావన్మంది ప్రజలపై వుంది. ✡

## ప్రపంచ పరివ్యాపిత... (3వ పేజీ తరువాయి)

### చైనా : రాగి పరిశ్రమ స్థాపనకు వ్యతిరేకత

చైనాలోని-సియాచిన్ రాష్ట్రం-షిఫాంగ్ నగరంలో-జులై 3,4 తేదీల్లో అనేక ఆరోగ్య సమస్యలతో ముడిపడివున్న రాగి పరిశ్రమను వ్యతిరేకిస్తూ, దానిని ఆపివేయాలని డిమాండ్‌చేస్తూ నిరసన తెలియజేశారు. భారీస్థాయి ధర్నా నిర్వహించిన అనంతరం స్థానిక ప్రభుత్వం-నిర్మాణం చేయబోతున్న రాగిప్రాజెక్టు ప్లానులను రద్దుచేస్తున్నట్లుగా ప్రకటించింది.

### యుక్రెయిన్ : రష్యన్ భాషాధిపత్య సమస్యపై ఆందోళన

జూన్ 5న, రష్యా భాషకు, ఇతర భాషలకు అధికార హోదా కల్పిస్తూ ఉక్రెయిన్ రూపొందించిన ముసాయిదా బిల్లుకు వ్యతిరేకంగా-ప్రజానిరసనలు బ్రద్దలయ్యాయి. ఉక్రెయిన్ పార్లమెంటు స్పీకర్ ఈ బిల్లుకు నిరసనగా రాజీనామా చేశాడు.

### ఈజిప్టు : హిల్లరీ క్లింటన్‌పై ఆగ్రహ వ్యక్తీకరణ

జులై 17న, అమెరికా రక్షణశాఖామంత్రిణి హిల్లరీ క్లింటన్‌ను 'మోనికా, మోనికా' అని నినాదాలుచేస్తూ-టమోటాలు విసురుతూ ఆందోళనకారులు తీవ్రంగా తమ ఆగ్రహాన్ని వ్యక్తంచేశారు. ఈజిప్టు తీరప్రాంత నగరమైన అలగ్జాండ్రియాకు హిల్లరీ రాక సందర్భంలో ఈ నిరసన చేపట్టారు. టమోటాలు, బూట్లు ఇంకా వాటర్ బాటిల్స్‌వంటి వాటిని కూడా వారు విసిరారు. ముస్లిమ్ బ్రదర్‌హుడ్ ఈజిప్టు ఎన్నికలలో విజయం పొందటానికి అమెరికా సహకారం అందించిందనే ఆగ్రహంతో వారు, ఈ నిరసనను తెలిపారు. అమెరికా రాయబార కార్యాలయాన్ని తిరిగి ప్రారంభించేందుకు హిల్లరీ అలగ్జాండ్రియా నగరం వచ్చిన సందర్భంగా వీరు ఈ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ✡







## మానేసర్ ప్లాంటులో 'దౌర్జన్యకర' సంఘటనలను ఖండించే ముసుగులో

# కార్మికులపైనా, కార్మికవర్గంపైనా బడా పెట్టుబడిదారీవర్గం ఒక పద్ధతి ప్రకారం ప్రమాదకరమైన దాడిని కొనసాగిస్తోంది-తస్మాత్ జాగ్రత్త!

**2012** జులై 18న, హర్యానారాష్ట్రం-గుర్‌గావ్ జిల్లాలోని మారుతీ సుజుకీ ఇండియా లిమిటెడ్‌కు చెందిన-మానేసర్ కార్ల ఉత్పత్తి కేంద్రంలో-సూపర్‌వైజరు ఒకడు, ఒక దళిత కార్మికుడిని కులంపేరుతో తీవ్రంగా దూషించాడు. అవమానానికి గురైన ఆ కార్మికుడు నిరసన తెలపగా, యాజమాన్యం అక్రమంగా ఆ దళిత కార్మికుడిని సస్పెండు చేసింది. యాజమాన్యపు ఈ అక్రమ చర్యను నిరసిస్తూ, ఆ కార్మికుని సస్పెన్షన్ ఉత్తర్వులను వెంటనే వెనక్కు తీసుకోవాలనీ, ఆ కార్మికుని తిరిగి విధుల్లోకి తీసుకోవాలనీ డిమాండ్ చేస్తూ మానేసర్ ప్లాంటు కార్మికులు ఆందోళన ప్రారంభించారు. వీరి ఆందోళనను అణచివేయటానికి యాజమాన్యం కొందరు గూండాలను వీరి పైకి ఉసిగొల్పటంతో ఘర్షణ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఒక హెచ్.ఆర్. జనరల్ మేనేజర్ మరణించగా, ఇద్దరు జపనీయులు, కొందరు మధ్య దొంతర సిబ్బందితో సహా 86 మంది గాయపడ్డారు. ఈ తొక్కిసలాటలో కొందరు అల్లరి మూకలు కార్యాలయ భవనాలను తగులబెట్టి, కొంత ఆస్తిని నష్టపరిచారు.

### కులం పేరుతో దళిత కార్మికుణ్ని దూషించిన యాజమాన్యపు రెచ్చగొట్టుడు చర్యలు

ఒక దళిత కార్మికుని కులంపేరుతో తీవ్రమైన దూషణలకు పాల్పడిన యాజమాన్యపు రెచ్చగొట్టుడు చర్యలే; దూషణకు గురైన, బాధితుడైన కార్మికుడిని విధులనుండి తొలగించిన అక్రమ చర్యలే; న్యాయమైన కార్మికుల ఆందోళనను గూండాలద్వారా అణచివేయ జూసిన నిరంకుశ చర్యలే-ఈ 'దౌర్జన్యకర' సంఘటనకు కారణం కాగా, మానేసర్ ప్లాంటు కార్మికులు హింసాత్మకంగా మారిపోయారని, ఒక సీనియర్ మేనేజరును హత్యచేశారనీ, పలువురు యాజమాన్య సిబ్బందిని గాయపరిచారనీ, పరిశ్రమ ఆస్తులను తగులబెట్టి, విధ్వంసం సృష్టించారనీ ఆరోపిస్తూ మారుతీ సుజికీ యాజమాన్యం భీకర స్వరంతో దొంగ ఏడుపు ప్రారంభించింది. వాదనకు నిలవలేని ఈ విధమైన తప్పుడు ఆరోపణలతో, ఈ సంఘటనలో చోటుచేసుకున్న 'దౌర్జన్యం', ఆస్తుల దహనాలకు ప్రతీకారంగా మారుతీ సుజుకీ యాజమాన్యం, ఆందోళన సాగిస్తున్న కార్మికుల రక్తం జుర్రుకోవాలని ప్రయత్నిస్తోంది. ఈ విధంగా 'దౌర్జన్యకర' సంఘటనకు దోవతీసిన, కార్మికుల ఆగ్రహం పెల్లుబకటానికి కారణమైన తన నీచ, అసమంజస, దుర్మార్గ చర్యలను కప్పిపుచ్చుకునేందుకు మారుతీ సుజుకీ యాజమాన్యం తన కుట్ర పూరిత ప్రయత్నాలన్నింటినీ వేగిరపరుస్తోంది.

### యాజమాన్యానికి - ప్రభుత్వ, పోలీసు యంత్రాంగ సహకారం

మారుతీ సుజుకీ యాజమాన్యపు డిమాండుకు గుడ్డిగా తలొగ్గిన హర్యానా రాష్ట్ర ప్రభుత్వం, జరిగిన సంఘటనపై ప్రత్యేక పోలీసు బృందంతో దర్యాప్తుకు ఆదేశించటంతో పాటు, ముద్దాయిలను త్వరితంగా విచారించి, న్యాయంచేసే పేరిట ప్రత్యేక ప్రాసిక్యూటర్‌ను నియమించింది.

సంఘటన జరిగిన వెనువెంటనే మారుతీ సుజుకీ యాజమాన్యం, కార్మికుల యూనియన్ గుర్తింపును రద్దు చేస్తానని ప్రకటించింది. అంతేగాక, ఈ జరిగిన సంఘటన, కార్మికులు ముందుగా వేసుకున్న పథకంతో జరిగిందని ఆరోపించింది. ఈ దౌర్జన్యకర ఘటనకూ, కార్మికుల వేతన సమస్యపై యాజమాన్యానికీ యూనియన్‌కీ నడుమ దీర్ఘకాలంగా సాగుతూవస్తున్న చర్చలకూ ఎలాంటి సంబంధం లేదని ప్రకటించింది. అంతేగాక, కొన్ని తీవ్రవాద వామపక్ష సంఘాలు, శక్తులు-ముఖ్యంగా, మావోయిస్టులు వంటి వారు 'వర్గదాడి' జరిపారు అని ఆరోపించేంత దాకా వెళ్ళింది. అంతేకాక, తమకు పోటీదారులైన కార్ల కంపెనీలు పన్నిన కుట్రలో భాగంగా ఈ 'హింస' చోటుచేసుకుందని కూడా యాజమాన్యం ప్రకటించింది.

యాజమాన్యం అందించిన సమాచారమూ, వారికి దన్నుగా నిలిచిన రాష్ట్ర ప్రభుత్వ సహకార వైఖరిని ఉప్పందుకొన్న రాష్ట్ర కార్మిక శాఖ, "జులై 18 నాటి సంఘటన ఏ విధంగానూ కార్మిక వివాదాల పరిధిలోకి రాదనీ, దానిలో తమశాఖ ఏమీ కలగజేసుకోదనీ" ప్రకటించటంతో పాటు, దీనిని శాంతి భద్రతల సమస్యగా పరిగణించాలని చెప్పి, పోలీసుల చేతిలో ఈ విషయాన్ని పెట్టి, విషయాన్ని పోలీసుల యిష్టానికి వదిలేసి తన చేతులు దులిపేసుకుంది.

మానేసర్ ప్లాంటును నిరవధికంగా మూసి వేయటంతోపాటు, దోషులు కఠినంగా శిక్షింప బడేవరకూ తాను ప్లాంటును తిరిగి తెరవబోనని మారుతీ సుజుకీ యాజమాన్యం ప్రకటించింది. రక్షణ కల్పించేపేరిట ఫ్యాక్టరీ ఆవరణలో 1200 మందికిపైగా పోలీసులు దిగిపోయి, ప్లాంటు ఆవరణనంతా ఆక్రమించుకున్నారు. మారుతీ సుజుకీ యాజమాన్యం-తన ప్లాంటులో అమ్మకానికి సిద్ధంగా తయారైవున్న 'స్విఫ్ట్', 'డిజైర్' బ్రాండ్ల కార్లను ఫ్యాక్టరీ ఆవరణ నుండి తరలించి, అమ్మకాలు కొనసాగించు కునేందుకు, ఇంత పెద్దసంఖ్యలో పోలీసులను మోహరింపజేసి ప్రభుత్వం వీలుకల్పించింది. కాగా, హర్యానా రాష్ట్ర ప్రభుత్వం లాకౌట్‌ను అనుమతించటం వలన నిరవధికంగా కార్మికులుఉపాధిని కోల్పోయారు.

పైగా, జులై 18 నాటి వరకూ కార్మికులు చేసిన పనికి గానూ వేతన బకాయిలను చెల్లించకుండా నిర్దాక్షిణ్యంగా వదిలివేసి, వారిని మారుతీ యజమాన్యం ఇబ్బందులపాల్జేసింది. తాను తిరిగి ప్లాంటును తెరిచే వరకూ కార్మికులకు వేతన బకాయిలను చెల్లించేదే లేదని యాజమాన్యం అత్యంత నిర్లక్ష్యంగా, పొగరుగా ప్రకటించింది.

మరోవైపున, పోలీసులు దోషులను పట్టుకునే పేరుతో విచక్షణారహితంగా కార్మికులను అదుపులోకి తీసుకుని వేధిస్తూ అరెస్టులు సాగిస్తూ, వారి కాలనీలలో సోదాలు సాగిస్తూ వారిని భయభ్రాంతుల్ని చేస్తున్నారు. పోలీసు బీభత్సానికి జడిసిన అనేక మంది కార్మికులు తమ నివాసాలను వదిలి అజ్ఞాతంగా కాలం గడుప వలసి వస్తోంది. కార్మిక యూనియన్ ఆఫీసు బేరర్లందరినీ పోలీసులు అరెస్టు చేసి, వారందరినీ హత్యకేసులో ఇరికించారు. ఈ ప్రాంతంలోని ఇతర ఆటోరంగ పరిశ్రమలకు చెందిన కార్మికులను కూడా పోలీసులు వేధింపులకు గురిచేస్తున్నారు.

మానేసర్ ప్లాంటు కార్మికులపట్ల రాజ్యం మరియు పోలీసు యంత్రాంగపు కక్ష సాధింపు ధోరణి ఈ విధంగా వుండగా, బడా పారిశ్రామిక పెట్టుబడిదారీ వర్గం- ఈ 'హింస'ను ఖండించే పేరుతో శాంతియుత పారిశ్రామిక వాతావరణం కల్పించాలని డిమాండ్‌చేస్తూ, కార్మికులపైనా, కార్మిక ఉద్యమంపైనా, కార్మిక వర్గ ఉద్యమంపైనా ఒక పద్ధతి ప్రకారం తప్పుడు ప్రచారదాడిని ప్రారంభించింది.

### బడాపెట్టుబడిదారీ వర్గ తప్పుడు ప్రచార దాడి

'సార్క్‌దేశాల వాణిజ్యమండలి' అనే సంస్థ, "ఒక ఉత్పత్తి రంగ కేంద్రంగా, పెట్టుబడులకు భద్రమైన గమ్యస్థానంగా భావించబడే భారతదేశ ప్రతిష్టను మానేసర్ సంఘటన మసకబారుస్తోందని" వగచింది.

'బెంగాల్ పారిశ్రామిక-వాణిజ్యమండలి' అనేసంస్థ, మానేసర్ ప్లాంటులో జరిగిన దౌర్జన్యకర చర్యను ఖండిస్తూ, "ఈ సంఘటన నిజమైన పారిశ్రామిక సంబంధాల సమస్యకు సంబంధ మున్నదిగా తోచటం లేదనీ; యాజమాన్యానికీ, కార్మికులకూ మధ్యనున్న విభేదాలు శాంతియుత వాతావరణంలో చర్చల ద్వారా పరిష్కరించు కోవాలనీ" నైతికోపదేశం చేసింది.

భారతదేశంలో పరిశ్రమలకు అవసరమైన తాత్కాలిక సిబ్బందిని సమకూర్చే ఒక ప్రధాన సంస్థగా వుండి, 3.5 లక్షలమంది తాత్కాలిక సిబ్బందిని వివిధ పరిశ్రమలకు సమకూర్చిన 'ఇండియన్ స్టాఫింగ్ ఫెడరేషన్' (ఐఎస్ఎఫ్) అనే సంస్థ, - "మానేసర్ ఘటన భారతదేశంలో ఉపాధి కల్పనావకాశాలను దెబ్బతీస్తుందని జోస్యం చెపుతూ, అదేవిధంగా ఆయా పరిశ్రమలలో పనిచేసే కార్మికులు సాగించే ఈలాంటి ఘటనలను నిలువరించేందుకు, తమ సంస్థ వంటి వృత్తి నైపుణ్యంగల సిబ్బందిని సమకూర్చే కంపెనీల సేవలను బడాపెట్టుబడిదారీ పారిశ్రామిక యాజమాన్యాలు ఉపయోగించు కోవాలని" సలహానిచ్చింది.

'ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా' ఆధ్వర్యంలో బడాపెట్టుబడిదారీ వర్గ సంస్థలైన 'ఫిక్కి', 'సిఐఐ'లతోపాటు 'స్కోప్' (స్టాండింగ్ కాన్ఫరెన్స్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్), 'ఎన్ఐపిఎమ్' (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్)-వంటి సంస్థలన్నీ, "ఈ విధమైన అనాగరిక చర్యలు ఏనాడూ పునరావృతం కాకుండా ప్రతి భారతీయుడూ కృషి సల్పాలని" నొక్కి చెపుతూ, "ఉద్యోగులు-ట్రేడుయూనియన్లు - ప్రభుత్వము మరియు పౌరసమాజంలతో కూడిన ఒక శాసనబద్ధ వ్యవస్థను ఏర్పాటు చేసి, ఉద్యోగుల మధ్య సంబంధాలను నియంత్రించటంద్వారా హింసారహిత పని ప్రదేశాలకై ప్రభుత్వం హామీ నివ్వాలని" (ఇప్పటివరకూ ఇలాంటి ఏర్పాటేవీ లేనట్లుగా) ఒక వివాదాస్పద ప్రతిపాదనను ముందుకు నెట్టింది.

హెచ్.ఆర్. (మానవ వనరులకు చెందిన) వృత్తి నిపుణుల 'ఎన్.హెచ్.ఆర్.డి.' సంస్థ, మానేసర్ ప్లాంటులో జరిగిన దౌర్జన్యకర చర్యను ముఖ్యంగా హెచ్.ఆర్. జనరల్ మేనేజర్ హత్యను తీవ్రంగా ఖండిస్తూనే, "ఇతర పారిశ్రామిక సంస్థలు, వృత్తినిపుణుల సంఘాలను ఈ విధమైన 'హింసాత్మక' చర్యలను ఖండించవలసిందిగా" అభ్యర్థించింది. "భారత పారిశ్రామిక ప్రతిష్టను పునరుద్ధరించేందుకు, అవసరమైతే వారంతా సమష్టిగా కృషి సాగించాలని" పిలుపు నిచ్చింది. అంతేగాక, "ఈలాంటి చర్యలు భారతదేశంలో బ్రాండ్ ఈక్విటీపై తీవ్ర ప్రభావం చూపుతాయని, భారత పారిశ్రామికరంగంలోని పోటీతత్వాన్ని కుంగదీస్తాయని" తెగ వగచింది.

### కార్మికులపై, కార్మికోద్యమంపై, కార్మిక-వర్గ ఉద్యమంపై దురభిప్రాయాలను వ్యాప్తి చేయటం

కార్పొరేటు ప్రచార మాధ్యమాలు కూడా-కార్మికుల ఉద్యమాన్ని దుమ్మెత్తిపోస్తూనే, కార్మికోద్యమంలోకి పోరాటతత్వాన్నీ, బయటి (రాజకీయ) శక్తులనూ ముఖ్యంగా-ఏ రకానికి చెందిన వామపక్షశక్తుల పాత్రనైనా ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరాదనీ; ఈ విధమైన పారిశ్రామిక అశాంతిని అదుపుచేయకుండా తాత్సారం చేయరాదనీ, ఇలాంటి చర్యలు ఎఫ్.డి.ఐ.తో సహా విదేశీ పెట్టుబడులను ఆకర్షించే ప్రభుత్వ చొరవను దెబ్బతీస్తాయనీ, పారిశ్రామిక అభివృద్ధిని, ప్రగతిని ఆటంకపరిచే కాలం చెల్లిన కార్మిక చట్టాలను సంస్కరించి, పారిశ్రామిక యాజమాన్యాలకు మరింత స్వేచ్ఛనివ్వాలనీ, మారుతీ ప్లాంటులో జరిగిన సీనియర్ మేనేజరు హత్యకు దోవతీసిన కార్మికుల 'హింస' ఏ విధంగానూ సమర్థనీయం కాదనీ- సర్వజ్ఞానిలా ఉపదేశం సాగించింది. ఈ విధంగా కార్పొరేటు మాధ్యమాలు కార్మికులను-కార్మికోద్యమాలను గట్టిగా దుమ్మెత్తి పోస్తూనే, ఈ మధ్య, కాలంలో కార్మికుల దౌర్జన్యకర చర్యలు చాలా తరచుగా చోటు చేసుకుంటున్నాయని పేర్కొంటూ, కార్మికుల 'దౌర్జన్యానికి', కార్మికులనూ, వారి ఉద్యమాన్నే దోషిగా నిలిపేందుకు పరోక్షంగా ప్రయత్నిస్తోన్నాయి.

ఈ విధంగా, కార్మికులు ఒక తీవ్రమైన పద్ధతిలో ఘర్షణ రూపంలో ప్రతిస్పందించటానికి దోవతీసిన వాస్తవ కారణాలను అంచనా వేసేందుకు, మానేసర్ ఘటనపై ఒక నిష్పాక్షిక దర్యాప్తు జరపటానికి వుండే వాతావరణాన్ని ఒక పద్ధతిప్రకారం చెదర గొట్టేందుకు బడాపెట్టుబడిదారీ వర్గం మరియు వారి సన్నిహితవర్గాలూ మోసపూరితంగా మొత్తంగా కార్మికులపై, కార్మికోద్యమంపై దురభిప్రాయాలను వ్యాప్తి చేశాయి.

### కార్మికుల అమానవీయ, దుర్భర, జీవన- పనిపరిస్థితులు

వాస్తవానికి, మారుతీ సుజికీకి చెందిన మానేసర్ ప్లాంటులో మాత్రమే కాక, కార్మికులను తీవ్ర నిరాశా, నిస్పృహలలోకి నెట్టివేసే యాజమాన్యాల కారణంగా కార్మికులు ఒక తీవ్రమైన రూపంలో ఘర్షణపడే విధంగా అనేక ప్రాంతాలలో నెట్టబడుతున్నారు. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల అమలుతో బ్రెజిల్‌లోని సవోపావుల్; దక్షిణ అమెరికాలోని జోహెన్స్‌బర్గ్, చైనాలోని షెన్‌జెన్, భారతదేశంలోని గురుగావ్, నోయిడా, శ్రీపెరంబదూర్, హోసూరు, పుదుచ్చేరీల వంటి ప్రాంతాలలో పారిశ్రామిక బడా పెట్టుబడిదారీవర్గం, తనచే సృష్టించబడిన పారిశ్రామిక మురికివాడలలోని కార్మికులపై రుద్దుతున్న దుర్భరమైన, అమానవీయ జీవన-పని పరిస్థితులే వారిని అంతులేని నిస్పృహకు గురిచేసి, తీవ్రమైన రూపంలో ఘర్షణలకు తలపడేవైపుగా నెడుతున్నాయి.

అపోలో కంపెనీ యొక్క ప్రధాన ప్రపంచ స్థాయి ఉత్పత్తి కాంట్రాక్టరూ మరియు ఒక్క చైనా దేశంలోనే 12 లక్షలమంది ఉద్యోగులను కలిగివున్న 'ఫాక్స్‌కాన్ టెక్నాలజీ' పరిశ్రమ, భారీ ఉత్పత్తిని సాధించేందుకు నిర్వహించిన అతిపెద్ద 'స్వెట్‌షాపుల' (బలవంతంగా కార్మికుల రక్తాన్ని పిండుకుని వారిచే వెట్టి చాకిరీ చేయించే కార్ఖానాలు) కారణంగా ఇటీవల సంవత్సరాలలో ఈ పరిశ్రమలో తీవ్ర రూపంలో ఆందోళనలు చెలరేగటం; ఆ పరిశ్రమలో కార్మికులపట్ల అనుసరించే అభద్రతా చర్యలు కార్మికుల మరణాలకు, ఆత్మహత్యలకూ దోవతీశాయని బాగా వెల్లడైన వాస్తవమే! అదేవిధంగా, అధికోత్పత్తి లక్ష్యాలు, అమానవీయ పారిశ్రామిక విధానాలు, కార్మికులను మనుషులుగా చూడకపోవటం, అనేక రూపాల్లో వేతనాలల్లో కోతల విధింపు, కార్మికులను నేరుగా దగ్గరుండి పనిచేయించే యాజమాన్య దొంతర అధికారులు, కార్మికులను తీవ్ర అవమానాలకు గురిచేసే క్రమశిక్షణా చర్యలకు పాల్పడటం వంటి విధానాలన్నింటి ద్వారా అపోలో కంపెనీ మానవ హక్కులనూ, కార్మికుల హక్కులనూ నిర్దాక్షిణ్యంగా కాలరాచివేస్తోందని నిరూపితమైంది.

ఇవే విధానాలు - చైనాలోని షెన్‌జెన్ ప్రాంతంలోనూ మరి అనేక ప్రాంతాలలో కార్మికులను తీవ్ర నిస్పృహకు గురిచేసి, ఆ విధమైన నిరాశనుండే ఒక తీవ్రమైన ఘర్షణ రూపం చేపట్టేందుకు పురిగొల్పుతోన్నాయి

మనదేశంలో కూడా విదేశీ బడా పెట్టుబడిదారీ వర్గపు అధీనంలోని ఆటోరంగ పరిశ్రమతో సహా పైన పేర్కొన్న పారిశ్రామిక మురికి వాడలలోని కార్మికుల స్థితిగతులు ఇందుకు భిన్నంగా ఏమీలేవు.

తమ సూపర్ లాభాల సముపార్జనకు, ఖర్చులను తగ్గించివేయటం పేరున బడా పెట్టుబడిదారీవర్గ పరిశ్రమలన్నింటిలోనూ కార్మికులపై దుర్భరమైన జీవన- పనిపరిస్థితులనురుద్దటం ద్వారా వారిని అమానవీయంగా యాజమాన్యాలు దోపిడీకి గురిచేస్తున్నాయనేది రహస్యమేమీ కాదు. మారుతీ సుజుకీ యాజమాన్యం కూడా - ఈ విధమైన అమానవీయ దోపిడీకి కార్మికులను గురిచేసే కార్మిక వ్యతిరేక విధానాల అమలులో ఏ మాత్రమూ తీసిపోక పోగా, ఈ విధమైన అమానవీయ, కార్మిక వ్యతిరేక విధానాలను అమలుచేయటంలో భారత బడాపెట్టుబడిదారీ పారిశ్రామిక రంగానికి 'మార్గదర్శకురాలు'గా కూడా గుర్తింపు పొందింది.

గతంలో ఇటలీకి చెందిన బహుళజాతి కంపెనీ అయిన గ్రాజినో ట్రాన్స్ మిషన్ కంపెనీకి (దానిని యిప్పుడు అమెరికాకు చెందిన మరొక బహుళజాతి కంపెనీ కొనివేసింది) చెందిన నోయిడాలోని ప్లాంటులో 2008 సెప్టెంబరు 22న కార్మికుల ఆందోళన సందర్భంగా కంపెనీ ఆవరణలోనే ఆ కంపెనీ యొక్క సి.ఇ.ఓ. మృతిచెందాడు.

2009 జూన్ 3న తమిళనాడులోని కోయంబత్తూరు వద్దనున్న ఆటోరంగ విడిభాగాల

తయారీ సంస్థ 'ప్రికోల్' పరిశ్రమయొక్క ఉపాధ్యక్షుడు, కార్మికుల ఆందోళనల సందర్భంగా మృతిచెందాడు.

తిరిగి, 2012 జనవరిలో పుదుచ్చేరి రాష్ట్రంలోని యానాంలో, కార్మికుల ఆందోళన సందర్భంగా 'రీజన్సీ సిరామిక్స్' యొక్క ఉపాధ్యక్షుడు ప్రాణాలు కోల్పోయాడు.

ఈ సంఘటనలన్నింటిలో - ఆయా యాజమాన్యాలు అనుసరించిన దుర్భర, కార్మిక వ్యతిరేక విధానాలతో విసుగెత్తి, తీవ్ర నిరాశా నిస్పృహలకు లోనైన కార్మికులు, వారి ఆందోళనల సందర్భంగా ఒక తీవ్ర రూపంలో ఘర్షణపడే స్థితికి నెట్టబడ్డారనే అంశాన్ని మరుగుపరిచి, కార్మికులే, తమ యజమానులను హత్యగావించారనే నిరాధారమైన ఆరోపణలకు యాజమాన్యాలు తెగబడ్డాయి. కాగా, దాదాపు ఈ సంఘటనలన్నింటి లోనూ-ఆయా యాజమాన్యాల తరఫు గూండాలు లేదా వారిచే నియమింపబడ్డ రెచ్చగొట్టే ఏజెంట్లు సృష్టించిన హింస ఫలితంగానే ఆయా పరిశ్రమల సీనియర్ మేనేజర్లు మరణించారని సాక్ష్యాధారాలు వెల్లడి చేస్తున్నాయి.

బడా పెట్టుబడిదారీ పారిశ్రామిక యాజమాన్యాలు సృష్టించిన ఘోర, అమానవీయ, దుర్భర పని పరిస్థితులు; కార్మిక యూనియన్లను మొగ్గలోనే చిదిమివేయటంలేదా కార్మికులను వారి యూనియన్లలో సంఘటిత పడనీయకుండా నిరోధించటం; యూనియన్ కార్యకలాపాలలో చురుగ్గావుండే కార్మికులపట్ల యాజమాన్య కక్ష సాధింపు చర్యలు; చట్టభీతి లేకుండా కార్మిక చట్టాలను ఉల్లంఘించటం; ప్రైవేటు గూండాలు, సెక్యూరిటీ సిబ్బందేగాక పోలీసులను ప్రయోగించి కార్మికుల న్యాయమైన నిరసనాందోళనను అణచివేయటం; కార్మికులపై భౌతిక దాడులు సాగించటంతోపాటు వారిని హత్యలకు గురిచేయటం; యాజమాన్యాలతో కార్మికులు సామూహికంగా బేరసారాలాడే హక్కును నిరాకరించటంతోపాటు వారి బాధలకు చెవొగ్గేందుకు ఏ విధమైన మార్గాన్నీ కల్పించకుండా నిరాకరించటం- వంటి చర్యలతోనే; కార్మికులనువారి చావుకు వారిని వదిలివేసి, దారులన్నీ మూసివేసి, ఎలాంటి సాంత్వనా లేకుండా చేసిన యాజమాన్య విధానాలవల్లనే యాజమాన్యాలకు- కార్మికులకు మధ్య అనేక సంఘర్షణలు తరచూ బద్దలవు తున్నాయనేది బహిరంగ రహస్యమే. మరోవైపున ప్రభుత్వం కల్పించే తమ హక్కులను కూడా కార్మికులు ధృఢంగా ప్రకటించుకోలేని, వాటిని అనుభవించే వీలులేని కార్మిక వ్యతిరేక ప్రభుత్వ విధానాలు- సంఘర్షణాపూరిత వాతావరణాన్ని తీవ్రంచేస్తున్నాయి.

సారాంశంలో, ప్రపంచవ్యాపితంగా తన నయాఉదారవాద దోపిడీ విధానాలను రుద్దిన బడా పారిశ్రామిక, వాణిజ్య పెట్టుబడిదారీ వర్గం- ఆత్మగౌరవమంటూ లేకుండా పడి చాకిరీ చేసే వాళ్ళుగా కార్మికులను దిగజారుస్తూ, కార్మికులను ప్రాణమున్న మనుషులుగా పరిగణించటానికి కూడా మొండిగా నిరాకరిస్తూ, వారిని వినియోగవస్తువులను తయారు జేసే ప్రాణంలేని వస్తువులు లేదా యంత్ర సామాగ్రిగా మాత్రమే పరిగణిస్తున్నది. అంతేగాక, కార్మికులు యూనియన్‌లలో సంఘటితమవటాన్ని నిరాకరిస్తూ, ఆ ప్రయత్నాలను క్రూరమైన బలగాలతో, తమ అనుంగు ప్రభుత్వాల సహకారంతో అడ్డుకుంటూ, తమ నిర్దాక్షిణ్యమైన, మొరటు, దోపిడీ కోర్కెలకనుగుణంగా ఆడే మతిలేని, ప్రాణంలేని 'రోబోలు'గా (యంత్ర-కీలుబొమ్మలుగా) కార్మికులను మలిచేందుకు, బడాపెట్టుబడిదారీ వర్గం వీలైన అన్ని ప్రయత్నాలతో అత్యంతదుర్మార్గంగా ముందుకు సాగుతున్నది.

నిరాశానిస్పృహలకు లోనైన కార్మికులు, వారి తీవ్ర నిస్సహాయ స్థితిలో, మరో గత్యంతరం లేక, ఒక తీవ్రమైన ఘర్షణ రూపం ఎంచుకోవటమే ఈ ఘటనలన్నింటిలో వాస్తవ సామాన్య కారణంగా వుంది.

కావున మన దేశంలో, గత దశాబ్దకాలంగా- హోండా, రికో, గ్రాజినో, కిర్లోస్కర్, ఎం.ఆర్.ఎఫ్., నోకియా, హ్యూండాయ్, ఫాక్స్‌కాన్, రీజన్సీ సిరామిక్స్ మరియు మారుతీ సుజుకీ వంటి పరిశ్రమల యాజమాన్యమైన బడాపెట్టుబడిదారీ వర్గం, యాజమాన్యాలకు- కార్మికులకూ మధ్య తీవ్ర రూపంలో ఘర్షణలకు అనివార్యంగా దారితీసే పారిశ్రామిక అశాంతి వాతావరణాన్ని సృష్టించిందనేది స్పష్టమౌతున్నది.

## మారుతీ సుజుకీ యాజమాన్య 'నమూనా పని సంస్కృతి'

ప్రతి 50 సెకన్లకు ఒకకారు చొప్పున ఉత్పత్తి చేసే మారుతీ సుజుకీ మానేసర్ ప్లాంటులో కార్మికులు, సిఇఓతో సహా యాజమాన్య సిబ్బంది అందరూ ఒకే రకపు దుస్తులు ధరిస్తారనీ, ఒకే క్యాంటిన్‌లో కలిసి భుజిస్తారనీ, అలాంటి ఒక 'నమూనా పని సంస్కృతిని' అక్కడ ఏర్పరిచామనే, యాజమాన్య ప్రచారహోరులో పడి ఎవరూ కొట్టుకుపోవాల్సిన అవసరంలేదు. అలాగే ఉదయంపూట 20 నిమిషాలు కార్మికులతో సమావేశం కావటంవంటి హెచ్.ఆర్. చర్యలతో ఎవరూ మోసపోనవసరం లేదు. ఎందుకంటే, ఈ విధమైన కసరత్తులన్నీ కార్మికులను ఆధునిక బానిస పటాలాలలో సరికొత్త బందీలుగా జేసేందుకేననేది స్పష్టం.

కార్మకులపై భౌతిక దాడులు సాగించటంలో, వారి యూనియన్‌ను అణచివేయటంలో, కార్మిక హక్కుల ఉల్లంఘనల గురించి యాజమాన్యంతో కార్మికులుసమష్టిగా చర్చించటాన్ని నిరాకరించటంలో, తన కంపెనీలోని కార్మికులకు ఘోర అమానవీయ, దుర్భర, జీవన-పనిపరిస్థితులు కల్పించటంలో మారుతీ సుజుకీ పరిశ్రమ యాజమాన్యం 'అందెవేసిన చేయి' అనే విషయాన్ని ఎవరూ మరిచిపోరాదు.

మానేసర్ ప్లాంటులో పనిచేస్తున్న 3వేల మంది కార్మికులలో 65 శాతం కార్మికులకు ఏ విధమైన చట్టబద్ధహక్కులూ లేదా సౌకర్యాలూ లేని, పర్మినెంటుకాని కార్మికులు -అనేదాంట్లో దాపరికమేమీ లేదు. మొత్తం కార్మికులలో, కంపెనీ నేరుగా కాంట్రాక్టు కుదుర్చుకున్న వారుగా కూడా కాకుండా, కార్మిక కాంట్రాక్టర్ల ద్వారా నియమింపబడిన కాంట్రాక్టు కార్మికులు 50 శాతంగా వున్నారు. ఈ కాంట్రాక్టు కార్మికులలో ఎక్కువమంది బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందినవారు. వీరంతా అతి తక్కువగా నెలకు 7 వేల రూ॥ మాత్రమే వేతనం పొందుతూకూడా పర్మినెంట్ కార్మికులకు మించిన పనిభారాన్ని మోస్తూనే, ఏ విధమైన పనిభద్రత, సామాజిక భద్రతాలేని జీవితాలు వెళ్ళదీస్తున్నారు. ఈ కాంట్రాక్టు కార్మికులు తమ ఆదాయంలో అత్యధిక భాగాన్ని స్థానిక ప్రైవేటు హాస్టల్స్‌లో గదులకు అద్దెగా చెల్లించటంతో పాటు, ఆహారం, మందులు, కాలకృత్య అవసరాలకు కూడా అత్యధికంగా ఖర్చు చేయవలసి వస్తున్నది.

ఈ కాంట్రాక్టు కార్మికులు, ఆదివారంతోసహా ఏ విధమైన శలవూలేకుండా నెలరోజులపాటూ గొడ్డుచాకిరీ చేయవలసివస్తోంది. ఏ విధమైన శలవు సౌకర్యం లేకుండా, పనికి ఒక నిమిషం ఆలస్యమైనా భారీ జరిమానాలు చెల్లించవలసిరావటం; పని మధ్యలో చాలా తక్కువసేపే అతికొద్ది విశ్రాంతి మాత్రమే ఉండటం వంటి కఠినమైన క్రమశిక్షణ నిబంధనల ప్రకారం వారు పనిచేయవలసి వస్తున్నది. విధులకు హాజరుకాని ఒక్కోరోజుకూ 950 రూ॥ జరిమానా వారికి విధించ బడుతున్నది. వారు అత్యంత భారమైన, శ్రమతో కూడిన పనులను చేయవలసి వస్తున్నది. వారు రెండవ శ్రేణి కార్మికులుగా పరిగణింప బడుతున్నారు. విడిభాగాలను ఒక దగ్గరకూర్చే పనిప్రదేశంలో పనిచేసే కార్మికుల పరిస్థితి మరీ ఘోరంగా వుంది. పైన పేర్కొన్న పనితో పాటు, ఉత్పత్తి లక్ష్యాలను అందుకునే పేరిట హెచ్.ఆర్. సూపర్‌వైజర్ల వేధింపులతో మానసిక ప్రశాంతతకు కార్మికులు దూరమౌతున్నారు. పర్మినెంట్‌కానటువంటి లేదా కాంట్రాక్టు కార్మికుల వేతనాలలో దాదాపు సగభాగం, వారు ఆలస్యంగా వచ్చారనే పేరిట విధించిన జరిమానాల రూపంలో కోత విధించబడుతోంది. ఖర్చులను తగ్గించుకునే 'కృషి'లో భాగంగా మారుతీ సుజుకీ యాజమాన్యం, కార్మికులపై ఖర్చులను మాత్రమే దిగకోస్తూ 'పొదుపు' పాటిస్తున్నది.

## హెచ్.ఆర్. పని విధానాలు

మారుతీ సుజుకీ యాజమాన్యం-తన అక్రమ, అసమంజస కార్మిక విధానాల అమలులో అత్యంత క్రూరమైనది కూడ! ఇది ఎంతటి మొండివైఖరి కలిగిన యాజమాన్యమంటే-గత సం॥రం జరిగిన సమ్మె సందర్భంగా కార్మికులంతా 'సచ్ఛీల పత్రం'పై సంతకం చేయాలని వత్తిడి చేసింది. ఈ పత్రం ప్రకారం-కార్మికులు యాజమాన్యం విధించిన క్రమశిక్షణ పాటించాలి; గైరుహాజరుకారాదు. 'గో-స్లో' ఎత్తుగడలు అనుసరించరాదు; ఉత్పత్తి సూత్రాన్ని పాటించాలి; ఉత్పత్తిని కుంటుపరచటం గానీ లేదా ఉత్పత్తిని దెబ్బతీసే కార్యక్రమాలలో కానీ, పాల్గొనరాదు. ఈ చర్యలన్నీ, చట్టప్రకారం అక్రమ కార్మికాచరణతో సమానమని పూర్తిగా తెలిసికూడా యాజమాన్యం ఈ చర్యలను ధృడంగా, అక్రమంగా అనుసరిస్తూ వస్తోంది. పైగా, మరో స్థాయిలో కార్మికులను, హెచ్.ఆర్. సూపర్‌వైజర్ల నుండి యూనియన్లు రక్షింపలేవని నిరంతరాయంగా బోధనలు చేస్తూ వస్తోంది. కాంట్రాక్టు కార్మికులకు మెరుగైన వేతనాలు, సౌకర్యాలు, పని పరిస్థితులు కల్పించాలనే డిమాండ్స్‌ను తమ సమస్యలతో జోడించి పర్మినెంటు కార్మికులు నిర్వహించే ఆందోళనలలో కాంట్రాక్టు కార్మికులను పాల్గొననీయ కుండా, వారిని యూనియన్లలో చేరనీయకుండా యాజమాన్యంను కార్మిక కాంట్రాక్టర్లను, గూండాలను ప్రయోగించి వారిని అదుపు చేస్తోంది. జులై 18వ తేదీన కూడా, ఒక కార్మికుడిని,తనపని ప్రావీణ్యతను పెంచుకోవాలంటూ టీ విరామ సమయంలో వదలకుండా కూడా హెచ్.ఆర్. సూపర్ వైజరు ఒకరు సతాయించటంతో ఘర్షణ రెచ్చగొట్ట బడింది. ఈ విధంగా 'ఫీడ్‌బ్యాక్'గా పిలవబడే- హెచ్.ఆర్. యాజమాన్యపు చర్యలు, షాప్‌ఫ్లోర్‌కే (పనిప్రదేశానికే) పరిమితంగాక ఏడున్నర నిమిషాల అతికొద్ది టీ విరామ విశ్రాంతి సమయాన్ని కూడా కార్మికునికి దక్కకుండా జేసి, వేధింపు చర్యలు కొనసాగించింది. ఈ విధమైన హెచ్.ఆర్ పని విధానాలతో, కాంట్రాక్టు కార్మికులను అమానవీయంగా పరిగణిస్తూ, అసభ్యంగా వ్యవహరిస్తూ, యాజమాన్యం- కార్మికుల నడుమ ఏ విధమైన మానవీయ పారిశ్రామిక సంబంధాలనూ సాధ్యంకాకుండా చేసిన యాజమాన్యమే, తీవ్ర రూపంలో ధిక్కరణలకు కారణమైంది. పైగా, హెచ్.ఆర్. నిపుణులు, సిబ్బంది- వృత్తిరీత్యా తాము వ్యక్తిగత లాభం పొందే దృష్టితో యాజమాన్యపు మెప్పు పొందటం కోసం, మానవీయ పారిశ్రామిక సంబంధాల ప్రయోజనాలకు హానికలిగించే నిర్ణయాలను యాజమాన్యం పనుపున తీసుకోవట మనేది ఒక సామాన్య విషయంగా మారిపోయింది. నయా ఉదారవాద ఆర్థిక విధానాల అమలుతో, కార్మికులతో మానవీయ పారిశ్రామిక సంబంధాలను ఈ హెచ్.ఆర్. యాజమాన్యం మరింత - కంటక భూతంగా మార్చివేసింది.

## జులై 18 ఘటన-వాస్తవాలు

కాగా, జులై 18న యాజమాన్యానికి- కార్మికులకు నడుమ వివాదాన్ని గురించి చర్చించుకునేందుకు పరిపాలనా విభాగ భవనం వద్ద సమావేశం జరుగుతూండగా, కార్మిక కాంట్రాక్టర్లు అక్కడే వున్నారని ప్రచారమాధ్యమాల నివేదికల ద్వారా తెలియ వస్తున్నది. కనుక, కార్మిక కాంట్రాక్టర్లు- కార్మికులను బెదిరించేందుకు ఫ్యాక్టరీ ఆవరణలోకి అల్లరిమూకలను ప్రవేశపెట్టారని, జులై 18న-రాకేష్ అనేకాంట్రాక్టరు అతని గూండాలతో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న కార్మికులతో గొడవకు దిగి, మానేసర్ ప్లాంటు ఆవరణలో దౌర్జన్యకర ఘర్షణలకు, హెచ్.ఆర్. జనరల్ మేనేజర్ మరణానికి, ఆస్తుల దహనానికి కారకులయ్యారనే కార్మికుల వాదనను ఈ వాస్తవం ధృడపరుస్తున్నది.

జులై 18న మానేసర్ ప్లాంటులో యాజమాన్యానికి- కార్మికులకు మధ్య 'దౌర్జన్యకర' సంఘర్షణకు సంబంధించిన వాస్తవాలు ఇలాఉండగా, మారుతీ సుజుకీ యాజమాన్యం తన అహంభావ, తీవ్ర చర్యలద్వారా, కార్మికులలో అసంతృప్తిని పెంపుజేసి, వారికి మరో గత్యంతరం లేకుండా అవాంఛనీయ సంఘర్షణకు వారిని ప్రేరేపింప జేసిన తన హీనమైన పాత్రను కప్పిపుచ్చు కునేందుకు, వాస్తవాలను వక్రీకరించేందుకు మోసపూరితంగా వ్యవహరించింది. యాజమాన్యం, జరిగిన సంఘటనల క్రమాన్నంతటినీ తనకు సానుకూలంగా మార్చివేసి,కార్మికులే తమంత తాముగా విధ్వంసానికి, ఆస్తుల దహనానికి, హింసకు పాల్పడినట్లుగా, హెచ్.ఆర్ జనరల్ మేనేజరును హత్యగావించినట్లుగా వక్రంగా చిత్రీకరించింది. ఈ రకపు అబద్ధపు వాదనలతో మారుతీసుజుకీ యాజమాన్యం- ముఖ్యంగా మానేసర్ ప్లాంటు కార్మికులపైనా; మొత్తంగా భారతదేశ కార్మికవర్గం, కార్మికోద్యమం పైనా ఒక ప్రమాదకరమైన, నిశ్చితమైన, పద్ధతి ప్రకారమైన దాడిని ప్రారంభించింది. కార్మికులను, తమ వర్గ రాజకీయాల నుండి దూరం జేసే ప్రధాన ఉద్దేశ్యంతో ఈ దాడి ఎక్కుపెట్టబడింది. తద్వారా కనీసపాటి నిరసనకు కూడా అవకాశం లేకుండా బడాపారిశ్రామిక పెట్టుబడిదారీ వర్గదాడులకు, వారి అమానవీయ దోపిడీకి కార్మికులను శాశ్వత దుర్బలవనరుగా మార్చేందుకే మారుతీ యాజమాన్యం ఈ దాడి సాగిస్తోంది.

## కార్మికవర్గంపై ప్రమాదకర దాడికి మారుతీ సుజుకీ యాజమాన్య కుటిల ప్రయత్నాలు

మీదుమిక్కిలి, మారుతీ సుజుకీ యాజమాన్యం- తన తోటివారైన బడాపారిశ్రామిక పెట్టుబడిదారులతో, నైపుణ్యయుతంగా ఒక ఐక్యఫ్రంట్‌ను ఏర్పరచుకొని, మరింత ప్రమాదకరంగా, దూకుడుగా కార్మికులపైనా, కార్మికవర్గ రాజకీయాలపైనా దాడులను కొనసాగిస్తోంది. నయాఉదారవాద ఆర్థిక విధాన సమర్థకులైన మేధావులు కూడా తమంతట తామే -ఈ హెచ్.ఆర్. యాజమాన్య విధానాలే, మానవీయ పారిశ్రామిక సంబంధాలను దెబ్బతీసి, నాశనం చేస్తోన్న దోషకారణంగాను; పెట్టుబడిదారీ వర్గ ప్రయోజనాల విఘాతానికి దోవతీస్తోన్న అవాంఛిత ఘర్షణలకు కారణంగానూ ఆరోపిస్తూ, హెచ్.ఆర్. యాజమాన్య దొంతరను షాప్-ఫ్లోర్ (పనిప్రదేశ) స్థాయినుండి తొలగించివేసి కార్మికులతో సంబంధాలు నెరపాలని సిఫార్సు చేస్తున్నారు. కాగా, మారుతీ సుజుకీ యాజమాన్యం ఈ రకమైన 'హింసాత్మక' సంఘటనలు తిరిగి జరగకుండా తగినచర్యలు తీసుకునే సాకుతో- ఆదిత్య బిర్లా గ్రూపు, టాటాసన్స్, మ్యాక్స్- ఇండియా, మహీంద్రా&మహీంద్రా, పీపుల్‌స్ట్రాంగ్ తదితల కంపెనీల - హెచ్.ఆర్. అధిపతులతో ఒక సమావేశం నిర్వహించింది. తద్వారా కార్మికులు ఐక్యంకాకుండా, వారి సహజ వర్గరాజకీయాల పతాకం క్రింద వారు సంఘటిత పడకుండా కార్మికవర్గ రాజకీయాల దిశగా వారి పోరాటం ఎక్కుపెట్టబడకుండా- భారతదేశంలో కార్మికులపైనా, కార్మిక వర్గంపైనా తీవ్రమైన దాడులు సాగించేందుకు మారుతీ సుజుకీ యాజమాన్యం తనతోపాటుగా భారత దళారీ పెట్టుబడిదారులనూ తన మార్గంలో కట్టివేసింది. ఈ విధంగా మారుతీ సుజుకీ యాజమాన్యం-కార్మిక వర్గాన్ని వారి వర్గరాజకీయాల నుండి విడదీసి, నిరాయుధుల్ని చేసేందుకు తన గంభీరమైన దాడిని ప్రారంభించింది.

అంతేగాకుండా మారుతీసుజుకీ యాజమాన్యం, మానేసర్ ప్లాంట్ పరిసర గ్రామాలలోని స్థానిక పెత్తందారులయొక్క, పరాన్నభుక్కులైన మరికొందరి యొక్క మద్దతును కూడగట్టింది. వీరంతా పెటీ బూర్జువా వ్యాపారాలైన- రియల్‌ఎస్టేట్, కార్మికులకు గదులు అద్దెకివ్వటం, కాంట్రాక్టు కార్మికులను సరఫరా చేయటం-వంటి వాటిపై ఆధారపడి లాభం పొందుతున్న వారుగా వున్నారు. 200 గ్రామాల నుండి హాజరైన ఈ తరహా 'గ్రామపెద్దల'తో నిర్వహించిన 'మహాపంచాయత్'గా పిలవబడే సమావేశంలో, వారంతా మారుతీ సుజుకీ యాజమాన్యానికి మద్దతుగా నిలుస్తామని, ఈ ప్రాంతంలోని 7 గ్రామాల ప్రజలతో కూడిన ఒక కమిటీని ఏర్పరచి కార్మిక సంక్షోభ పరిష్కారానికి మారుతీ సుజుకీ యాజమాన్యంతో కలసి పనిచేస్తామని ప్రకటించారు. అంతేగాక కార్మిక యూనియన్లతో పోరాడతామని కూడా వారు ప్రతిన బూనారు. ఈ విధంగా మారుతీ సుజుకీ యాజమాన్యం - కార్మికులకు వ్యతిరేకంగా ప్రమాదకరమైన దాడిని ప్రారంభించేందుకు కుట్రపూరిత ప్రయత్నాలను ముమ్మరం చేసింది.

## 'ఎరుపు' వాదుల 'వర్గదాడి' పేరిట కార్మికుల అణచివేతను తీవ్రంచేసే దుష్ట పథకాలు

జులై 18 నాటి ఘటన, 'ఎరుపు' వాదులు (వారు మావోయిస్టులు కావచ్చు) పథకం ప్రకారం సాగించిన 'వర్గదాడి' అనీ, వారి ఆలోచనల కనుగుణంగా సాగించిన 'దాడి' అనీ, వామపక్ష శక్తుల 'చేతిపని' అనీ మారుతీ సుజుకీ యాజమాన్యం తన కుటిల వాక్చాతుర్యంతో చేపట్టిన ప్రచారం అలా వుండగా, ఈ సంఘటనపై ప్రత్యేక దర్యాప్తు నిర్వహించిన పోలీసుబృందం స్పష్టంగా, వివరంగా ఈ విధంగా వెల్లడించింది.

ఎ) జులై 18 ఘటన ముందుగా నిశ్చయించుకున్న ప్రకారం జరిగిన దాడికాదు.

బి) మానేసర్ ప్లాంటులో జరిగిన 'హింసా' సంఘటనలో 'ఎరుపు' హస్తం వుందనటానికి ఏ ఆధారమూ లేదు.

పోలీసుల దర్యాప్తు బృందమే ప్రకటించిన ఈ వాస్తవాల ఆధారంగా, మానేసర్ ఘటన యాదృచ్ఛికంగా జరిగిన సంఘటనగా స్పష్టం అవుతున్నది.

కానీ, పోలీసుల ఈ ప్రకటనలను ప్రక్కనబెట్టి యాజమాన్యాలకీ, కార్మికులకీ నడుమ ఇటీవల కాలంలో జరుగుచున్న పారిశ్రామిక సంఘర్షణలకు కారణం 'ఎరుపు' హస్తమేనని, తదనుగుణంగా ప్రభావితంచేయటానికి ప్రయత్నిస్తూ, సంబంధిత ప్రభుత్వాల మద్దతుతో కార్మికోద్యమాన్ని, కార్మిక వర్గాన్ని ఒకే దెబ్బతో అణచివేసేందుకు ఈ సాకును (కమ్యూనిస్టు భూతాన్ని) బడాపెట్టుబడిదారీ వర్గం ముందుకు తెస్తోంది.

ఇటీవల 'ఎంప్లాయిూస్ ఫెడరేషన్ ఆఫ్ సదరన్ ఇండియా' (ఇ.ఎఫ్.ఎస్.ఐ) అనే సంస్థ తన ఆంతరంగిక సమావేశాల అనంతరం, తమిళనాడు ముఖ్యమంత్రి జయలలితకు ఒక విజ్ఞప్తి చేసింది. అందులో 'న్యూ డెమోక్రటిక్ లేబర్ ఫ్రంట్' అనే సంస్థ (ఏ రాజకీయ పార్టీ, లేదా ఏ విభాగము ఈ సంస్థను ఏర్పాటు చేసిందో తెలియరాలేదు) రాష్ట్ర పారిశ్రామిక వాడలలో దౌర్జన్యాలను ప్రేరేపిస్తూ అశాంతికి కారణమౌతున్నదని ఆరోపించింది. కనుక, పారిశ్రామిక రక్షణకోసం ప్రత్యేక పోలీసు బలగాలను నియమించేందుకు ప్రభుత్వం తన పథకాన్ని త్వరితం చేయాలని కోరింది. మావోయిస్టులు లేదా 'ఎరుపు' తీవ్రవాదులు పారిశ్రామిక అశాంతి, హింసలకు కారణమౌతున్నారనే దురారోపణలు సాగిస్తోంది. వాస్తవానికి బడాపెట్టుబడిదారీ వర్గం సృష్టించిన అమానవీయ జీవన-పనిపరిస్థితుల పర్యవసానమే, అనివార్యంగా పారిశ్రామిక అశాంతి ప్రజ్వరిల్లటానికి కారణమౌతున్నప్పటికీ-ఇ.ఎఫ్.ఎస్.ఐ-తమిళనాడు, కర్నాటక, పుదుచ్చేరి రాష్ట్రాలలోని పారిశ్రామిక మురికివాడలలో మొగ్గతొడుగుతున్న కార్మికోద్యమాలను క్రూరంగా అణచివేసేందుకే ఈ వ్యాఖ్యలకు పూనుకుంది. భారత కార్మిక చట్టాలను కనీసంగా గౌరవించని బహుళజాతి సంస్థల, బడా పారిశ్రామిక పెట్టుబడిదారీ వర్గంయొక్క వైఫల్యాలను ఉల్లంఘనలను ఈ రకంగా కప్పిపుచ్చేందుకు ప్రయత్నిస్తోంది.

మరోవైపున 'హింసాత్మక సంఘటన' గురించి దర్యాప్తు పేరిట పోలీసులు కార్మికులను భయభ్రాంతులను చేస్తూ; యాజమాన్య ఆరోపణలకు విరుద్ధమైన సాక్ష్యాధారాలున్నప్పటికీ దానిని ప్రక్కనబెట్టి ముఖ్యంగా యూనియన్ ఆఫీస్ బేరర్లను తప్పుడు హత్యకేసులలో ఇరికిస్తున్నారు. రాజ్యం, తన పోలీసు యంత్రాంగం ద్వారా-ఎగాజినో ట్రాన్సిమిషన్, రీజన్సీ సిరామిక్స్,రికో, ప్రికోల్ కంపెనీల కార్మికులను హింసకు గురిచేసిన విధంగానే దర్యాప్తు పేరుతో ప్రస్తుతం మానేసర్ ప్లాంటు కార్మికులను భయభ్రాంతుల్ని చేస్తోంది. ఐతే, రాజ్యం కానీ, పోలీసు యంత్రాంగంకానీ - వీరెవరూ, ఏనాడూ యాజమాన్యంచే నియమించబడిన గూండాలు, మేనేజర్లు, భద్రతా సిబ్బంది మొదలైన వారి చేతిలో గత రెండు దశాబ్దాల కాలంలో కార్మికుల హత్యలనేకం వెలుగులోకి వచ్చినప్పటికీ, ఆ విషయాన్ని ప్రక్కన పెడుతున్నారు. ఆ హత్యలకు గురైన కార్మికుల కేసులను దర్యాప్తు చేయవలసిన అవసరముందని వీరు ఏనాడూ తలపోయనే పోయరు. కార్మికుల హత్యలపై ప్రత్యేక దర్యాప్తు బృందాలూ వుండవు లేదా ప్రత్యేక న్యాయమూర్తులను నియమించటాలు, శాంతి భద్రతలను పరిరక్షించి పారిశ్రామిక యాజమాన్యాలు సాగించే హత్యలనుండి కార్మికులను కాపాడటాలు ఏనాడూ జరగవు. ఈ వాస్తవం- మన 'ప్రజాస్వామిక' రాజ్యం యొక్క వర్గ స్వభావాన్ని, సంపదల సృష్టికర్తలైన కార్మికుల ప్రయోజనాలను పణంగా పెట్టి బడా పెట్టుబడిదారీ వర్గంతో జంకూ గొంకూ లేని దాని చెట్టాపట్టాలను వెల్లడి చేస్తుంది.

భారత పారిశ్రామికాభివృద్ధిని కాలం చెల్లిన కార్మిక చట్టాలు అడ్డుకుంటున్నాయి కనుక వాటిని సంస్కరించాలని ఉద్యోగకల్పనా సంస్థలు మరియు బడాపెట్టుబడిదారీ వర్గమూ నిరంతరాయంగా డిమాండ్ చేస్తూనే వస్తున్నాయి. వీరికి తొత్తులైన మేధావులు, కార్మిక చట్ట సంస్కరణల తక్షణావశ్యకత గురించి అస్పష్ట పదజాలంతో జపంచేస్తూ బడాపెట్టుబడిదారీ వర్గప్రయోజనాలను పెంపొందించటం కోసమే ఈ 'సంస్కరణలు' అనే వాస్తవాన్ని దాచిపెడుతున్నారు.

## కార్మికులను నికృష్ట దోపిడీ చేసుకునేందుకు లైసెన్స్ కావాలంటున్న భారత బడాపెట్టుబడిదారులు

ఏమైనప్పటికీ, మానేసర్ ప్లాంటులో ఇటీవలి అశాంతిని ఖండించే సాకుతో బడా పెట్టుబడిదారీ వర్గ ప్రతినిధులు, తమ నిర్దుష్టమైన డిమాండ్స్‌తో ముందుకొచ్చారు.

మానేసర్ ప్లాంటు కార్మికుల అసంతృప్తికి 'కార్మికుల కాంట్రాక్టీకరణ కారణంకాదా' అని ఎత్తి చూపితే, కాంట్రాక్టు కార్మికుల నియామక పద్ధతిని రద్దు చేయమని అడిగితే "పర్మినెంటు కార్మికులను భరించలేని స్థితిలోగానీ, వారు అవసరం లేని స్థితిలో గానీ, ఆ కార్మికులు తమవిధులను సంతృప్తికరంగా నిర్వహించకుంటేగానీ పురాతనమైన భారత కార్మిక చట్టాల కారణంగా-వారిని తమ ఇష్టం వచ్చిన విధంగా తొలగించేందుకు భారత పారిశ్రామిక రంగానికి కష్టతరంగా వున్నదనీ, అందుకే మారుతీ సుజుకీ కంపెనీ ఉదారంగా కాంట్రాక్టు కార్మికులను ఉపయోగించుకుంటున్నదనీ" వారు వాదిస్తారు. "కాంట్రాక్టు కార్మికులకు మారుతీ సుజుకీ యాజమాన్యం సమంజసమైన వేతనాలు చెల్లించకుండా, సామాజిక సౌకర్యాలను కల్పించకుండా వారిని అడ్డుకున్నదేమిటనీ, 'పురాతన' కార్మిక చట్టాల ప్రస్తావన మధ్యలో ఎందుకొచ్చిందనీ" ప్రశ్నిస్తే వారి వద్ద సమాధానం లేదు. "కాంట్రాక్టు కార్మిక చట్టాలు, సమానపనికి సమాన వేతనాలను గురించి నొక్కి చెప్తుండగా మారుతీ సుజుకీ యాజమాన్యం, ఎందుకు ఈ చట్టపరమైన అంశాన్ని అమలుచేయద"నే ప్రశ్నకు వారు సమాధానం చెప్పటానికి నిరాకరిస్తారు, "మారుతీ సుజుకీ యాజమాన్యం ఒక్కటిమాత్రమే కాంట్రాక్టు పని విధానాన్ని రద్దు చేయలేదనీ, మొత్తం పరిశ్రమలన్నీ కలిస్తేనే ఇది సాధించగలమని" వాదిస్తూ, అదే గొప్ప సంయమనంగా వారు భావిస్తున్నారు. బడా పెట్టుబడిదారీ వర్గ ప్రతినిధులు నిర్దుష్టంగా ఇలా డిమాండ్ చేస్తున్నారు.:

*ఎ) పారిశ్రామిక వాతావరణాన్ని సులభతరం చేసేవిధంగా కార్మిక చట్టాలను 'సంస్కరించాలి'. శాంతి భద్రతలను కాపాడుకుంటూ, విచ్ఛిన్నకర శక్తులకు విరుద్ధంగా నిలిచిన పరిశ్రమలకు మద్దతునివ్వాలి.*

ఈ విధంగా బడాపెట్టుబడిదారీ వర్గం-పారిశ్రామిక వివాదాలను శాంతి భద్రతల సమస్యగా పరిగణిస్తూ, తమ చట్ట బద్ధ ప్రయోజనాల కొరకు ఆందోళన చేస్తున్న యూనియన్లను విచ్ఛిన్నకర శక్తులని పేరుపెట్టి దుంపనాశనం చేయటానికే ఈ డిమాండ్ చేస్తున్నది.

*బి) పోరాటతత్వం కలిగిన యూనియన్ల గుర్తింపును రద్దు చేసి, సంఘ సభ్యత్వ రుసుమును కార్మికుల వేతనం నుండి నేరుగా యాజమాన్యమే వసూలు చేసి, దానిని యూనియన్‌కు జమ చేసే విధానం కావాలి.*

ఈ రకంగా బడాపెట్టుబడిదారీవర్గం-కార్మికులను 'రాబో'ల తీరున అమానవీకరిస్తూ, దుర్భరమైన-జీవన, పనిపరిస్థితులు అదేవిధమైన పారిశ్రామిక స్థితిగతులనుండి పెల్లుబికిన కార్మికుల సంఘటిత సమరశీలతను నీరుగార్చాలని డిమాండ్ చేస్తున్నది. అలాగే, ట్రేడు యూనియన్ల ఆర్థిక వనరులను కూడా అదుపు చేయాలని, యూనియన్ సభ్యత్వం గురించిన పూర్తివివరాలను యాజమాన్యం సమకూర్చుకోవటంతోపాటు, ఈ సమాచారాన్ని ఉపయోగించుకొని యూనియన్ నాయకత్వాన్ని తమతో మొత్తంగా రాజీ పడమనటానికో లేక యూనియన్‌లోగానీ లేదా యూనియన్ నాయకత్వంలో గానీ విభజనను సృష్టించే పరిస్థితులు కల్పించాలని డిమాండ్ చేస్తున్నది.

*సి) వేతనాలకనుగుణంగా ఉద్యోగులకు పనిగంటలను యాజమాన్యమే నిర్ణయించే అధికారం యివ్వాలి. చట్టనిబంధనల ప్రకారం చట్టం నిర్దేశించిన దానికి బదులుగా యాజమాన్యమే స్వయంగా ధృవీకరణను ఇచ్చేందుకు అనుమతించాలి.*

ఈ విధంగా బడాపెట్టుబడిదారీవర్గం-8 గంటల పనిదినం అనే విధానాన్ని రద్దు చేయాలనీ, కార్మికుల జీవన ప్రమాణాల వంటి ఏ విధమైన శాస్త్రీయ దృక్పథాలపై ఆధారపడనవసరం లేకుండానే దాని స్థానంలో కార్మికుల పనిభారాన్ని, వేతనాల నిర్ణయాన్ని చిత్తమొచ్చిన విధంగా నిర్ణయించే అధికారాన్ని తనకివ్వాలని, తద్వారా కార్మికులను మరింత నికృష్టదోపిడీకి గురిచేసుకునే అవకాశాలను సులభతరం చేయాలని డిమాండ్ చేస్తున్నది.

*డి) కార్మిక యునియన్ చట్టప్రకారం, ట్రేడు యూనియన్ రిజిస్ట్రేషనుకు అవసరమైన కనీస కార్మికుల సంఖ్యను ప్రస్తుతమున్న 10 శాతం నుండి 30 శాతంగా పెంచాలి.*

ఇప్పటికే ట్రేడ్‌యూనియన్ రిజిస్ట్రేషన్ను అడ్డుకునేందుకు పారిశ్రామిక యాజమాన్యాలు కల్పించే కుట్రలు, కుయుక్తులను ఎదుర్కొంటూ ప్రస్తుత నిబంధనల ప్రకారం ట్రేడు యూనియన్ నమోదుకు అవసరమైన 10 శాతం కార్మికులను సమీకరించుకోవటమే దాదాపు అసాధ్యమైన లక్ష్యంగా మారిపోయింది. ఈ స్థితిలో, ఈ సంఖ్యను 30 శాతానికి పెంచటమంటే, కార్మికులు యూనియన్‌ను ఏర్పాటు చేసుకోగలగటం అనే దానిని కార్మికులకు దాదాపు అసాధ్యం చేయవలసిందిగా బడా పెట్టుబడిదారీ వర్గం డిమాండ్ చేస్తున్నది.

*ఇ) ట్రేడు యూనియన్ల రాజకీయీకరణను లేదా ట్రేడు యూనియన్లకు బయటి వ్యక్తుల నాయకత్వాన్ని అనుమతించరాదు.*

ఈ విధంగా బడాపారిశ్రామిక పెట్టుబడిదారీ వర్గం-కార్మికులకు-ముఖ్యంగా, వారి వర్గ రాజకీయాలు అందకుండా ట్రేడు యూనియన్లను నిరాయుధం జేసేందుకు, కార్మికుల సంఘటిత శక్తిని బలహీన పరిచేందుకు పూనుకుని వ్యవహరిస్తోంది. మరోవైపున బడాపెట్టుబడిదారీ వర్గం మాత్రం-పాలక రాజకీయ పార్టీల అనుబంధ యూనియన్ల మద్దతును కూడగట్టుకుని తన దోపిడీ విధానాలను మరింత తీవ్రం చేసేందుకు నిపుణులు, సలహాదారులు తదితర రూపాలలో 'బయటివారి' మద్దతును ఉపయోగించుకుంటూనే వున్నది.

ఈ విధంగా-సారాంశంలో బడాపెట్టుబడిదారీ వర్గం 'మావోయిస్టుల బెదిరింపు', 'వామపక్షాల చేతిపని', ట్రేడుయూనియన్ల 'హింసాత్మక చర్యల' పేరున ముద్రలు వేస్తూ చురుకైన కార్మికోద్యమాలనన్నింటినీ అణచి వేసేందుకూ, మనదేశ కార్మిక ఉద్యమాలతోపాటు కార్మికవర్గ ఉద్యమాలను కూడా కాలరాచివేసేందుకు భారత పాలక వర్గాలతో కలసి పన్నిన కుట్ర ఇది అనటంలో సందేహమెంతమాత్రమూ లేదు.

## కొన్ని చారిత్రక వాస్తవాలు

ఈ సందర్భంలో-కొన్ని చారిత్రక వాస్తవాలను స్పష్టం చేసుకోవలసి వుంది. అవి :

1 మార్క్సిజం-లెనినిజం (కమ్యూనిజం యొక్క శాస్త్రీయ తత్వశాస్త్రం) ఏనాడూ, కార్మికులు తమ డిమాండ్లను నెరవేర్చుకునేందుకు హింసను, వారి యజమానులను హత్యగావించటాన్ని, యంత్రాలను ధ్వంసం చేయటాన్ని - ఒక పోరాట రూపంగా అవలబించటాన్ని ఆమోదించలేదు. పైగా, అటువంటి విధానాన్ని వ్యతిరేకిస్తూ "ఆ విధానాన్ని ఏనాటికీ లక్ష్యాలను సాధించలేని ఆర్థిక అరాచకత్వంగా" నిర్వచించి తీవ్రంగా నిరసించింది కూడా!

2 బానిసల తిరుగుబాట్లనూ లేదా ఫ్యూడలిజానికి వ్యతిరేకంగా బూర్జువాల విప్లవాలనూ ప్రేరేపించింది, మార్క్సిజం - లెనినిజం (కమ్యూనిస్టు తత్వశాస్త్రం) ఎంత మాత్రం కానే కాదు.

మరోవైపున -ఆయా సామాజిక వ్యవస్థలు సృష్టించిన దోపిడీ, అణచివేత, అసమానత్వపు దుర్భర భౌతిక పరిస్థితులే ఆయా పోరాటాలు ప్రజ్వరిల్లటానికి కారణాలుగా వున్నాయి. సామాజిక వ్యవస్థలనే కూల్చివేసిన ఆయా పోరాటాలు, విప్లవాలు బ్రద్దలవటానికి దోవతీసిన కారణాలను మాత్రమే మార్క్సిజం (కమ్యూనిజం) గుర్తించి, వాటిని సిద్ధాంతీకరించింది. దాని ప్రకారమే, గతి తార్కిక భౌతికవాదాన్ని అన్వయించి పెట్టుబడిదారీ వ్యవస్థ తనగర్భంలోనే తనను కూల్చివేసే శక్తులను సృష్టించుకుందనీ, ఆ విధంగా ఉనికిలోకి వచ్చిన కార్మిక వర్గమే పెట్టుబడిదారీ వ్యవస్థకు సమాధి కడ్తుందనీ, శాస్త్రీయ అధ్యయనం ద్వారా మార్క్సిజం ప్రబోధించింది.

కనుక తన ఉనికికి ప్రమాదకరమైనవారుగా కార్మికులను, వారి వర్గ రాజకీయాలను బడాపెట్టుబడిదారీ వర్గం నిందించాల్సిన అవసరం లేదు. దానికి ప్రతిగా, తనచే సృష్టించబడుతున్న అమానవీయ భౌతిక, జీవన-పనిపరిస్థితులే కార్మికులను తిరుగుబాట్లకు, సంఘర్షణలకు పురిగొల్పుతున్నాయని గ్రహించాలి. అయితే, ఈ వాస్తవాల గురించి బడాపెట్టుబడిదారీ వర్గానికి స్పృహ లేదని భావించాల్సిన అవసరం లేదు. కానీ, అది ఈ వాస్తవాలను గుర్తించి కూడా ఆమోదించకుండా కార్మికవర్గ విప్లవాల ఫలితంగా సంభవించబోయే తనవినాశనాన్ని సాధ్యమైనంత ఎక్కువకాలం వాయిదా వేసేందుకు తెగ ప్రయాస పడుతోంది. ఈ కారణంగానే బడాపెట్టుబడిదారీవర్గం- అనివార్యంగా సంభవించబోయే కార్మికుల, కార్మికవర్గ ఉద్యమాలను 'ఎర్ర-తీవ్రవాదం' తదితర సాకులతో కఠినంగా అణచివేసే ఏకైక ఉద్దేశ్యంతో తన క్రూరమైన దాడిని కార్మికులకు, కార్మిక వర్గ ఉద్యమాలకు వ్యతిరేకంగా ఈనాడు ఎక్కుపెడ్తోంది. కార్మికులను, తమ సహజ వర్గ రాజకీయ మార్గదర్శకత్వం నుండి తప్పించి, నిరాయుధుల్ని చేసేందుకు, కార్మికులు సంఘటిత మవడాన్ని మొగ్గదశలోనే నలిపినాశనం చేసేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తోంది. మనదేశ కార్మికులను, కార్మికవర్గాన్ని అణచి వేసేందుకు బడాపెట్టుబడిదారీ వర్గం ప్రారంభించి, సాగిస్తున్న క్రూరమైన దాడి స్వభావం ఈ విధంగా వుంది.

## సాంప్రదాయక కేంద్ర ట్రేడుయూనియన్ల ప్రతిస్పందనలు

కానీ, మనదేశంలోని కార్మికోద్యమంలో అంతర్గతంగా నెలకొన్న అనేక బలహీనతల కారణంగా, ఈ దాడులను తిప్పికొట్టేందుకు తగినరీతిలో స్పందించలేకపోవటం విచారకరమైన విషయం. బడా బూర్జువా వర్గం దూకుడుగా, తీవ్రతతో, ప్రమాదకరంగా సాగిస్తున్న దాడికి బదులుగా సంజాయిషీ పూర్వక, ఆత్మరక్షణాపూర్వక వైఖరులతో సాంప్రదాయక ట్రేడ్‌యునియన్ల యొక్క మొక్కుబడి ప్రతిస్పందనలు ఏ విధంగానూ సరితూగవనేది నిస్సందేహం. సాంప్రదాయక ట్రేడుయూనియన్లు హింసాత్మక ఆందోళనలను ఆమోదించవు లేదా చేపట్టవంటూ వాటిని పొగుడుతూ, సంఘర్షిస్తున్న కార్మికుల నుండి సాంప్రదాయక ట్రేడుయూనియన్లను వేరు చేసేందుకు బడాపెట్టుబడిదారీ వర్గం విభజించే ఎత్తుగడలను ప్రయోగిస్తూంటే, సాంప్రదాయక ట్రేడు యూనియన్లు ఆ పొగడ్తల బుట్టలోపడిపోతుండటాన్ని మనం గమనించగలం. ఈ సాంప్రదాయక ట్రేడు యూనియన్లు-రికో, గ్రాజినో, ప్రికోల్, రీజన్సీ సిరామిక్స్, మారుతీసుజుకీ-వంటి పరిశ్రమలలో కార్మికుల దౌర్జన్యకర సంఘర్షణలు చోటు చేసుకున్నపుడు, వాటిని నిర్వహించిన యూనియన్లు స్వతంత్రమైనవనీ, ఏ కేంద్ర ట్రేడుయూనియనుకూ అవి అనుబంధం కానివంటూ ప్రకటించటంతో పాటు, వాటిని తమ కేంద్రీయ ట్రేడుయూనియన్లకు అనుబంధం చేయటానికి అనుమతిస్తే, మరింత మెరుగైన పారిశ్రామిక సంబంధాలను (బడాపెట్టుబడిదారీ వర్గ మనోభీష్టాల కనుగుణంగా) నెరుపుతామంటూ గట్టి హామీ నిస్తున్నాయి.

దోపిడీ వ్యతిరేక, కార్మికవర్గ రాజకీయాలను ఆచరిస్తూ, ఎత్తిపడుతూ కార్మిక హక్కులను నొక్కి చెపుతూ, ఎలుగెత్తి నినదించాల్సిన కీలకమైన ఈ సమయంలో- ఈ రకపు సంఘర్షణలకు తాము మార్గదర్శకత్వం వహించబోమంటూ సాంప్రదాయక కేంద్రీయ ట్రేడుయూనియన్లు తమను తాము దూరం పెట్టుకోవటం ద్వారా అవి, బడాపెట్టుబడిదారీ వర్గం చేస్తున్న దాడులకు పరోక్షంగా ఊతమిస్తున్నాయి.

మరోవైపున - దళితుల అభ్యున్నతికి, వారి ఆత్మగౌరవానికి పాటుపడుతున్న అనేక దళిత సంస్థల నాయకత్వాలు; సామాజిక న్యాయం సాధించటం ద్వారా, దళితులకు రాజ్యాధికారం సంక్రమింప జేయటంద్వారా సామాజిక వివక్షతలను అంత మొందించగలుగుతామని, అందుకై పాటుబడుతున్న అనేక దళిత సంస్థల నాయకత్వాలు-మానేసర్ ప్లాంటులో సూపర్‌వైజర్ ఒక దళిత కార్మికుడిని కులం పేరుతో దూషించి, తీవ్ర అవమానాలకు గురిచేయటాన్ని ఖండించకుండా మౌనంగా వుండిపోవటం పేర్కొనదగిన అంశం. ఈ దళిత సంఘాల నాయకత్వాలు - మౌనంగా వుండే →

# విదేశీ ఆధిపత్యంలో పరిశోధనా రంగం

**'పరిశోధనా** ఆవిష్కరణలకొరకు విశ్వవిద్యాలయాల బిల్లు-2012'ను కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టింది. ఉన్నత విద్యారంగంలో విదేశీ పెట్టుబడుల ప్రవేశానికి దొడ్డిదారి అని బిల్లు తీరు తెన్నులను గత సంచికలో పరిశీలించాము. దీని వల్ల "భవిష్య విశ్వ విజ్ఞాన ఆర్థిక వ్యవస్థలో భారత్ నాయకత్వపాత్ర వహిస్తుంద"ని ప్రభుత్వం చెప్పింది. ఈ సందర్భంగా దేశంలోని పరిశోధనా రంగంలో పరిణామాలనూ వాటిలో బహుళజాతి కంపెనీల పాత్రనూ విశ్లేషిస్తున్నాము.

భారతదేశంలో పరిశోధనా రంగంలో పెట్టుబడులు మూడు రూపాల్లో వున్నాయి : 1. ప్రభుత్వ పరిశోధనాశాలలు; 2.ప్రైవేటు కంపెనీల పరిశోధనా శాలలు; 3. విశ్వవిద్యాలయాలు. ఈ రంగంలో విదేశీ పెట్టుబడుల పాత్రపై ప్రభుత్వం ఒక విధానాన్ని ఇంతవరకూ ప్రకటించలేదు. అయితే ఈ రంగంలో విదేశీ పెట్టుబడులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహకాలనూ, వివిధ రాయితీలనూ అందిస్తున్నాయి. ఈరంగంలో నూటికినూరు శాతం విదేశీ పెట్టుబడులను అనుమతించారు. 150 నుండి 200 శాతం ఖర్చును పన్ను మదింపు తగ్గింపుకు అనుమతించారు. వీటి ఆదాయంపై పన్ను వసూలను మినహాయించారు. ఫలితంగా, 1991 తర్వాత పరిశోధనా రంగంలో విదేశీ పెట్టుబడులు పెరుగుతూవస్తున్నాయి (చూడండి పట్టిక : 1) 1991 నుండి 2007 మధ్య ప్రభుత్వ పెట్టుబడి 86 శాతం నుండి 68 శాతానికి తగ్గిపోయింది. కాగా ప్రైవేటు కంపెనీల పెట్టుబడి 13 శాతం నుండి 28 శాతానికి పెరిగింది. కాగా విశ్వ విద్యాలయాల్లో 4 శాతంగా వుండిపోయింది.

**పట్టిక:1 పరిశోధనా రంగంలో పెట్టుబడులు (శాతాలలో)**

| సంవత్సరం | ప్రభుత్వం | ప్రైవేటుకంపెనీలు | విశ్వవిద్యాలయాలు |
|---|---|---|---|
| 1991 | 86.16 | 13.84 | - |
| 1996 | 78.26 | 21.74 | - |
| 2000 | 77.21 | 18.46 | 4.33 |
| 2007 | 67.91 | 27.71 | 4.38 |

**ఆధారం: కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ నివేదిక.**

ప్రైవేటు కంపెనీలు పరిశోధనకు చేస్తున్న ఖర్చు, పెరగటం ప్రధానంగా విదేశీ కంపెనీల వల్లే జరిగింది. నూతన ఆర్థిక విధానాలకు ముందు భారత్ కంపెనీలు ఆదాయాన్ని తగ్గించి, ఖర్చులు పెరిగినట్లు చూపటానికి మాత్రమే పరిశోధనా విభాగాలను పెట్టేవన్న విమర్శను ప్రణాళికా సంఘమే గుర్తించింది. వీటిలో చెప్పకోదగ్గ పరిశోధనలు లేవనీ చెప్పింది. నూతన ఆర్థిక విధానాల తర్వాత బహుళ జాతి కంపెనీలు ప్రవేశించటంతో పెట్టుబడులు పెరిగాయి. పరిశోధనా రంగంలో బహుళజాతి కంపెనీల పెట్టుబడులు 1991కి ముందు దాదాపు లేవనే చెప్పాలి. కాగా, 2006-07లో అవి 4.3 కోట్లడాలర్లకు చేరి 2008-09నాటికి 24.8 కోట్ల డాలర్లకు చేరాయి. 2006నుండి 2011మధ్య వీటి పెట్టుబడి 60కోట్ల డాలర్లకు చేరింది. (చూడండి పట్టిక : 2)

**పట్టిక:2 పరిశోధనా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి**

| సంవత్సరం | కోట్లడాలర్లు |
|---|---|
| 2006-07 | 4.3 |
| 2007-08 | 15.6 |
| 2008-09 | 24.3 |
| 2009-10 | 9.1 |
| 2010-11 | 5.6 |

**ఆధారం: రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా**

అదే సమయంలో బహుళజాతి కంపెనీలు భారత్‌లో పెట్టిన పరిశోధనాశాలల్లో దాదాపు 28వేల మంది శాస్త్రజ్ఞులను నియమించుకున్నాయి. వీటి నిర్వహణకు అవి 2002-03 ఏడాదిలో 286కోట్ల రూ॥లు ఖర్చు చేయగా, అవి 2009-10నాటికి పదిరెట్లు పెరిగి రూ॥2883 కోట్లు ఖర్చు పెట్టాయి. ఈ 8 ఏళ్ల కాలంలో వాటి ఖర్చు రూ॥ 9857వేల కోట్లు (చూడండి పట్టిక :3) ఇది పరిశోధనా రంగంలో దేశంలో జరుగుతున్న వ్యయంలో 20శాతం, అంటే దాదాపుగా ప్రైవేటుకంపెనీల పెట్టుబడితో సమానంగా వుంది. కనుక ప్రైవేటుకంపెనీల పెట్టుబడి అంటే విదేశీ కంపెనీల పెట్టుబడే.

పరిశోధనా రంగంలో పెట్టుబడుల మదుపు పెరిగినందువలన శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుందన్న ప్రభుత్వ ప్రచారం కూడా పొరపాటే. భారత ప్రభుత్వం ప్రోత్సాహంతో రాయితీలతో, భారత శాస్త్రజ్ఞుల ద్వారా సాగించిన పరిశోధనా ఫలితాలను ఈ విదేశీకంపెనీలు తమ స్వంత దేశంలో పేటెంటు చేసుకొంటున్నాయి. (చూడండి పట్టిక : 4) విదేశీ కంపెనీలలో ప్రథమస్థానంలో వున్న 10 కంపెనీలనే ఈ పట్టికలో యిచ్చాము. ఇవన్నీ అమెరికాకు చెందిన బహుళజాతి కంపెనీలు. ఇవి భారత్‌లో పరిశోధనా ఫలితాలను అమెరికాలో పేటెంటు చేసుకున్నాయి. అంటే మన డబ్బుతో మన శాస్త్రజ్ఞుల కృషితో కనుగొన్న పరిజ్ఞానం అమెరికా ఆస్థి అయింది. దానికి రాయల్టీ చెల్లించి మళ్ళీ మనమే కొనుక్కోవాలి.

ఇక ఈ పరిశోధనా రంగంలోకి వచ్చిన విదేశీ కంపెనీలలో అత్యధిక భాగం అమెరికా బహుళ జాతి కంపెనీలకు చెందినవే. అవి అమెరికా కంపెనీ శాఖలుగానో, అనుబంధ కంపెనీలు గానో ఉన్నాయి. భారతీయ పెట్టుబడి దారులకు వాటాయివ్వవు. తమ దేశంలోనే పేటెంటు చేసుకుంటున్నాయి గనుక వీటి అమ్మకాలలో భారత్‌కు వచ్చే ఆదాయం దాదాపు లేదు. రిజర్వుబ్యాంకు లెక్కలను వివరంగా పరిశీలిస్తే ఈ కంపెనీలు చెప్పుకున్న ఆదాయంలో 10శాతం కూడా బ్యాలన్స్ ఆఫ్ పేమెంట్సులో లేదు.

**పట్టిక:3 పరిశోధనారంగంలో భారత్‌లోని విదేశీ కంపెనీల వ్యయం**

| సంవత్సరం | కోట్లరూ॥లలో |
|---|---|
| 2002-03 | 286 |
| 2003-04 | 310 |
| 2004-05 | 357 |
| 2005-06 | 529 |
| 2006-07 | 668 |
| 2007-08 | 2223 |
| 2008-09 | 2601 |
| 2009-10 | 2883 |

**ఆధారం : ఆర్‌బిఐ**

ఈ రంగాన్ని అధ్యయనం చేసిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజిమెంటుకు చెందిన రాకేష్ బసంత్, సునీల్ మణిలు (ఐఐయం, అహమ్మదుబాద్, వర్కింగ్ పేపర్ సంఖ్య 2012-01-06 తేదీ జనవరి 2012) ఇలా అభిప్రాయపడ్డారు: "పరిశోధనా రంగంలోని బహుళ జాతి కంపెనీలు భారత ఉత్పత్తి, స్థానిక అవసరాలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అనువర్తింప చేయటంలేదు. ప్రపంచ మార్కెట్టు కోసం కొత్తసాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేస్తున్నాయి. నిపుణత కలిగిన శాస్త్రజ్ఞులు భారత్‌లో చౌకగా లభ్యమౌతున్నందునే అవి ఇక్కడకు వస్తున్నాయి. కనుక అవి పరిశోధనల్లో శ్రమ అధికంగా వుండే విభాగాలనే ఇక్కడ నెలకొల్పుతున్నాయి. ఆ విధంగా అవి, తమ విజ్ఞానాన్ని పెంచుకుంటున్నాయి. ఇక్కడ తక్షణమే దోపిడీకోసం విజ్ఞానాన్ని పెంచుకోవటం లేదు. తత్పర్యవసానంగా తిరగబడిన ఆవిష్కరణలు (రివర్సు ఇన్నొవేషన్స్- అంటే భారత్‌లో కార్యకలాపాలతో కనుగొని, ఫలితాన్ని అమెరికాకు ఎగుమతి చేసి అక్కడ పేటెంటు హక్కు పొంది, తిరిగి భారత్‌తో సహా అభివృద్ధి చెందుతున్న దేశాలకు అమ్మటం) పెరుగుతున్నాయి. దీనికి ఉదాహరణ వైద్య పరికరాలు, ఔషధాలు. విదేశీ పరిశోధనాశాలలు. దేశంలోని పరిశోధనాశాలలతోగానీ, ఇక్కడి ప్రైవేటు సంస్థలతోగానీ, దాదాపు సంబంధాలు పెట్టుకోవటం లేదు. బహుళజాతి కంపెనీలకోసమే పనిచేస్తున్నాయి. కనుక వీటి పరిశోధనా ఫలితాలు భారత ఆర్థిక వ్యవస్థకు లబ్ధిచేకూర్చటమన్నదే లేదు అని చెప్పలేము గానీ అది అత్యంత పరిమితమే. ఈ రంగంలో విదేశీ పెట్టుబడులపై ప్రభుత్వానికి ఒక ప్రకటిత విధానం లేకపోవటమే దీనికి కారణం".

**పట్టిక:4 భారత్‌లో వుండి అమెరికాలో పేటెంట్లు 2006-10 మధ్య**

| కంపెనీ | పేటెంట్ల సంఖ్య |
|---|---|
| ఐబియం | 250 |
| టెక్సాస్‌ఇన్‌వెస్టు మెంట్స్ | 211 |
| జనరల్ ఎలక్ట్రికల్స్ | 193 |
| మైక్రో ఎలక్ట్రానిక్స్ | 135 |
| హనీవెల్ ఇంటర్నేషనల్ | 93 |
| సిస్కోటెక్నాలజీ | 91 |
| సిమాంటిక్ కార్పొరేషన్ | 91 |
| బ్రాడ్‌కాం కార్పొరేషన్ | 60 |
| హ్యులెట్ అండ్ పాకార్డు | 59 |

**ఆధారం : అమెరికా పేటెంటు ఆఫీసు.**

ఈ అధ్యయన కర్తలు చెప్పిన అంశాలు స్పష్టంగానే ఉన్నాయి. భారత ప్రభుత్వ ప్రోత్సాహంలో భారత శాస్త్రజ్ఞుల కృషితో తక్కువ ఖర్చుతో కనుగొన్న విజ్ఞానం భారత పరిశ్రమల, ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి దోహదపడటం లేదు. పైగా దానినే అధిక రాయల్టీకి కొనుగోలు చేస్తూ, సాంకేతిక పరిజ్ఞానం కోసం భారత పారిశ్రామిక రంగం సామ్రాజ్యవాదంపై పరాధీనమై వుంటున్నది. ఈ పరిశోధనలలో పెంచుకున్న విజ్ఞానాన్ని ప్రపంచదేశాలపై ఆధిపత్యం పొంది, దోపిడీ సాగించేందుకు అవి వినియోగిస్తున్నాయి.

విశ్వవిద్యాలయాల బిల్లు - 2012 ద్వారా విశ్వవిద్యాలయాల్లోని పరిశోధనా సౌకర్యాలను కూడా సామ్రాజ్యవాద పెట్టుబడి పరం చేయబూనుకున్నది. ప్రభుత్వ రంగ పరిశోధనాశాలలు కనుగొన్న అనేక విజ్ఞాన అంశాలను ప్రజల అవసరాలను అందుబాటులోకి తేచ్చేందుకు పూనుకోక పోగా వాటిని మరింత బలహీన పరుస్తున్నది. వ్యవసాయ విశ్వవిద్యాలయాలు కనుగొన్న ఆవిష్కరణలను యంత్రాంగానికి అందుబాటులోకి తెచ్చే విస్తరణ సేవలను ప్రైవేటీకరించటమే దీనికుదాహరణ.

భారతదేశ ప్రజల ప్రయోజనాలు పట్టించుకోకుండా సామ్రాజ్యవాదుల దోపిడీ, ఆధిపత్యాలను పెంచే చర్యలలో నిమగ్నమైన భారత పాలక వర్గాలు తీసుకుంటున్న చర్యను తీవ్రంగా వ్యతిరేకించాలి. ✡

---

→వైఖరి తీసుకోవటానికి, అవమానానికి గురైన దళిత కార్మికుని ఆత్మాభిమానాన్ని ఎలుగెత్తి చాటే విధంగా ప్రతిస్పందించలేకపోవటానికి గల కారణాలను పునరాలోచించుకోవాలి. మానేసర్ ప్లాంటులో అవమానానికి గురైన దళిత కార్మికుడి ఆత్మాభిమానాన్ని ఎత్తిపట్టి, అతనికి జరిగిన అవమానానికి ప్రతిగా చేపట్టే ఏ నిరసనైనా, దళితుల ఉద్యోగావకాశాలకు అవరోధంగా నిలుస్తుందనుకున్నారో? లేక, బడాపెట్టుబడిదారీ వర్గానికో, విదేశీ పెట్టుబడికో వ్యతిరేకంగా తీసుకునే వైఖరి, కమ్యూనిస్టు రాజకీయాలను చేపట్టటంతో సమానమైనదిగా భావించి మిన్నకున్నారో? అనేది వారు వివరించాల్సిన విషయం.

## దోపిడీవర్గ దాడులనుండి కార్మికవర్గం రక్షించుకో గలుగుతుందనే ఆశారేఖ

ఇంతటి నిరాశామయ వాతావరణంలో కూడా- ఇతర పరిశ్రమల కార్మికులు వ్యక్తం చేసిన సంఘీభావ కార్యక్రమాలతో, కార్మికవర్గ రాజకీయ నాయకత్వ ఆదేశానుసారం కార్మికులు, కార్మికవర్గం ఈ కుటిల పూరిత దోపిడీవర్గ దాడుల నుండి తమను తాము రక్షించుకోగలుగుతారనే ఓ ఆశారేఖ కన్పడుతోంది.

జులై 21న, ఢిల్లీలో ఎఐఎఫ్‌టియు(న్యూ)తో సహా వివిధ ప్రజాసంఘాలు-హర్యానా రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగిస్తున్న క్రూర నిర్బంధ చర్యలను ఖండిస్తూ, మానేసర్ ప్లాంటు ఘటనపై నిష్పక్షపాతంగా, నిజాయితీతో కూడిన దర్యాప్తు సాగించి, వాస్తవాలను వెల్లడించాలని డిమాండు చేస్తూ హర్యానా భవన్ ఎదుట భారీ స్థాయిలో ప్రదర్శన-ధర్నాలను నిర్వహించాయి.

జులై 25న- హోండా ఫ్యాక్టరీ కార్మికులు, తమపై పోలీసులు క్రూరమైన దాడి జరిపి ఏడుసంవత్సరాలైన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ 8 వేల మందికిపైగా సమావేశమై- కార్మికుల సమావేశాలను అడ్డుకుంటామన్న 'మహాపంచాయిత్' బెదిరింపులను సైతం ధైర్యంగా ఎదిరించారు. మారుతీ సుజుకీ మానేసర్ ప్లాంటు కార్మికులపై దాడులను ఖండిస్తూ, హోండా కార్మికులు, తమ సంఘీభావాన్ని వ్యక్తం చేస్తూనే, మానేసర్ ప్లాంట్‌లో జులై 18న జరిగిన ఘటనపై నిష్పాక్షిక విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

మానేసర్ - గురుగావ్ పారిశ్రామిక ప్రాంతంలోని- హీరో మోటార్ కార్పోరేషన్, హోండా మోటార్ సైకిల్, సుజుకీ పవర్ ట్రెయిన్, రీకో ఆటో, ఎమ్.ఇ.ఎస్.ఎల్., మార్క్ ఎక్స్‌ట్రా, హైప్లెక్స్, ఎఫ్‌సిసి రీకో, ఓమెక్స్ ఆటో - తదితర 30 ఫ్యాక్టరీలకు చెందిన కార్మికులు, జులై 25న 'మజ్దూర్ ఏక్‌తా దివస్'ను పాటించి మారుతీ సుజుకీ మానేసర్ ప్లాంటు కార్మికులకు సంఘీభావంగా నిలిచారు. అమాయక కార్మికులను పోలీసు నిర్బంధం నుండి వెంటనే విడుదల చేయాలని; మానేసర్ ప్లాంటును తక్షణం తిరిగి తెరిచి, కార్మికులనందరినీ విధుల్లోకి తీసుకోవాలని ఈ కార్మికులంతా డిమాండ్ చేశారు. అదే విధంగా, చట్టవిరుద్ధంగా అరెస్టు చేసిన కార్మికులను వెంటనే విడుదల చేయాలని, చట్టవిరుద్ధంగా కార్మికులను అరెస్టు చేసిన సంబంధిత పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని, జులై 18న ప్రశాంతంగా ఆందోళన సాగిస్తున్న కార్మికులపైకి గూండాలను వుసిగొల్పిన మారుతీ సుజుకీ యాజమాన్యంపై చర్యతీసుకోవాలని వారు హర్యానా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తిరిగి ఆగస్టు 4న -గుర్‌గావ్‌కు చెందిన వివిధ ఫ్యాక్టరీల కార్మికులు సంయుక్తంగా ఒక సదస్సును నిర్వహించి, అమాయక కార్మికులపై తక్షణం పోలీసు వేధింపులు ఆపాలని; అరెస్ట్ చేసిన కార్మికులందరినీ విడుదల చేయాలనీ డిమాండ్ చేశారు. అలాగే మారుతీ సుజుకీ మానేసర్ ప్లాంటులో విధించిన చట్ట వ్యతిరేక లాకౌట్‌ను ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు.

మారుతీ సుజుకీ యాజమాన్యం మానేసర్ ప్లాంటును చట్టవిరుద్ధంగా, నిరవధికంగా లాకౌట్ ప్రకటించి మూసివేసి, అందులో పనిచేసే కార్మికులకు అప్పటివరకూ చెల్లించాల్సిన వేతన బకాయిలనుకూడా చెల్లించకుండా, కార్మికులపై ప్రతీకారం తీర్చుకుంటుందన్నది నిరాకరించ వీలులేని వాస్తవం. ఈ విధమైన అక్రమలాకౌట్లు, వేతన బకాయిలను చెల్లించక పోవటం వంటి సంఘటనలు మన దేశంలో పెరిగిపోతున్నాయి. లోక్‌సభ సమాచారం ప్రకారమే- 2011-12 ఆర్థిక సంవత్సరంలో 'ఇండియా ఇంక్' (భారతదేశంలో కార్పోరేటు సంస్థలు) కార్మికులకు 711 కోట్ల రూ॥ వేతనాలను బకాయిపడింది. ప్రస్తుతం పరిశ్రమలలో పనిచేస్తూన్న కార్మికుల వేతన బకాయిలూ కోర్టులలో తమ వేతన బకాయిల గురించి వ్యాజ్యం నడపని కార్మికుల వేతన బకాయిలూ ఈ మొత్తంలో కలపబడలేదు. ఇదీ, మనదేశంలో కార్మికుల దయనీయపరిస్థితి!

## కార్మిక-వర్గ శక్తుల ఈనాటి తక్షణ కర్తవ్యం

కార్మికులపైనా, కార్మికవర్గంపైనా అంతులేని, ప్రమాదకరమైన దాడులు సాగుతున్న, భీతిగొలిపే ఈ పరిస్థితికి పరిష్కారం మరియు సమాధానమేమంటే-

*ఎ) కార్మికులందరి నడుమ ధృడమైన ఐక్యత పెంపొందించబడాలి!*

*బి) కార్మికులు-తాము వర్గ రాజకీయాలను చేపట్టి, ఆచరించి, సంఘటితపడేందుకుగల తమ హక్కును ఎలుగెత్తి చాటటం; తమజీవన పరిస్థితుల మెరుగుదల వంటి తక్షణ డిమాండ్స్‌ను సాధించుకునే హక్కునే గాక పెట్టుబడిదారీ దోపిడీవ్యవస్థను సమూలంగా కూలద్రోసి, ఏ విధమైన అసమానతలకూ, వివక్షలకూ తావులేని సామ్యవాదవ్యవస్థను స్థాపించుకోవాలనే ఆకాంక్షను సాధ్యం చేసుకునే హక్కును ఎలుగెత్తిచాటాలి.*

*సి) కార్మికులకు, కార్మిక వర్గ రాజకీయాలను బోధించటంద్వారా, వారు వాటిని వంటబట్టించుకోవటం ద్వారా కార్మికవర్గ రాజకీయ నాయకత్వపు మార్గదర్శకత్వంలో- ఈ భూమండలంపై నుండి అన్ని విధాలైన దోపిడీ, పీడనలను పారద్రోలే ఉద్యమాలను, పోరాటాలను నిర్మించేందుకు, నిర్వహించేందుకు, 'కార్మికవర్గ అగ్రగామి పాత్రను' అందుకునే విధంగా వారిని సంసిద్ధులను చేయాలి!*

బడాపెట్టుబడిదారీ వర్గ కుటిల పూరిత దాడులను తిప్పికొట్టి, వాటిని అంతమొందించటాన్ని సాధ్యం చేయవలసిన బృహత్తరకర్తవ్యం, కార్మికవర్గ అవగాహనతో ముందుకు సాగే కార్మిక- వర్గశక్తులపై వుంది. అదే, ఈనాటి తక్షణ కర్తవ్యం. ✡

# సహజవాయువుపై ఆధిపత్యం చెలాయిస్తున్న సామ్రాజ్యవాదుల బహుళజాతి, బడా -కంపెనీలు

**మహారాష్ట్రలోని** రత్నగిరి విద్యుత్తు ప్లాంటుకు గ్యాస్‌ను సరఫరా చేసిన తర్వాతే మిగతా ప్లాంట్లకు సరఫరా చేయాలని కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల మంత్రిత్వశాఖ జూలై 31వ తేదీన ఆదేశాలు ఇవ్వటంతో మన రాష్ట్రంలో ఆందోళన ప్రారంభమైంది. ముందు మన రాష్ట్రంలోని విద్యుత్తు ప్లాంట్లకు గ్యాస్‌ను సరఫరా చేసిన తర్వాతే రత్నగిరి ప్లాంట్‌కు సరఫరా చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వానికి లేఖలు వ్రాస్తే, రాష్ట్రంలోని అఖిల పక్ష పార్టీలు గ్యాస్ అక్రమ తరలింపుపై ఆందోళనా కార్యక్రమం ప్రకటించాయి. చివరికి రత్నగిరి ప్లాంటుకు కెజి డి-6 నుండి గ్యాస్ తరలింపును ఆపివేయమని ప్రధానమంత్రి ఆదేశించటంతో ప్రస్తుతానికి రత్నగిరికి సరఫరా ఆగింది. 'తీగ లాగితే డొంకంతా కదిలిన'ట్లు రత్నగిరి ప్లాంట్‌కు గ్యాస్‌ను సరఫరా చేయమనటంతో కృష్ణా, గోదావరి బేసిన్‌లో అపారంగా లభిస్తున్న గ్యాస్ సంపద ఎలా వినియోగించాలన్న ప్రశ్న ముందుకు వచ్చింది.

మనకు సహజసిద్ధంగా అపారంగా లభిస్తున్న సహజ సంపదలుగా వున్న బొగ్గు, ఇనుము, బాక్సైట్ తదితర ఖనిజ వనరులతో పాటు భూగర్భంలో లభించే సహజవాయువును కూడా ప్రజాప్రయోజనాలకు ఉపయోగించాలి. ఈ విషయాన్ని రాజ్యాంగంలో కూడా స్పష్టంగా పేర్కొన్నారు. అయితే ఇందుకు విరుద్ధంగా మన పాలకులు-ప్రజాప్రయోజనాలకు బదులు సామ్రాజ్యవాదుల, బడా పెట్టుబడిదారీ వర్గాల ప్రయోజనాలకు సేవజేసే విధానాలు రూపొందిస్తున్నారు. 1990ల తర్వాత నూతన ఆర్థికవిధానాలను అమలుపరిచే పేరుతో ప్రైవేటీకరణ- సరళీకరణ-ప్రపంచీకరణ విధానాలను అన్ని రంగాల్లో అమలు పరిచే దానిలో భాగంగా భూగర్భంలో లభించే సహజవనరులను ప్రైవేటీకరించటం ప్రారంభించింది. అంతవరకు ఇంధన వాయువుని ప్రభుత్వరంగ సంస్థలైన ఒఎన్‌జిసి (ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్) ఉత్పత్తి చేస్తూవుండగా, మరో ప్రభుత్వరంగ సంస్థ అయిన గెయిల్ (గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా) రవాణా, సరఫరా బాధ్యతలు చూసేది. కేంద్ర ప్రభుత్వమే సహజవాయువును వినియోగించుకుని ఎరువుల తయారీ, విద్యుదుత్పత్తి, రవాణా తదితర రంగాలకు ప్రాధాన్యతా క్రమాన్ని నిర్ణయించి, గ్యాసును కేటాయించటంతోపాటు గ్యాసు ధరను కూడా నిర్ణయించేది. ప్రైవేటీకరణ విధానాలను అమలు పరిచే దానిలో భాగంగా ఏ రంగానికి ఎంత గ్యాసు ఇవ్వాలో అన్న ఒక్క అధికారాన్ని మాత్రమే వుంచుకొని పెట్రోలియం, గ్యాస్ నిక్షేపాల అన్వేషణ, వెలికితీత, రవాణా, అమ్మకం లాంటి కార్యకలాపాలన్నిటినీ పాలకులు ప్రైవేటీకరించారు. 1995లో దీనికి సంబంధించిన విధివిధానాలను ఆమోదించి 1997లో నూతన వెలికితీత, లైసెన్సింగ్ పాలసీ (నెల్ప్-న్యూ ఎక్సుప్లోరేషన్ అండ్ లైసెన్సింగ్ పాలసీ)ని ప్రవేశపెట్టారు. దీనితో ఈ రంగంలో ప్రైవేటీకరణ పేరుతో విదేశీ పెట్టుబడులకు గేట్లు బార్లా తెరిచారు. ఈ విధానంలో మరొక ముఖ్య అధికారాన్ని ప్రైవేట్ శక్తులకు కట్టబెట్టింది. అదేమిటంటే, తన వాటాగా వచ్చిన గ్యాస్ ధరను నిర్ణయించుకొనే అధికారాన్ని, ఎవరికి అమ్ముకోవాలనే హక్కులను వారికే ధారాదత్తం చేసింది. నెల్ప్ విధానాన్ని ఆసరాచేసుకొని రిలయన్స్ సంస్థ ఇంధన వాయువులో 78 శాతం వెలికి తీసే 'స్థాయి'కి పెరిగిపోయింది. కెజి డి-6 బావిలో గ్యాసు పడటంతో తాను పెట్టిన పెట్టుబడి ఖర్చు లాభాలతో తిరిగి వచ్చే విధంగా గ్యాసు ధర నిర్ణయించాలని రిలయన్సు కంపెనీ తప్పుడు లెక్కలతో వాదించగా ఒక్క యంయంబిటియు (మిలియన్ మెట్రిక్ బ్రిటీష్ థర్మల్ యూనిట్) ధరను 4.33 డాలర్లు పెంచాలని కోరితే, ఆనాడు ప్రణబ్ ముఖర్జీ ఛైర్మన్‌గా వున్న ఎనిమిది మంది మంత్రులతో కూడిన సాధికారిక మంత్రుల కమిటి రిలయన్స్ వాదనను అంగీకరించి 4.20 డాలర్లుగా నిర్ణయించిందంటే కేంద్రప్రభుత్వం ఎవరి చేతిలో కీలుబొమ్మగా వుందో తేలిగ్గా అర్థంచేసుకోవచ్చు. ప్రైవేటీకరణకు ముందు ఇంధన వాయువు యంయంబిటియు ధర 1.50 నుండి 2.00 డాలర్లకు మించిలేదు. గ్యాసు పైపులైను వేసి యూనిటు 3 డాలర్లకు భారత్‌కు సరఫరా చేస్తానని ఇరాన్ ఆనాడు ప్రతిపాదించింది. కాగా అమెరికా వత్తిడికి లొంగి భారత ప్రభుత్వం తిరస్కరించింది. అంతేగాక ఇంధన వాయువు వెలికితీత, అమ్మకాల్లో ఆధిపత్యంలోవున్న రిలయన్స్ సంస్థ తాజాగా, అనుకొన్న విధంగా గ్యాస్ ఉత్పత్తి జరగడం లేదనే పేరుతో తన పెట్టుబడి వ్యయానికి అనుగుణంగా ఒక యూనిటుకు 9డాలర్ల ధర నిర్ణయించాలని ఇప్పుడు మళ్లీ వాదిస్తోంది. ధరను పెంచి సొమ్ముచేసుకోవాలని చూస్తున్నది. మరోవైపు బ్రిటిష్ పెట్రోలియం కంపెనీ, రిలయన్స్‌లో ఎక్కువ వాటాలను కొనుగోలు చేసి గ్యాసును దిగుమతి చేసుకుంటే అయ్యే ధరకు సమానంగా యూనిటుకు 12డాలర్లుగా ధర నిర్ణయించాలని వాదిస్తున్నది. 3డాలర్లకు సరఫరా చేస్తానన్న ఇరాన్ ప్రతిపాదనను తిరస్కరించిన భారత ప్రభుత్వం అమెరికా కంపెనీల నుండి 9 డాలర్లకు దిగుమతి చేసుకుంటున్నది. ఈ భారమంతా ప్రజలపైనే పడుతుంది. ఈ రేటు పెట్టిన గ్యాసుతో విద్యుదుత్పత్తి చేస్తే యూనిటు 9 రూ॥లు అవుతుంది. దీనికి పంపిణీ, రవాణా ఛార్జీలు అదనం. దీనితో జరిగే యూరియా ఉత్పత్తి ధర 50శాతం పెరుగుతుంది. ఈ విధంగా ఇంధన వాయువును సామ్రాజ్యవాదుల, రిలయన్స్ లాంటి బహుళ జాతి, బడా కార్పొరేటు కంపెనీల ఆధిపత్యం కొనసాగినంతకాలం దేశ ప్రయోజనాలు కాపాడబడవు అని తేటతెల్లం అవుతున్నది.

మన రాజ్యాంగంలోని ఆర్టికల్ 297 ప్రకారం మనదేశ సరిహద్దుల మధ్యనున్న భూమి, సముద్ర గర్భంలో వుండే ఖనిజాలు కేంద్ర ప్రభుత్వానికే చెందుతాయి. అయితే ఈ ఆస్తిని దేశ ప్రయోజనాలను తీర్చే విధంగా, ప్రజలందరికీ సమానంగా లబ్ధి అందే విధంగా కేంద్రప్రభుత్వం వినియోగించాలి. ప్రైవేటీకరణ విధానాలను చేపట్టినందున ఈ విధానానికి మంగళం పాడారు. అలానే మన ప్రాంతంలో ఉత్పత్తి అయ్యే ప్రాఫిట్ గ్యాస్‌లో 50శాతం స్థానిక అవసరాలు తీర్చాలని 12వ ఆర్థిక సంఘం చేసిన సిఫార్సులను కూడా గంగలో కలిపారు. కావున మనకు కెజీ బేసిన్‌లో అపారంగ దొరుకుతున్న సహజవాయువు రిలయన్స్‌లాంటి ప్రైవేట్ రక్కసి కోరల్లో చిక్కుకొనిపోయింది. దాన్నుంచి మన సహజ వాయువును రక్షించుకోవటానికీ, ప్రజాప్రయోజనాలు ఈడేరటానికి కావలసిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలి.

మన్యం ప్రాంత భూములు, వనరులు ప్రైవేటు శక్తులకివ్వరాదన్న సుప్రింకోర్టు సమతా కేసులో ఇచ్చిన తీర్పును కాలరాచి, ప్రభుత్వమే బాక్సైటును వెలికి తీస్తుందంటూ విదేశీకంపెనీ జిందాల్‌కు కట్టబెట్టింది. బాక్సైటు నుండి అల్యూమినా తయారుచేసి, దాని నుండి వచ్చే పర్యావరణ, ప్రజాజీవన నష్టాలన్నీ మనపై మోపి, దానిని యూరపు తీసుకువెళ్లి, అక్కడ దాని నుండి అల్యూమినియం అతి తక్కువ ఖర్చుతో తయారుచేసి, అధిక ధరకు తిరిగి మనకే అమ్ముతారు. ఇనుప ఖనిజాన్ని గాలి జనార్ధనరెడ్డికి కట్టబెట్టి వేల కోట్ల రూపాయల అక్రమార్జనకు పాల్పడ్డాడంటూ ఇప్పుడు గగ్గోలు పెడుతున్న ప్రభుత్వం, తానే అక్కడ ఉక్కు మిల్లును పెట్టివుంటే, దాదాపు 30వేలమందికి ఉద్యోగాలు రావటంతో పాటు అనేక అనుబంధ పరిశ్రమలు ఏర్పడేవి. గాలి అక్రమార్జనలకు నాలుగురెట్ల లాభాలు ఆ ఉక్కు మిల్లుకు వచ్చి వుండేవి. కాగా దాదాపు 100గ్రామాలను నివాసయోగ్యం కాకుండా చేసి ప్రజలు నిర్వాసితులయ్యే స్థితి కలిగించింది. బొగ్గు గనుల ప్రైవేటీకరణ చేపట్టి గనులలో 60శాతాన్ని బడా బూర్జువాలకు కేటాయించింది. ఐదేళ్ల తర్వాత కూడా వీటిలో 75శాతం మంది అసలు గనుల తవ్వకాలే ప్రారంభించలేదని ప్రభుత్వమే ప్రకటించింది. మనకున్న బొగ్గు నిక్షేపాలను వినియోగించు కోకుండా చేసిన బడా బూర్జువావర్గాలు అధికధర పెట్టి ఆస్ట్రేలియా తదితర దేశాలనుండి దిగుమతి చేసుకొని ఆ భారాన్ని ప్రజలపై మోపుతున్నారు. పైపెచ్చు ప్రభుత్వసంస్థ కోల్ ఇండియా ఆఫ్రికాలో బొగ్గుగనులను లీజుకు తీసుకునే విధంగా దేశంలో బొగ్గుగనులు దానికి లేకుండా చేశారు. అంతర్జాతీయ మార్కెట్టు రేటుతో సంబంధం లేకుండా ఒప్పందంలో పేర్కొన్న రేటుకే ఇరాన్ చమురును సరఫరా చేస్తున్నది. మన చమురు దిగుమతుల్లో 40శాతం ఇరాన్ నుండే వస్తున్నది. అమెరికా ఒత్తిడికి లొంగి భారత ప్రభుత్వం ఇరాన్ నుండి చమురు దిగుమతులు తగ్గించివేసి అధిక ధరలకు సౌదీ అరేబియా (అంటే అమెరికా ఆయిలు కంపెనీల నుండి) కొంటున్నది.

దేశసహజ వనరులను దేశప్రయోజనాలూ, ప్రజా అవసరాలూ ఈడేర్చే విధంగా వినియోగించకుండా సామ్రాజ్య వాదులకూ, బడాబూర్జువాలకూ ఇబ్బడి ముబ్బడిగా లాభాలు చేకూర్చేవిధంగా భారత ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. సహజ వనరులను దుర్వినియోగ పర్చటంతోపాటుగా ప్రజలకు అందుబాటులో లేకుండా చేస్తున్నది. గ్యాసు కొరత ఏర్పడటానికి మూలకారణమిదే. కాగా, ఆ కొరతనే ఎలా పంచుకోవాలన్న దాని చుట్టూ వివాదాన్నిరేపి ప్రాంతీయ దురభిమానాలను రెచ్చగొడుతున్నారు.

ఇంధన వాయువు నిరాఘాటంగా సరఫరా అవుతుందన్న పేరుతో రాష్ట్రంలో 25ప్రైవేట్ విద్యుతు ప్లాంట్లకు అనుమతులిస్తే, ధరను పెంచుకోవటానికి రిలయన్స్ సంస్థ గ్యాసు కొరతను సృష్టించింది. ఫలితంగా విద్యుత్తు ప్లాంటులు పనిచేయకుండా నిలిచిపోవడానికి కారకులెవరు? ఇంధన వాయువును ప్రైవేట్ పరంచేసిన దుష్ఫలితం కాదా! అధిక వర్షాలు, వరదలు ఫలితంగా వందల టియంసీల నీరు సముద్రంపాలు కావటం చూస్తున్నాము. సమగ్రనీటివనరుల రక్షణ విధానం చేపట్టితే అటు విద్యుత్తు కొరత లేకుండా, ఇటు సాగునీటి కొరత లేకుండా చేయవచ్చుకదా! అటువంటి ప్రజాప్రయోజనాలతో కూడిన సమగ్రవిధానం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేనందున గ్యాస్ కొరతను, విద్యుత్ కొరతను, సాగునీటి కొరతను రాష్ట్రం తీవ్రంగా ఎదుర్కొంటున్నది. కావున మన సహజ సంపదలను పరాయి వాళ్లకు కట్టబెడుతున్న పాలకులపై, వాటిపై పట్టుబిగిస్తున్న సామ్రాజ్యవాద, బహుళజాతి కంపెనీల దోపిడీ విధానాలపై సమరశంఖం పూరించడమే నేడు ప్రజలముందున్న కర్తవ్యం. ✡

# 'వాన్‌పిక్' వ్యతిరేక పోరాట స్ఫూర్తితో, 'వాన్‌పిక్' భూముల పునఃస్వాధీనానికై ముందుకు సాగుతున్న రైతులు

**వ్యవసాయ** పనులు ప్రారంభమయ్యే జూన్ నెల మొదటివారంలో రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ 'వాన్‌పిక్' కొరకు సేకరించిన భూమి దున్నుతూ ఏరువాకను ప్రారంభించటంతోపాటు 'వాన్‌పిక్' కోసం సేకరించిన భూములు తిరిగి రైతుల స్వాధీనమయ్యే వరకూ తాను ముందునిలుస్తానని ప్రకటించాడు. అదేక్రమంలో చినగంజాం, పెదగంజాం, అల్లూరు తదితర గ్రామాల్లోని రైతాంగం 'వాన్‌పిక్' కోసం ప్రభుత్వం లేదా దళారులు గుంజుకున్న భూముల్లో ఇనుపతీగలతో వేసిన సిమ్మెంటు పోల్స్‌ను పడగొట్టి, ట్రాక్టర్లతో దున్నటం ప్రారంభించారు. "ఇప్పటికే 'వాన్‌పిక్'కి భూములిచ్చి మోసపోయాం, ఇక మోసపోయే సమస్యలేదు, మా భూములన్నీ స్వాధీనం చేసుకొని వ్యవసాయం సాగిస్తామ"ని వాన్‌పిక్ బాధిత రైతాంగం ఘంటాపథంగా ప్రకటించారు. తాజా పరిణామాల నేపథ్యంలో 'వాన్‌పిక్'లో భూముల పునఃస్వాధీనంకోసం రైతులు ప్రారంభించిన పోరాటం, 'వాన్‌పిక్' రద్దుకోసం సాగించిన పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలి.

మరోవైపున 'వాన్‌పిక్'లో ముఖ్య భాగస్వామి అయిన రస్ ఆల్ ఖైమా ఇన్‌వెస్ట్‌మెంటు అథారిటీ (రకియా) కూడా రంగ ప్రవేశం చేసింది. తమ కంపెనీ 'వాన్‌పిక్' తప్పులేమీ చేయలేదనీ, దీనిలో నిమ్మగడ్డ ప్రసాద్ పెట్టుబడి తక్కువనీ, వ్యక్తిగా అతనేమైనా అక్రమాలు చేసివుంటే కంపెనీకి సంబంధంలేదనీ, ఇప్పటికే 845 కోట్లు ఖర్చు పెట్టామనీ, కనుక 'వాన్‌పిక్' పనులు సాగించేందుకు తోడ్పడాలనీ ప్రధానికి, రాష్ట్ర ప్రభుత్వానికీ విజ్ఞప్తి చేసింది. ఆ విధంగా భూములను వదులుకునేది లేదని తెలిపింది. ఈ నేపథ్యంలో సమస్య పూర్వాపరాలను పరిశీలిద్దాం.

## వాన్‌పిక్ ప్రారంభం

సరళీకరణ - ప్రైవేటీకరణ - ప్రపంచీకరణ విధానాలను పటిష్టంగా అమలుచేసే చర్యల్లో భాగంగా 2005లో కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం 'ప్రత్యేక ఆర్థిక మండళ్ళు' (సెజ్) చట్టాన్ని ఆమోదింపజేసుకొని, ఈ చట్టం అమలుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్న దానిలో భాగంగా మన రాష్ట్రంలో వైఎస్ ప్రభుత్వం మరింత ఉత్సాహంగా సెజ్‌ల ఏర్పాటును ప్రారంభించింది. రాష్ట్ర ప్రభుత్వం కన్ను ముందుగా తీర ప్రాంతంపై పడి దానికి కోస్టల్ కారిడార్‌గా నామకరణంచేసి, దీనిలో ఆయా ప్రాంతాల్లో పెట్టే పరిశ్రమలను బట్టి కెమికల్ కారిడార్, ఇండస్ట్రియల్ కారిడార్‌లతో పాటు 'వాన్‌పిక్'ను కూడా ప్రకటించింది.

నిజాంపట్నం, ఓడరేవు (గ్రామం)ల వద్ద రెండు రేవుల నిర్మాణం చేసి, దాని ద్వారా ఎగుమతి, దిగుమతులు చేసేందుకు మౌలిక సదుపాయాలు కల్పించే దానిలో భాగంగా పరిశ్రమలు ఏర్పాటు చేసే ప్రాజెక్టుకు 'ఓడరేవు నిజాంపట్నం పోర్టు ఇండస్ట్రియల్ కారిడార్' (వాన్‌పిక్)గా నామకరణం చేశారు. వాన్‌పిక్‌లోగల 26 కి.మీ. పొడవునా రు. 16,800 కోట్లతో రేవుల నిర్మాణం, పరిశ్రమలు, మోటుపల్లి వద్ద షిప్ బ్రేకింగ్ యూనిట్, 2100 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌లు, పెట్రోరసాయిన పరిశ్రమలు, కొత్తపట్నంవద్ద విమానాశ్రయం, టౌన్‌షిప్‌లు నిర్మిస్తామని, ఈ పరిశ్రమల ద్వారా 10 లక్షల ఉద్యోగాలు వస్తాయని ప్రకటించారు.

వాన్‌పిక్ లోని 26 కి.మీ. పరిధిలో ఓడ రేవులు, రోడ్ల నిర్మాణం జరిగితే భూముల ధరలు పెరుగుతాయి గనుక ముందుగానే ఆ భూములను తమస్వంతం చేసుకునే ప్రయత్నాలు సాగాయి. జిల్లా యంత్రాంగంతో భూ సేకరణ నోటీసులిప్పించి, వాటిని చూపి రైతాంగాన్ని భయపెట్టి స్థానిక మంత్రి, మరియు ఎమ్మెల్యేలు రైతాంగం నుండి బినామీగా భూములు స్వాధీనం చేసుకున్నారు. వాన్‌పిక్‌లోని 26 కి.మీ. పరిధిలో మొత్తం 28 వేల ఎకరాలను, ప్రకాశం జిల్లాలోని ఐదుమండలాల్లో 18 వేల ఎకరాలు, గుంటూరు జిల్లాలోని ఆరు మండలాల్లో 10 వేల ఎకరాలను భూ సేకరణ చట్టం ద్వారా స్వాధీనం చేసుకొంటామని రాష్ట్ర ప్రభుత్వం జీఓ నం. 34 ద్వారా ప్రకటించింది. 28 వేల ఎకరాల భూమిలో ఎక్కువ భాగం పట్టాభూములు కాగా మిగతావి పేదలకు ఇచ్చిన అసైన్డ్‌భూములు, అటవీ భూములు, ఉప్పుభూములు ఉన్నాయి. భూములతో పాటు రెండు జిల్లాలలోని 11 మండలాల్లో పేద వర్గాలు నివసించే వేలాది ఇళ్ళను కోల్పోవాల్సి వస్తుంది. భూములను స్వాధీనం చేసుకోవటానికి ప్రభుత్వం స్పెషల్ కలెక్టర్ల ద్వారా బుజ్జగింపులు, బెదిరింపు పద్ధతులను అనుసరించింది. అసైన్డ్, అటవీ భూముల విషయంలో అధికారులు బెదిరింపులకు దిగారు. సరిగ్గా ఈ పరిస్థితిని ఆసరా చేసుకొని వాన్‌పిక్‌లో భాగస్వామ్య సంస్థగావున్న, నిమ్మగడ్డ ప్రసాద్ భాగస్వామిగా వున్న మాట్రిక్స్ కంపెనీ పెద్దఎత్తున భూములు సేకరించడానికి వారి ఏజంట్లను రంగంలోకి దింపి, ఆ భూములను మాకు అమ్మితే ఎంతో కొంత రేటు వస్తుంది, ప్రభుత్వం తీసుకొంటే ఆ మాత్రం కూడా రాదని భయాందోళనలకు గురిచేసి కారుచౌకగా వేలాది ఎకరాల భూములను కాజేశారు. మరోవైపు ప్రభుత్వం కూడా భూ సేకరణ చట్టం క్రింద భూములు తీసుకోకతప్పదనీ, ఇవ్వకుంటే నిర్బంధం ప్రయోగించైనా తీసుకొంటామని ప్రచారం సాగించటంతో రైతాంగం భయంతో భూములు వదులుకునే స్థితి కల్పించారు. రైతాంగం తమ భవిష్యత్ జీవితాలను తలచుకొని తీవ్ర ఆందోళనకు గురవుతున్న స్థితిలో 2008 ఆగస్టు 30న రైతుకూలీసంఘం(ఆం.ప్ర.), సిపిఐ (ఎం-ఎల్) ప్రజాఫ్రంట్‌లు కలిసి ఏర్పాటు చేసిన 'కోస్టల్ కారిడార్ వ్యతిరేక కమిటీ' నాయకత్వాన చీరాలలో పెద్దఎత్తున నిర్వహించిన సదస్సు ఒక మంచి ప్రభావాన్ని పడవేయుటమే గాక "భూములను 'వాన్‌పిక్'కు ఇవ్వకూడదు" అన్న దృఢమైన నిర్ణయానికి రైతులు రావడానికి ఎంతగానో తోడ్పడింది.

## ఉధృతంగా సాగిన ఉద్యమం

'వాన్‌పిక్' ప్రాజెక్టు భూసేకరణ కోసం ప్రభుత్వం, అధికార పార్టీ రాజకీయ నాయకులు, ముఖ్యంగా - నిజాంపట్నం స్థానికుడైన, ఎమ్ఎల్ఏయొక్క, రెవిన్యూ అధికారుల, మాట్రిక్ సంస్థ ఏజంట్లయొక్క కుట్రపూరిత, మోసపు విధానాలను గమనించిన ప్రజలు, రైతాంగం భూములు ఇవ్వడానికి నిరాకరించారు. దీనితో 'వాన్‌పిక్' పరిధిలోని రెండు జిల్లాల గ్రామాల్లో 144 సెక్షను విధించి ప్రజల్లో భయానక పరిస్థితులు కల్పించినా, 144వ సెక్షన్ నిబంధనలను సైతం ధిక్కరించి 'ఈ కారిడార్ మా కొద్దు, మేం భూములను ఇవ్వం, గ్రామాలను ఖాళీ చేయం' అంటూ స్పెషల్ కలెక్టర్‌ను నిలేసి 'మా ప్రాణాలు పోయినా మా భూములను మేం వదలం' అంటూ తెగేసి చెప్పటంతో అధికారులు తిరుగుముఖం పట్టక తప్పలేదు. గుంటూరు జిల్లాలోని వాన్‌పిక్ గ్రామాల్లోకి వచ్చిన స్పెషల్ కలెక్టర్‌ను, సిబ్బందిని ప్రజలు ఘెరావ్‌చేసి, "కలెక్టర్ గోబ్యాక్, వాన్‌పిక్ గోబ్యాక్" అంటూ గట్టిగా నినాదాలివ్వటంతో →

## భూమికోసం... (చివరి పేజీ నుండి)

మనరాష్ట్రంలో ఎన్నో అనుభవాలున్నాయన్నారు. సమాజంలో మౌలికమైన మార్పు కోసం పనిచేసే సంస్థలు ఉమ్మడిగా పనిచేయాల్సిన అవసరం ఏర్పడిందని, భూమికోసం, ఆత్మగౌరవం కోసం పోరాడుతున్న దళితులను, ఆదివాసీలను, పీడిత ప్రజలను సంఘటిత పర్చాల్సిన అవసరం వుందని కా॥ సునీత పిలుపునిచ్చారు.

కులనిర్మూలనా పోరాటసమితి రాష్ట్ర అధ్యక్షులు కా॥ దుడ్డు ప్రభాకర్ మాట్లాడుతూ లక్షింపేటలో కేవలం భూమికోసం మాత్రమే సాగించిన పోరాటం కాదని, ఆత్మగౌరవం కోసం సాగించిన పోరాటమని, లక్షింపేట ప్రాంత ఎస్ఐ, సిఐ, ఎఎస్పి, మంత్రి కోండ్రు మురళి అందరూ మాలలైనప్పటికీ లక్షింపేట మాలల్ని కాపాడలేక పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ రిజర్వేషన్ల ద్వారా లబ్ధి పొందిన దళితులలోని వర్గం ఒకటి పాలకవర్గాలకి దళారులుగా మారారని, దళితుల పేరు చెప్పుకుని వీరంతా చెలామణీ అవుతున్నారని, ఈ వేదికపైన వున్న మాలాంటి సంస్థలు కొన్ని దళితులకోసం, సామాజిక మార్పుకోసం పనిచేస్తున్నాయని అన్నారు. వృత్తులు కోల్పోతున్న మాలలు కర్రులతోటి, మాదిగలు ఆరె, గూటంతోటి తిరగబడాలని, ఏజెన్సీలో ఆదివాసులు కూడా తమ సాంప్రదాయక ఆయుధాల తోటి, విల్లంబులతోటి పోరాడుతున్నారని అన్నారు.

ఏపిసిఎల్‌సి రాష్ట్ర నాయకులు కా॥ చిలకా చంద్రశేఖర్ మాట్లాడుతూ లక్షింపేట దళితులపై జరిగిన దాడిని సుప్రింకోర్టు వరకూ తీసుకెళ్ళి దోషులకు శిక్షలు పడేటట్లు చేయాలన్నారు. ముంపుకు గురికాని 250 ఎకరాల భూమి దళితులకే చెందాలన్నారు.

దళిత స్త్రీ శక్తి రాష్ట్ర నాయకులు గెడ్డం ఝాన్సీ, తమిళనాడు నుండి వచ్చిన విడుదలై చిరుత్తగళ్ కచ్చి (విసికె) రాష్ట్ర కార్యదర్శి బాలవర్ధన్ నిలవన్, విసికె నాయకులు బాలసింగం, కర్ణాటక నుండి వచ్చిన ఆర్‌పిఐ రాష్ట్రఅధ్యక్షులు ఫరూక్, కేరళనుండి వచ్చిన ఆర్‌పిఐ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పిరవంతూర్ శ్రీచరణ్, ఢిల్లీ నుండి వచ్చిన జాతీయ దళిత మానవ హక్కుల ప్రచార ఉద్యమం కన్వీనర్ పాల్ దివాకర్, గిరిజన ఐక్య వేదిక నుండి డా॥ జి.ఎస్. కృష్ణ తదితరులు ప్రసంగించారు. సభకు రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. అంజయ్య అధ్యక్షత వహించారు. సభకు లక్షింపేట మృతుల కుటుంబాలనుండి సంగమేసు భార్య రాములమ్మ, బోరాడ సుందరరావు భార్య కాసాలు, బి.


తిరుపతి సదస్సుకి హాజరైన ప్రజానీకం


విజయవాడ సదస్సుకి హాజరైన ప్రజానీకం

పాపయ్య భార్య అప్పలనర్సమ్మ, నివర్తి వెంకటిభార్య నాణమ్మ, అప్పయ్య అన్న అంగయ్య తదితరులు వచ్చి సభలో మాట్లాడారు.

### విశాఖపట్నం, 28-7-12 :

'లక్షింపేట దళిత పోరాట సంఘీభావ కమిటి' ఆధ్వర్యంలో జులై 28వ తేదీన 'చలో విశాఖ' కార్యక్రమంలో భాగంగా స్థానిక అంబేద్కర్ భవన్‌లో సదస్సు జరిగింది. ఈ సదస్సుకు దళిత సంఘాల ప్రతినిధులు యస్.వెంకటరమణ, వెంకట్రావులు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ఈ సదస్సులో 'లక్షింపేట దళిత పోరాట సంఘీభావ పోరాట కమిటి' కన్వీనర్ కా॥బొజ్జా తారకంతోపాటు, దుడ్డు ప్రభాకర్(కుల నిర్మూలనా పోరాట సమితి), చలసాని ప్రసాద్(విరసం), గెడ్డం ఝాన్సి (దళిత స్త్రీ శక్తి), పోలా ఈశ్వరరావు (సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ) మరియు వివిధ దళిత, ప్రజాసంఘాల నాయకులు లక్షింపేట దళితులకు సంఘీభావంగా ప్రసంగించారు.

ఈ సదస్సులో రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షులు కా॥యన్. ఝాన్సి ప్రసంగిస్తూ శ్రీకాకుళంజిల్లా పాలకొండ మొదలుకొని అనేక 'లక్షింపేట' లు జరిగేందుకు అవకాశమున్న రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలోనూ రెండు గ్లాసుల విధానం, వివక్ష అంటరానితనం వెట్టిచాకిరీ వివిధ రూపాల్లో కొనసాగుతున్నాయని, వీటికి వ్యతిరేకంగా ఐక్యపోరాటాలకు సిద్ధంకావాలన్నారు.

'జనశక్తి' పత్రిక సంపాదకులు డా॥ పి. జస్వంతరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ఆధిపత్య కుల దురహంకారశక్తులనుండి విడగొట్టి, కుల ద్వేషాలకు గురికాకుండా శ్రమజీవులైన పేదలంతా, దళిత శక్తులతో కలిసి దీర్ఘకాల ఐక్య ఉద్యమాలకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు.

### విజయవాడ, 6-8-12:

చుండూరు మారణకాండ జరిగిన రోజు(1991 ఆగస్టు 6)ను గుర్తుచేస్తూ 'చుండూరు దళిత మృతవీరుల వేదిక'పై విజయవాడలోని రైల్వే కళ్యాణమండపంలో, 'లక్షింపేట దళిత పోరాట సంఘీభావ కమిటి' నాయకత్వంలో 'ఛలో విజయవాడ' 'సదస్సు' జరిగింది.

ఈ సదస్సుకు కులనిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కా॥దుడ్డు ప్రభాకర్ అధ్యక్షత వహించగా వివిధ దళిత ప్రజాసంఘాల నాయకులు లక్షింపేట నరమేధాన్ని నిరసిస్తూ ప్రసంగించారు.

లక్షింపేట పోరాట కమిటి కన్వీనర్ కా॥ బొజ్జా తారకం ప్రసంగిస్తూ ప్రజాస్వామ్యబద్ధంగా బాధితులైన లక్షింపేట దళితులంతా వివిధ రూపాల్లో తమ సమస్యలను పరిష్కరించాలని, ముఖ్యంగా 250 ఎకరాల ప్రభుత్వ మిగులు భూములను దళితులకు కేటాయించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని, లక్షింపేటలో ప్రత్యేక కోర్టు ఏర్పరచి సత్వర న్యాయం చేయాలని డిమాండ్‌చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వున్నదనీ, రాజ్యాంగబద్ధంగావున్న అన్ని అవకాశాలను మూసివేసిన ఈ పరిస్థితుల్లో మరో గత్యంతరం లేక దళితులు ఆయుధాలు అందుకుంటే అందుకు బాధ్యులెవరని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. బీహార్ రాష్ట్రంలో అగ్రకుల భూస్వాముల భౌతికదాడులు, హత్యాకాండనుండి దళితులు ఆత్మరక్షణ చేసుకునేందుకు ఆనాటి ప్రభుత్వాలు ఆయుధాలందించాయని, తర్వాత బీహార్‌లో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఆ ఆయుధాలను వాసను తీసుకున్నదని చెపుతూ, ప్రభుత్వం ఇప్పటికైనా కోనేరు రంగారావు సిఫార్సుల మేరకు దళితులకు భూములు కేటాయించాలని డిమాండ్ చేశారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షులు కా॥యన్. ఝాన్సి మాట్లాడుతూ దళితులపై దేశవ్యాపితంగా దాడులు కొనసాగుతున్నాయని, లక్షింపేటలో దళితులపై దాడులకు వ్యతిరేకంగా పోరాడుతున్న సందర్భంలోనే రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో నిత్యకృత్యమైన దళితులపై దాడులను సమైక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ముస్లింమైనారిటీలపై 'గోద్రా' సంఘటన సాకుగా గుజరాత్‌లో మారణకాండ జరిగిందనీ, ఒరిస్సాలో క్రిస్టియన్ మైనారిటీలపై 'కాంధమాల్'లో గృహదహనాలు, 'గ్రహమ్‌స్టెయిన్స్' సజీవ దహనం, హత్యాకాండ సాగాయని, పీడితుల్లో అధమాధములుగా నున్న ఆదివాసీలపైనా, మహిళలపైనా, సమాజంలో వివిధ బలహీనవర్గాలపైనా ఆధిపత్య అగ్రకుల హిందూమతోన్మాద ఫాశిస్టు శక్తుల క్రూరమైన దాడులను ఎదుర్కోవటానికి దళితులు, పీడితులంతా ఐక్య ఉద్యమాలు నిర్మించాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు.

ఈ సదస్సులో ఇంకా, కా॥ఎం.లక్ష్మి(స్త్రీవిముక్తి సంఘటన), గెడ్డం ఝాన్సి (దళిత స్త్రీ శక్తి), కళ్యాణరావు(విరసం), మోజెస్(చుండూరు దళిత పోరాట కమిటి), ఉ.సా.(బి.సి. మహాజన సమితి) తదితరులు పాల్గొని ప్రసంగించారు. ✡

---

→ అధికారులు వెనుదిరగక తప్పలేదు. ఇదే సమయంలో నిజాంపట్నంలో- రైతుకూలీసంఘం, ఇతర ప్రజాసంఘాలు కలిసి 23 రోజులపాటు నిరవధిక రిలే నిరాహారదీక్షలు జరిపి కలెక్టరుతో చర్చలు జరిపి, 'వాన్‌పిక్'ను రద్దు చేయాలని కోరాయి.

ఈ ఆందోళనల క్రమంలో ఏర్పడిన 'వాన్‌పిక్ వ్యతిరేక అఖిలపక్ష కార్యాచరణ కమిటీ' 'వాన్‌పిక్' ప్రాజెక్టులోని గ్రామాల్లో గుంటూరు జిల్లాలో సెప్టెంబరు 26,27 తేదీల్లో; ప్రకాశం జిల్లాలో అక్టోబర్ 5,6 తేదీల్లో పాదయాత్రలు, బహిరంగ సభలు విస్తృతంగా నిర్వహించింది. కొత్త ఎత్తుగడలతో ప్రజల్ని బుజ్జగించి ప్రలోభపెట్టడానికి స్పెషల్ కలెక్టర్‌కు బదులు, నేరుగా జిల్లా కలెక్టర్ దిండి గ్రామానికి వచ్చి చేసిన ప్రయత్నాన్ని కూడా ప్రజలు త్రిప్పికొట్టారు. అయినా ప్రభుత్వం నుంచి సానుకూలంగా స్పందన రాకపోవటంతో అక్టోబర్ 15వ తేదీన చీరాలలోని వాన్‌పిక్ కార్యాలయాన్ని ముట్టడించారు. వాన్‌పిక్ కార్యాలయానికి చేరుకోకముందే కొందరు నాయకులను అరెస్టు చేశారు. కార్యాలయం వద్దకు చేరుకున్న ఆందోళనకారులపై పోలీసులు తీవ్రంగా లాఠీఛార్జీ చేసి అరెస్టులు చేశారు. ఈ నిర్బంధాన్ని ఖండిస్తూ రెండు జిల్లాల్లో వివిధ ప్రజాసంఘాల నాయకత్వాన విస్తృతంగా నిరసన కార్యక్రమాలు జరిగాయి.

కోస్టల్ కారిడార్ నిర్మాణాన్ని నిలిపివేయాలని ఆందోళన చేస్తున్న ప్రజా కమిటీలు, 'వాన్‌పిక్' బాధితుల ఘోషను హైదరాబాద్ నగరంలో వినిపించటానికి నవంబర్ 3వ తేదీన సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సభను నిర్వహించాయి. ఈ సభలో అనేకమంది ప్రజాతంత్రవాదులు వీరి ఆందోళనకు మద్దతుగా మాట్లాడారు. ఈ సభానంతరం, కోస్టల్ కారిడార్‌లో భాగంగావున్న వాన్‌పిక్ ప్రాజెక్టును రద్దుచేయాలని రాష్ట్ర గవర్నర్‌కు మెమోరాండం సమర్పించారు.

నవంబరు 9న, చీరాలలో 'కోస్టల్ కారిడార్‌కు వ్యతిరేకంగా వివిధ రాజకీయ పార్టీల ఐక్య కార్యాచరణ కమిటీ' నాయకత్వాన నిరసన ప్రదర్శన, బహిరంగ సభలు జరిగాయి. భూములను నిలబెట్టుకోవటానికి పోరాటమే మార్గమని, వివిధ పార్టీల నాయకులు సందేశాలిచ్చారు.

### పోరాటంతో వెనక్కి తగ్గిన ప్రభుత్వం

కోస్టల్ కారిడార్‌లో జీఓ నం. 34ను అడ్డం పెట్టుకొని ప్రజాభిప్రాయసేకరణ పేరుతో అక్రమంగా రైతాంగభూములను లాగివేసుకొనే ప్రయత్నాలను అటు కాకినాడ-విశాఖ పెట్రోకెమికల్ కారిడార్ పరిధిలోని గ్రామాల ప్రజలు తీవ్రంగా ఎదుర్కొన్నారు. అలానే వాన్‌పిక్ ప్రాజెక్టు ప్రాంతంలో కూడా ప్రజల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురుకావడంతో వైయస్ ప్రభుత్వం 2008 ఫిబ్రవరిలో విడుదల చేసిన జిఓ నం. 34ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించక తప్పలేదు. అంతే కాకుండా కారిడార్ అంటే రహదారి నిర్మాణం మాత్రమేనని, దానికోసమే భూమి సేకరణ అనీ, కోస్తా రహదారి నిర్మాణంవల్ల తీరప్రాంతంలో రవాణా సౌకర్యాలు పెరుగుతాయని, ప్రభుత్వం కొత్త ప్రచారం లంకించుకొంది. అయితే జీఓ 34లో కేవలం ప్రాజెక్టుల నివేదికల తయారీ గురించి మాత్రమే ఉన్నందున, జీఓ 34 రద్దువలన బాధిత ప్రజలకు ఒరిగేది ఏమీలేదని, అయితే ఈ జీఓ రద్దు పేరుతో ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను తగ్గించేందుకే ప్రభుత్వం పూనుకొందని స్పష్టమైంది. అయితే 2008 జూలైలో జీఓ 31ని జారీ చేసి భూసేకరణకు అడ్డంకి లేకుండా చేసుకొంది. అయితే ఆ జీఓలో పరిశ్రమలకు అవసరమైన భూములను కంపెనీలే చేకూర్చుకోవాలంటూనే కలెక్టర్ల చేత భూసేకరణ నోటీసులిప్పించింది. చట్టవిరుద్ధంగా నిరంకుశాధికారాలతో అధికారగణాలను పంపించి భూమిని లాగివేసుకొనే చర్యలకు పాల్పడటంతో బాధిత ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెల్లుబికింది. జీఓ 34 రద్దు పేరుతో ప్రజల ఆగ్రహాన్ని తగ్గించాలని ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఫలించక పోవటంతో, ముఖ్యంగా వాన్‌పిక్ ప్రాంతంలో ప్రాజెక్టు పనులను ప్రారంభించలేక పోయింది. అయితే వాన్‌పిక్ ప్రాంతంలోని కొన్ని గ్రామాల భూముల్లో కంపెనీ ప్రతినిధులు ఇనుప తీగలతో సిమ్మెంట్ పోల్స్ పాతారు. దానితో అప్పటి నుంచి వేలాది ఎకరాల భూములు పడావుగాపడి వున్నాయి.

### 'వాన్‌పిక్' సూత్రధారుల అరెస్టులు

పాలకవర్గాల ముఠా కుమ్మలాటల్లో భాగంగా అనేక అవినీతి, కుంభకోణాలు వెలుగుజూస్తున్నాయి. జగన్ అక్రమాస్తుల కేసులో తీగలాగితే డొంకంతా కదిలినట్లు 'వాన్‌పిక్' ప్రాజెక్టులో సూత్రధారుడైన నిమ్మగడ్డ ప్రసాద్‌ను సిబిఐ మొదట అరెస్టు చేసి జైలుకి పంపింది. తర్వాత జగన్‌మోహన్‌రెడ్డిని అరెస్టు చేయటానికి ముందస్తుగా ప్రస్తుత ఎక్సైజ్ శాఖామంత్రి, గతంలో వాన్‌పిక్ ఒప్పందం నాటికి సంబంధిత నౌకానిర్మాణ శాఖా మంత్రిగావున్న మోపిదేవి వెంకటరమణను, 28వేల ఎకరాలను కట్టబెట్టే వాన్‌పిక్ ప్రాజెక్టుపై సంతకం చేశాడన్న అభియోగంపై సిబిఐ అరెస్టు చేసింది. 'వాన్‌పిక్' కోసం గత ప్రభుత్వం అక్రమంగా వేల ఎకరాల భూములను రైతులనుండి గుంజుకొని, బడాపారిశ్రామికవేత్తలకు కట్టబెట్టిందని ప్రభుత్వ సంస్థలే వెల్లడిచేయటంతో 'వాన్‌పిక్' బాధిత రైతాంగంలో కదలిక మొదలైంది. ఈ నేపథ్యంలోనే, తమ ఉపఎన్నికల అవసరాలకోసమూ; ఈ 'వాన్‌పిక్' భూముల పునఃపంపిణీకీ తామే నాయకత్వం వహించామనే పోజుపెట్టేందుకే డొక్కా మాణిక్యవరప్రసాద్ 'వాన్‌పిక్' భూముల్లోకి దిగాడు మినహా వేరుకాదు. 'వాన్‌పిక్' ప్రాజెక్టు విసిరిన పంజా నుండి తమ భూములను కాపాడుకోవటానికి వివిధ రూపాల్లో సంఘటితంగా సాగించిన పోరాటం అందించిన స్ఫూర్తితో నేడు వాన్‌పిక్ ప్రాజెక్టు కబ్జాచేసిన వేలాది ఎకరాల భూములను విడిపించుకొని తమ భూములను సాగుచేసుకోవటానికి రైతాంగం సమాయత్తం కావటం శుభ పరిణామం. ప్రకాశం జిల్లాలో వాన్‌పిక్ కోసం తీసుకొన్న భూములలో కంపెనీ యాజమాన్యం ముళ్ళకంచెలు, సిమ్మెంట్‌పోల్స్ పాతటంతో ఆ భూములు ఖాళీగా వుంటటంతో బాధిత రైతాంగం తాజా పరిణామాల నేపథ్యంలో ఇనుప తీగలను, సిమ్మెంట్ పోల్స్‌ను తొలగించి పొలాలు దున్నటం ప్రారంభించారు. కానీ గుంటూరు జిల్లా నిజాంపట్నం ప్రాంతంలో మంత్రి మోపిదేవి తన అనుయాయులచేత ఎక్కువ భాగం భూమిని కొనుగోలు చేసినందున, ప్రాజెక్టు రావటం డైలమాలో పడినందున భూములను ఖాళీగా వుంచకుండా రైతులు సాగుచేసుకొంటూ వున్నారు. అయితే భూములు తమ (మంత్రి) ఆధీనంలోనే ఉన్నాయని చెప్పుకోవటానికి భూములు సాగుచేసుకొంటున్న రైతులకు ఎకరానికి మూడువేల రూ. చొ॥న లీజు చెల్లిస్తున్నారు. ఈ ప్రాంతంలో మంత్రి పెంచిపోషిస్తున్న పెత్తందారీ ముఠాలు సాగిస్తున్న అరాచకాలకు భయపడి తమభూములను స్వంతం చేసుకొని వ్యవసాయం చేసుకోవడానికి రైతులు ముందుకురాని పరిస్థితి నెలకొని వుంది. అయితే మంత్రి జైల్లో వుండటం, వాన్‌పిక్ రద్దుకోసం మంత్రులే రంగంలోకి దిగటంతో భూములు తమకే దకుతాయన్న ఆశతో ఈ ప్రాంత రైతాంగం ఉన్నారు. అయితే స్వయంగా జిల్లా మంత్రి వాన్‌పిక్ భూముల్లో ఏరువాక ప్రారంభించినా, అధికార పార్టీ నాయకుల మధ్య వైరుధ్యాలు ఎంతోకాలం బ్రతికి బట్టకట్టలేవు. కనుక, వాన్‌పిక్ రైతాంగం ఇంతకాలం తమ భూముల కోసం సాగించిన సంఘటిత పోరాటాల వెలుగులో దృఢంగా అడుగులు ముందుకు వేయాలి. రాష్ట్రంలో సెజ్‌లకు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటాలకు 'వాన్‌పిక్' భూముల పునఃస్వాధీన ఉద్యమం స్ఫూర్తినిచ్చేలా ముందుకు సాగాలి. ✡


జనశక్తి ప్రచురణ

**విప్లవ ప్రజా ఉద్యమం**

**విప్లవ ప్రజా ఉద్యమ సమస్యలు సావధానంగా చర్చిద్దాం!**

**కామ్రేడ్ విశ్వం వ్యాస సంకలనం**

వెల: 10.00

కాపీలకు :

**మైత్రీబుక్‌హౌస్**

జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్,

విజయవాడ-2

# ‘పీడితవర్గ ప్రజాఉద్యమాల నిర్మాణానికి పునరంకితమవుదాం’

## కా॥ టియన్ 36వ వర్థంతి సభలో కామ్రేడ్ జస్వంతరావు పిలుపు

**విజయవాడ, 5-8-12 :**

విప్లవయోధుడు కా॥ తరిమెల నాగిరెడ్డి 36వ వర్థంతి సభ సిపిఐ(యం.యల్) కృష్ణా జిల్లా కమిటీ నాయకత్వాన స్థానిక స్వాతంత్ర్య సమరయోధుల సంఘ భవనంలో జరిగింది. సభా ప్రారంభానికి ముందుగా కా॥ టియన్ చిత్రపటానికి పార్టీ విజయవాడ నగర కార్యదర్శి కా॥టి.పూర్ణచంద్రరావు పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆ తర్వాత, సభకు వక్తలుగా విచ్చేసిన నాయకులందరూ కా॥ టి.ఎన్‌కు విప్లవ జోహర్లు చెప్పారు.

వర్థంతి సభకు అధ్యక్షత వహించిన పార్టీ జిల్లా కార్యదర్శి కా॥ ముప్పాళ్ళ భార్గవశ్రీ మాట్లాడుతూ, కా॥ టియన్ గడిపిన విప్లవకర జీవితం ఎంతో ఉత్తేజాన్ని కల్గిస్తుందనీ, ఆయన కమ్యూనిస్టు ఉద్యమంలో నెలకొన్న మితవాద, అతివాద రాజకీయాలపై రాజీలేని పోరాటం సాగించారనీ, ముఖ్యంగా కమ్యూనిస్టు విప్లవకారులుగా నిర్మాణయుతులై బాధ్యతలు చేపట్టిన కాలంలో చారుమజుందార్ వర్గీయులు సాగించిన అతివాద దాడులను నిబ్బరంగా ఎదుర్కొని ప్రజాయుద్ధ పంథా యొక్క గొప్పతనాన్ని చాటిచెప్పారనీ, 1970లలోనే కా॥ టియన్ తన కోర్టు స్టేట్‌మెంట్ అయిన ‘తాకట్టులో భారతదేశం’లో విదేశీ దోపిడీ ఎంత తీవ్రమవుతుందో వివరించారనీ, ఆ తర్వాత పరిణామాలను గమనిస్తే, పాలకవర్గాలు చేపట్టిన ప్రైవేటీకరణ, సరళీకరణ, ప్రపంచీకరణ విధానాలతో ఏకంగా దేశాన్ని అమ్మకానికే పెట్టారనీ, ప్రత్యేక ఆర్థిక మండళ్ళ చట్టం దానిలో భాగమేననీ పేర్కొని విప్లవకారుల ఐక్యత కోసం కా॥ టియన్ వేసిన బాటలో పార్టీ కేంద్రకమిటీ నాయకత్వం ముందుకెళ్తున్నదని చెబుతూ తన ఉపన్యాసం ముగించారు.

సిపిఐ (ఎం-ఎల్) కేంద్ర నాయకులు కా॥ పి.జస్వంతరావు మాట్లాడుతూ, పాలకవర్గాలు చేపట్టిన నూతన ఆర్థిక విధానాల ఫలితంగా విదేశీ దోపిడీ అన్ని రంగాల్లోకి జొరబడి ప్రజల జీవితాలను తీవ్ర నష్టకరంగా ప్రభావితం చేస్తున్నాయనీ, నిరుద్యోగం, అధిక ధరలు, అవినీతి లాంటివి చుట్టుముట్టి ప్రజలను వేధిస్తున్నాయనీ, వ్యవసాయ రంగంలో సంక్షోభాన్ని తీవ్రంచేసిన ఫలితంగా ఆహార భద్రత సమస్యను దేశం ఎదుర్కొంటున్నదనీ, లక్షింపేటలో దళితులపై పెత్తందారీ కుల దురహంకార శక్తులు సాగించిన మారణకాండను ఆర్థిక, సామాజిక కోణాల నుంచి నిశితంగా పరిశీలించాలనీ, పీడితవర్గ ప్రజలతో మమేకమై ప్రజా ఉద్యమాలను నిర్మించడం ద్వారానే కా॥ టిఎన్‌కు నిజమైన నివాళులు అర్పించగలుగుతామని కా॥ జస్వంతరావు తన ప్రసంగంలో పేర్కొన్నారు.


కా॥ తరిమెల నాగిరెడ్డికి నివాళులు

స్వాతంత్ర్య సమరయోధుల సంఘం నాయకులు శ్రీ వేములపల్లి వామనరావు, కా॥ టిఎన్‌తో తనకున్న పరిచయ, అనుభవాలను వివరించారు. చిల్లర వ్యాపార రంగంలోకి విదేశీ దోపిడీ ప్రవేశించడం చాలా ఆందోళన కల్గిస్తున్నదనీ, ప్రజా సమస్యలపై కమ్యూనిస్టు శక్తులు ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం నేడెంతో ఉందనీ, ఆ క్రమంలో కమ్యూనిస్టు శక్తులు ఐక్యం కావాలని బలీయంగా కోరుకుంటున్నానని ఆయన చెప్పారు.

సమతామార్గ్ నాయకులు, కా॥ వాసిరెడ్డి కృష్ణారావు మాట్లాడుతూ, దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమంలో పేర్గాంచిన కా॥ టిఎన్‌ని తలచుకోవటం ఎంతో ప్రాధాన్యత కల్గిన సందర్భం అనీ, 1969లో కా॥ టిఎన్ పార్లమెంటు, అసెంబ్లీలను బాతాఖానీ క్లబ్‌లతో పోల్చారనీ, కాని అవి ఈనాడు అంతకంటే కూడా దిగజారిపోయాయని విమర్శించారు. నేడు మరింత సంక్లిష్టంగా మారిన పరిస్థితుల మధ్య కా॥టిఎన్ లాంటివాళ్ళు చూపిన బాటలో మరింత సృజనాత్మకంగా ఉద్యమాలను మలచటం అవసరం అనీ, దీనికి ఖచ్చితమైన సిద్ధాంతం లేకుండా ముందుకు వెళ్ళలేమనీ, అందుకు కా॥ టిఎన్ అందించిన స్ఫూర్తితో ముందుకెళ్ళాలనీ చెప్పారు.

ఏపిఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి కా॥ యద్దనపూడి సోనీ మాట్లాడుతూ, కా॥ టిఎన్ రచించిన ‘తాకట్టులో భారతదేశం’ను మరింత లోతుగా చదివి ఈనాటి పరిస్థితులకు అన్వయం చేసుకోవటం అవసరం అనీ, దోపిడీ శక్తులపై కా॥ టిఎన్ చూపిన బాటలో రాజీలేని పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు.

**కొండమోడు, 28-7-12 :**

ప్రముఖ విప్లవ కమ్యూనిస్టు నాయకుడు, విప్లవయోధుడు కా॥ తరిమెల నాగిరెడ్డి 36వ వర్థంతి సభ గుంటూరు జిల్లా - పిడుగురాళ్ళ మండలం, కొండమోడులోని కా॥ తరిమెల నాగిరెడ్డి నగర్‌లో కా॥ సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది.

ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర నాయకులు కా॥ డి.వి.ఎన్. స్వామి ఈ సభలో మాట్లాడుతూ కా॥ నాగిరెడ్డి దేశంలోని పార్లమెంట్, అసెంబ్లీలు ప్రజల సమస్యలను చర్చించే వేదికలు కావని, బాతాఖానీ షాపులని నిగ్గుతేల్చి చెప్పారనీ, అసెంబ్లీకి రాజీనామా చేసి ఈ దేశంలో సరైన విప్లవ పంథాకోసం విస్తృతమైన చర్చను ఆర్గనైజ్ చేసి, దేశంలో ప్రజాయుద్ధ పంథానే సరైన మార్గమనీ, ఆ బాటనే పీడిత ప్రజలు విముక్తి చెందుతారని, దానికోసం ప్రజలను విప్లవ పోరాటాలలోకి నడిపించాలని పిలుపునిచ్చారని అన్నారు.

ఆనాడే కామ్రేడ్ నాగిరెడ్డి భారతదేశాన్ని దళారీ పాలకులు తాకట్టుపెట్టారని విశ్లేషించారనీ, సామ్రాజ్య వాదులకు, పెట్టుబడి దారులకు ఊడిగం చేస్తూ సమస్త రంగాలలో వీరి పెత్తనాన్ని, దోపిడీని ఈనాడు మరింత తీవ్రం చేస్తున్నారనీ, ఈ దేశంలో సామ్రాజ్యవాదుల పట్టు పెరుగుతున్నదనీ, పాలకవర్గాలు నిస్సిగ్గుగా తాము ప్రజల పక్షం కాదని చెప్పుకుంటున్నారనీ, ఇలాంటి పరిస్థితులలో పీడిత ప్రజలందరినీ, సక్రమమైన మార్గంలో నడిపించడమే కమ్యూనిస్టుల ముందున్న చారిత్రక కర్తవ్యమని నొక్కిచెపుతూ ధృడనిశ్చయంతో ఈ కర్తవ్యాన్ని ముందుకు తీసుకుపోవడమే కా॥ నాగిరెడ్డికి అర్పించే సరైన నివాళి అన్నారు.

రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకుడు కా॥ నీలాద్రి రాంబాబు మాట్లాడుతూ కా॥ నాగిరెడ్డి భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ పీడిత ప్రజల పక్షాన నిలబడి, భూస్వామ్య, పెత్తందారీ వర్గాల దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప నాయకుడు అని, అందుకే తమ కాలనీకి ఆయన పేరు పెట్టుకోవడం జరిగిందనీ వివరించారు.

స్త్రీవిముక్తి సంఘటన జిల్లా నాయకురాలు కా॥ ఎం. నిర్మల మాట్లాడుతూ నాగిరెడ్డిగారి జీవితం ఆదర్శవంతమైనదనీ, పార్టీకోసం, పీడిత ప్రజలకోసం తన సర్వస్వాన్ని అంకితం చేశారనీ, పీడిత ప్రజల మౌలిక సమస్యల సంపూర్ణ పరిష్కారానికి పోరాటరూపమే మార్గమని నమ్మి ఆచరించిన విప్లవయోధుడు నాగిరెడ్డిగారని అన్నారు. కా॥తరిమెల నాగిరెడ్డి కాలనీ వాసులు ప్రధానంగా ఈ సభకు హాజరయ్యారు. ✡

# ‘భూమికోసం, ఆత్మగౌరవం కోసం లక్షింపేట దళితులు సాగిస్తున్న పోరాటాలను సంఘటిత పర్చాలి’

## చలో తిరుపతి, చలో విశాఖ, చలో విజయవాడ సదస్సులలో వక్తల పిలుపు


తిరుపతి సదస్సులో ప్రసంగిస్తున్న కా॥ బొజ్జా తారకం


విజయవాడ సదస్సులో ప్రసంగిస్తున్న కా॥ ఎస్. ఝాన్సీ


జూన్ 14న జరిగిన నరమేధాన్ని వివరిస్తున్న లక్షింపేట మృతునితల్లి బి. లచ్చుమ్మ

*రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) భాగస్వామ్య సంస్థగా ఉన్న ‘లక్షింపేట దళిత పోరాట సంఘీభావ కమిటీ’ పిలుపు మేరకు జులై 21న ‘చలో తిరుపతి’; జులై 28న ‘చలో విశాఖ’; ఆగస్టు 6న ‘చలో విజయవాడ’ కార్యక్రమాలు - లక్షింపేట దళితుల డిమాండ్స్‌ను ఎలుగెత్తి చాటుతూ, స్ఫూర్తిదాయకంగా జరిగాయి. ఆ కార్యక్రమాల రిపోర్టులను క్లుప్తంగా అందిస్తున్నాం.* -సంపాదకుడు

**తిరుపతి, 21-7-12 :**

శ్రీకాకుళంజిల్లా వంగర మండలం, లక్షింపేటలో జూన్ 12న 5గురు దళితులను కిరాతకంగా హత్యగావించిన పెత్తందారీ కుల దురహంకార శక్తుల చర్యలను ఖండిస్తూ, లక్షింపేట దళితులకు మడ్డువలస మునక, ప్రభుత్వ 250 ఎకరాల భూములను తక్షణం కేటాయించాలని డిమాండ్ చేస్తూ, దోషులైన బొత్స వాసుదేవరావు నాయుడును, అనుయాయులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ జూలై 21న చలో తిరుపతి పిలుపులో భాగంగా ‘లక్షింపేట దళిత పోరాట సంఘీభావ కమిటి’ ఆధ్వర్యంలో బహిరంగసభ జరిగింది. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వున్న నెహ్రూ లలిత కళాప్రాంగణంలో జరిగిన సభలో పలువురు దళిత, కులనిర్మూలన, రైతుకూలీసంఘాల ప్రతినిధులు మాట్లాడారు.

ముందుగా కమిటీ కన్వీనర్ కా॥ బొజ్జా తారకం మాట్లాడుతూ లక్షింపేటలో ముంపునకు గురికాని 250 ఎకరాల భూమిలో 190 ఎకరాలు కాపులు, 60 ఎకరాలు దళితులు గత పదేళ్ళుగా సాగు చేసుకుంటుండగా, కాపు పెత్తందారీ వర్గం కక్షగట్టుకుని దళితులను భూమి నుంచి గెంటేయడానికి గత చాలాకాలంగా దాడులకు తెగబడిందని, జూన్ 12న ఒక పథకం ప్రకారం దళిత పేటపై దాడి జరిపి క్రూరంగా 5గురు దళితులను హత్యచేశారనీ, కాపు పెత్తందారీ వర్గానికి పిసిసి అధ్యక్షులు బొత్స సత్యనారాయణ అండగా నిలబడ్డారనీ, దళితుడైన కోండ్రు మురళికూడా కాపు కులదురహంకారుల ప్రయోజనాలవైపే వున్నాడని వివరిస్తూ, ఈ 250 ఎకరాల భూమిపై దళితులకే హక్కు కల్పించటం ద్వారా సమస్య పరిష్కారానికి మార్గం సుగమమవుతుందని అన్నారు. బాధిత కుటుంబాలకు ఎలాంటి వ్యయ, ప్రయాసలు లేకుండా లక్షింపేటలోనే ప్రత్యేక కోర్టుని ఏర్పరచి నేరస్తులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కా॥ జి. సునీత మాట్లాడుతూ దళితుల చేతుల్లోకి భూమి వస్తేనే ఆత్మగౌరవంతో బతకగలుగుతారని, లక్షింపేటలోకూడా దళితులు భూమిని సాగుచేసుకోడానికి ముందుకువస్తే, కులదురహంకార పెత్తందారీ వర్గం సహించలేక దారుణంగా దళితులను పొట్టన పెట్టుకున్నారని, ఆత్మగౌరవం కోసం సాగించే పోరాటం భూమి సమస్యతో ముడిబడివుందని లక్షింపేట ఘటన కూడా మరోసారి దీనినే రుజువు చేసిందన్నారు. దళితులు, ఆదివాసీలు నిర్మాణయుతంగావున్నచోట భూస్వామ్య, పెత్తందారీ శక్తుల దాడులను తిప్పికొట్ట గలుగుతున్నారని, (తరువాయి 11వ పేజీలో)

**లక్షింపేట దళిత పోరాట సంఘీభావ కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబరు 6న ‘చలో ఢిల్లీ’ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి!**

Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010